శ్రీరస్తు.

రాజశేఖరవిలాసము.

కవిసార్వభౌమ

కూచిమంచి. తిమ్మకవి ప్రణీతము.

చెన్నపురి:

వావిళ్ల. రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ వారిచే

ప్రకటితము.

1924.

PRINTED

AT THE 'VAVILLA' PRESS

MADRAS.-1924

విజ్ఞప్తి.

ఈ "రాజశేఖరవిలాసము (భల్లాణచరితము)"ను రచియించిన కవి "అభినవ వాగనుశాసన, కవిసార్వభౌమ" బిరుదముల నందిన కూచిమంచి తిమ్మయ. ఈతఁడు తనకృత్యపత్యముల నన్నిటిని పిఠాపురపుఁ గుక్కుటేశ్వరస్వామి పేరఁ బెట్టి, పేరఁ బెట్టికొనిన తన బహుజన్మ దురిత కళంక పంకమును గడిగికొని యనపాయ మైనయశఃకాయమును నిలుపుకొన్న మంత్రికులాలంకారుఁడు. ఇక్కవి "సర్వపురమాహాత్మ్య" మనునొక్కగ్రంథమును పిఠాపురోపకంఠమున నున్న శ్రీభావనారాయణస్వామి కొసఁగి తనయద్వైతమతిని వెల్లడించినను మొత్తముమీఁద శివభక్తితత్పరుఁడే యనవలయును. ఇతఁడు కౌండిన్యగోత్ర పవిత్రుఁడైన కూచిమంచి. గంగనమంత్రి పుత్త్రుఁడు. తిమ్మన పౌత్త్రుఁడు. బయ్యన ప్రపౌత్త్రుఁడు. తల్లి లచ్చమ. గొట్టిముక్కల. రామయ్య కూఁతురు బుచ్చమ్మ యీతనిధర్మపత్ని. సింగన్న (రాజన్న), జగ్గన్న, నూరన్నలు తమ్ములు. జగ్గన, సింగన, నరసన్నలు పిన్నతండ్రులు. ఇతనికి వీరమ్మ, పాపమ్మ యను నిద్దఱు మేనత్తలుగూడఁ గలరు. ఈతనికి శైవమతరహస్యముల నుపదేశమిచ్చినగురువు దెందులూరి. లింగనారాధ్యుఁడు. ఈయనకు గ్రంథరూప మైనసంతతియె కాని యౌరసులు లేరని వినుకలి. ఇతఁడు క్రీ. శ. పదునేడవశతాబ్దాంతమున జనించి పదునెనిమిదవశతాబ్దాపరార్ధముదాఁక జీవించియుండెననికొందఱును, ఇంకనుగొంచెము పూర్వుఁడే యని కొందఱును దలఁచెదరు. ఈయన గోదావరీమండలమునందలి పిఠాపురసంస్థానములోఁ జేరినకందరాడ కుఁగరణముగానుండెనఁట. ఈయింటిపేరిటివా రిప్పటికిని పిఠాపురము చెంత నున్న చంద్రమ్మపాలెమున నున్నారని వినుచున్నాము. ఇయ్యనఘుఁడు నిరు

పేదవాఁడై యుండి తనపవిత్రజీవితమును గడపె నని కొందఱందురు. కాని యది యంత చర్చాసహముగాఁ దోఁచదు.

కవనముసొంపు.

ఈతనికవనము గంగాప్రవాహమువలె నిరర్గళప్రసారమై ద్రాక్షాపాకప్రచురమై రసోత్తరమై రసానుగుణపాకభూయిష్ఠమై వెలయుచున్నది. ఈయనకవనముంగూర్చి సమకాలీనుఁడును సంబంధియుఁ బ్రౌఢకమనీయ కవయిత్రన్యతముఁడు నగు నేనుఁగు. లక్ష్మణకవి

"క. హాటకగర్భవధూలీ
లాటనచలితాంఘ్రినూపురారావశ్రీ
పాటచ్చరములు తేనియ
తేటలు మాకూచిమంచి తిమ్మయమాటల్,"

అని సభాముఖమునఁ బొగడె నఁట.

ఈతని కిట్టి రసోత్తర మగుకవితాధోరణి యలవడుటకు

"ఈయనయక్షరాభ్యాసమునాఁడు తల్లి యీతని కభ్యంజనము సేయుచో నెత్తిని జమురు పెట్టి యంతలోఁ గార్యాంతరమున మనసు దగిలి పోయి యాపనిఁ జక్కఁబెట్టుకొని వచ్చునంతలోఁ గుక్కుటేశ్వర స్వామి యీబాలు ననుగ్రహింపఁ దలఁచి వృద్ధబ్రాహ్మణరూపమునఁ బొడసూపి యిరువదిగనుపులచెఱకు నొక్కదానిం దెచ్చి యిచ్చి యదృశ్యుఁడు కాఁగా నతఁ డాచెఱకుగడను భక్షించుచుండిన నదిచూచి కొంచెమెచ్చుతక్కువగా నీతని యీడువాఁడెయగు నీతనితమ్ముఁడు జగ్గన యాచెంత నాడుకొనుచున్నవాఁ డాచెఱకు నొడిచికొని యాతఁడు దినఁగా మిగిలిన పదిగనుపులను దా భక్షించెనఁట. దానం జేసి యా యిరువురకును నిక్షురసోపమ మగుకవితాధార కల్గెను."

అని యొకకథఁ జెప్పెదరు.

ఇది కల్పితమే యైనను కాకున్నను నీతనికవిత యిక్షురసోపమ మని పోల్చిన పోలిక యెంతయు హృద్యముగా నున్నది.

ఈతఁ డెంతగొప్ప ప్రబంధమునేని మిగులవేగముగాఁ బూరింపఁ జాలెడివాఁడఁట. అందును దనచరమకావ్య మగుశివలీలావిలాసమును

ముప్పదియొక్క దినములలోననే పూర్తికావించితి నని కవియె చెప్పి కొన్నాఁడు. ఇది యతిశయోక్తి యని కొందఱనుతము కాని యితఁడు పద్యములు పలుకుచూఱు విమర్శించి సెరసు లేఱి వంకలు దీర్చి యపూర్వకల్పనామృతముల నింపి మెఱుఁగడీయ కాని వెలువరింప మను నియమము గలవారిలోఁ జేరఁడు. గావున మన మంతగా సంశయింపఁ జనదు. ఇదిగాక యీదినములలోఁ బ్రవీణు లగుకొందఱ మహాకవులను పోటిపెట్టికొని తాము వారలకంటె మిన్నలమని చెప్పుచు కడుపుకక్కుఱితికి లోనై సింగములు చిఱుతపులులు మొదలుగా ఘోరములైన బిరుదవుఁబలకల ఱొమ్ముల వ్రేలఁగట్టుకొని వీథులవెంటఁ బరువులు వాఱి బలిగుడు కూయుచున్న, శతావధాన, పరశ్శతావధాన, సహస్రావధాన, అతిసహస్రావధాన నిపుణంమన్య భీషణ చాటుకవి కవిశార్దూలముల సాహసకార్యములఁ జూచువారికి తిమ్మన యొకనెలలో రెండాశ్వాసముల ప్రబంధము వ్రాసె నన్న వింతగాఁ దోఁచదుగదా?

ఈతని కృతులు.

(1) రుక్మిణీపరిణయము మేము ముద్రించినాము.
(2) సింహాచలమాహాత్మ్యము
(3) నీలాసుందరీపరిణయము మాచే ముద్రింపఁబడెను.
(4) అచ్చతెనుఁగురామాయణము మేము ముద్రించినదే.
(5) సారంగధరచరిత్రము } ఈ 2 ను చక్కనివ్రాఁతప్రతులు
(6) సాగరసంగమాహాత్మ్యము } న్నచోఁ బంప వేఁడెదము.
(7) రసికజనమనోభిరామము ముద్రించియే యున్నాము.
(8) సర్వలక్షణసారసంగ్రహము
(9) సర్పపురమాహాత్మ్యము [గద!
(10) కుక్కుటేశ్వరశతకము. 92 పద్యములదనుక ముద్రించితిమి
(11) శివలీలావిలాసము ముద్రించియున్నాము.
(12) రాజశేఖరవిలాసము (భల్లాణచరితము) ఇదిగో

ఇంకను నముద్రితము లైనయీతనిగ్రంథము లెందేని దొరకినచో నలవియగునంతవఱ కీరీతిని నిర్దుష్టములుగా ముద్రించి సహృద

యులకుఁ గాన్కవెట్టికొందుము. ఉన్నచో దయమీఱఁ బంపుఁ డని భాషాభిమానులఁ బదింబదిగఁ బ్రార్థించుచున్నాము.

ఇంకొకమాట.

కొందఱు తలఁచినట్లు ఈగ్రంథ మీతనిప్రథమప్రయత్న మగుట చేతనో మఱియే హేతువుననో కాని దీనియందు గవిత్రయేష్టములు కాని ప్రయోగము లందందుఁ జొనుపఁబడియుండుటయు కాక రేఫద్వయ సాంకర్యమును దఱుచు కానంబడియెడిని. లక్షణగ్రంథమును సైత మొనర్చి ప్రథితుఁడైన యిక్కవిపేర నిట్టి గ్రంథ ముండుట కేమికారణమో బహుజ్ఞు లగుదోషజ్ఞు లీతనిగ్రంథము లామూలాగ్రముగ శోధించి యీతనిమతమును లోకమున కనుగ్రహింతురుగాక.

నరాంకితము సేయమి,

తన కవితామహామంత్రశక్తిచే నెల్లరను రంజింపఁ జేసి బహుజనాదరమును బడసి విశేషముగా నప్పటి పిఠాపురపురాజగు మాధవరాయనిచేఁ గవిసార్వభౌమబిరుద మిచ్చి గారవింపఁబడినవాఁ డయ్యు నిక్కవి తనకబ్బములనొక్కఁడేని నరాంకితము సేయఁడయ్యె. మఱియు నట్లు సేయుటనుగూర్చి

“క. పనిబూని తుచ్ఛభోగం, బునకై కొఱగానిజనులఁ బొగడుట యెల్లన్
గనుఁగొన నిహపరదూరం, బని తలఁచి వినిర్మలాంతరంగుం డగుచున్.

చ. విను మఖిలేశ మర్త్యులకు వేడుకఁ గావ్య మొసంగి ధాత్రిపై
నొనరఁగ సౌఖ్యసంపదల నుద్ధతులై సుకవీంద్రు లుందు రా
ర్యనికరవంద్య నీ విహపరంబుల సౌఖ్య మొసంగుసామి వం
చును మది నెంచి నీకు సరసుల్ విని మెచ్చఁ బ్రబంధ మిచ్చెదన్.”

(రాజశేఖరవిలాసము.)

క. నృపులకుఁ గావ్యం బొసఁగిన, నపవర్గం బెడఁగఁ గలదొ యటు గాకున్నన్
ద్విప తురగ భూష ణాంబర, తపనీయాదికముచేతఁ దనుపం గలరో.

సీ. ద్విజపుంగవులకుఁ బ్రవేశింపఁగారాని పృథుగృహాంతరములఁ బ్రేమ నుండి
కృతియంతధర్మపద్ధతు లెవ్వి యెఱుఁగక ధరణిపై నడువఁ బాదములు లేక
గుప్తిగ్రియల్ చేయుమంత్రులు చెప్పినటు మీఱక నటించుచు ద్విజిహ్వాకలును గలిగి
వితతంబుగా వక్రగతులచేఁ బొదలుచుఁ బూని యేప్రొద్దును బున్నె రనుచు

గీ. గాఢరోషవిషానలోద్గారిఘోర,వక్త్రములు గల్గి దంష్ట్రదపస్తులగుచుఁ
జెలఁగుచుండెడు భోగిరాజుల భజింపఁ, గుటిలేతరబుద్ధి నెవ్వాఁడు గోరఁగలఁడు.
(సింహాచలమాహాత్మ్యము)

ఈరీతిని బ్రసంగము వచ్చినప్పుడెల్లఁ బలుతావుల నందందు నిందించియుండెను.

కథాసంగ్రహము.

"ఇందలికథాంశ మిప్పటి మన తెలుఁగునాటనున్న యారాధ్యులను శైవమతప్రవిష్టులలో మిగులఁ బావనముగా వాడుకొనఁబడుభల్లాణునిచరిత్రము. ఇదియామతమువారు పలువురచే గద్యపద్యద్విపద దండకాదిరూపములఁ బలుతెఱఁగుల రచియించఁబడి వాడుకలోనున్నది.

సింధుకటకాధీశ్వరుఁడును శివభక్తుఁడు నగుభల్లాణుఁ డనురాజు తనగురువునుమతి నడసి ఇష్టదాన మనునొక వ్రతముం బూని జంగములకు నేది యడిగిన దానినెల్ల నిచ్చెద నని శపథముచేసెను. అంత నీవృత్తాంతము విని నానా దేశములనుండి విభూతిరేఖలు మెఱయ, రుద్రాక్షసరములు వ్రేల, కొమ్ముచెంబులు బట్టుకొని, పిడిగంటలు వాయించుకొనుచు, శంఖములూఁదుకొనుచు, జింకతోళ్లు దర్భాసనములు దగిలించికొని, ఆఱుపింజలమడతనీర్కావిధోవతులు గట్టుకొని కొలఁదికి మీఱు జంగాలురాఁగా రాజువారినందఱ నిష్టప్రదానముచేఁ దృప్తులఁగావించుచుండెను. అంతనీవృత్తాంతమును నారదువలనవినిసంతసించితనభక్తినిమహిమ నరయఁగోరి శంకరుఁడు కైలాసమునుండి తరలి జంగమవేషధారియైవచ్చి యారాజుంగాంచెను. రాజును నత్యంతభక్తితో నాజంగమేశ్వరు నారాధించఁగా నాతఁడెద్దియుఁగోరక తనకుఁ బదువుఁదనమే జీవనముగాఁ గల లంజె నిమ్మని కోరి, యది యత్యంతానుచితమని రాజెంతబోధించినను నాదొంగజంగము వినఁడయ్యెను. ప్రతిజ్ఞాభంగభయభీరు వగురాజును నాతని వేశ్య నొసఁగనొప్పికొనియూ రెల్ల వెదకినను నాయీశ్వరునిప్రేరణచే నొక్కసానియు లభించదయ్యెను. అంత రాజు ఖిన్నుఁడై యెటులైన మాట దక్కించుకోవలె నని తనభార్యను బతిమాలి యాపెను వేశ్యంబోలెఁ గైసేసి యాతనికొసం

గెను. టక్కరిజంగమురూపున నున్నశివుఁడును వానిసత్యసంధత్వమునకును భక్తితత్పరత్వమునకును సాహసమునకును గడునలరి, యాతనికి నిజరూపు జూపి యనుగ్రహించి యారాజశేఖరుని వానియిరువురు భార్యలతోఁగూడ బొందితోఁ గైలాసముఁ జేర్చి వానికిఁ బ్రమథాధిపత్య మొసఁగెను."

అనునీకథను మనతిమ్మన ప్రబంధముగాఁ గొన్నివర్ణనలు పెంచి వ్రాసెను. ఇక్కవియొక్కయు రాజశేఖరునియొక్కయు దేశకాలాదులం గూర్చిన విశేషములను దఱచి తెలిసికొనునంశము చదువరులకే విడిచి యిఁక నీతనిశైలీప్రదర్శనార్థము కతిపయపద్యము లిందలివి చూపఁబడును.

పురవర్ణనము.

మ. శశికాంతోపలజాలనిర్మితమహాసౌధాగ్రభాగోల్లస
ద్విశదాబ్జారిముఖీజనాంచితముఖావిర్భూతమందస్మితా
తిశయప్రస్ఫుటకౌముదీముదితహృద్దేశానిశోద్యచ్చకో
రశకుంతావళి గ్రొవ్వి తనర్చుఁ జెలువారన్ దత్పురం బెంతయున్.

మ. లలనల్ తత్పురిసౌధవీథులను డోలాకేళిచే నుండి తా
రలు బాలార్కుని మింటఁ జూచి తమపాదాబ్జద్యుతిం బోలరాఁ
గలకెందమ్మి యటంచుఁ బాదములఁ ద్రొక్కన్ దంతముల్ రాలి య
ట్లలరెం గావె సహస్రపాదుఁ డనుపేరావాసరస్వామికిన్.

చ. మరకతరత్నసంఘటితమానితకుడ్యకదంబజాలకాం
తరములనుండి వేవెడలు తద్ఘనసారపుధూపధూమముల్
పరువడిఁ జూచి నీలఘనపంక్తు లటంచు నటించు నెంతయున్
గుఱుతుగ మేదినీస్థలినిఁ గోర్కెలచే శిఖినీసమూహముల్.

గిరివర్ణనము.

చ. చని కనియె న్నిలింపమునిసంతతభవ్యయశోవిశాలమున్
సనకసనందనప్రముఖసాధుగణస్తుతిమూలము న్నపా
వనతరసానుదేశపరివర్తితకిన్నరకంబుకంధరీ
జనమృదుగానమోదితభుజంగమజాలము శ్వేతశైలమున్.

సీ. ప్రకటితసహకారపల్లవోద్యత్ఖాదనామోదపరభృతోద్దామరవము
ఘననితంబస్థలోద్గాఢలీలాలోలగీర్వాణకామినీగీతరవము

చారుమారుతపూరితోరుతరశాఖా కీచకానీకప్రకీర్ణరవము
సదమలవరఘురీసందోహసంరూఢ మానితఘూర్ణాయమానవనము
తే. సతతగంగాతరంగసంగతబలాక, చక్రసారసహంసాదిశకునినిరవము
నొక్కటంగ జెలంగు మిగులంగ నర్ణోత్సవముగ, సురుచిరంబైనయమ్మహీధరమునందు.

అ స్త మ య ము.

మ. సరసీజోద్భవరక్తకారకుండు ఘుస్రస్త్రీమణిం బ్రేమతోఁ
గర మింపొంద నలంకరించుటకు వేగం గాంచి తా నీటిలోఁ
బరఁగన్ ముంచినయట్టిమేల్మి యగుబల్బంగారపుంబూదె య
న్కరణిన్ భానుఁడు పశ్చిమాంబునిధిఁ జక్కం గ్రుంకె నొక్కమ్మడిన్.
మ. గురుపత్నిన్ వరియించుద్రోహి తనుఁ గన్గొరా దటంచున్ సుధా
కరురాకల్ మది నెంచి పద్మిని సువక్త్రంబుం గడు న్వంచె న
ట్లరయం బుణ్యవధూమణుల్ ధరణి నత్యంతోగ్రదోషాత్మునిన్
సరవి న్గన్గొన నొల్లకుందురుగదా చర్చింప నెంతేనియున్.

చ ం ద్రుఁ డు.

సీ. అజుఁడు చకోరామరానసార్థము నిల్పఁ గొమరారునమృతంపుఁగుండ యనఁగ
బతిరాకకును నిశాసతి హారతిం బట్టు బాగైనరజతంపుఁబాత్ర మనఁగ
ఘనపాంథహృత్పద్మవనములు గలఁచంగఁ దవిలియేతెంచుచాందంతి యనఁగ
దొగకన్నె ముదమంది నగుఁగాక యనుచుఁ బ్రాజ్ఞగము చూపెడుదర్పణం బనంగ
తే. విశదకాంతుల నంతంత వృద్ధిఁబొంది, శీతకరబింబ మింపొందఁ జెలఁగి దిశల
సాంద్రతరముగఁ జంద్రికాసమితి దనరెఁ, గోరికలమీఱి కేరం జకోరకములు.

వేశ్యాదూషణము.

ఆ. విటుఁడు లేనిరేయి వేదనఁ జెందుచు, నిదుర కంటి కెఱుఁగ నేర కుండి
కా సొసంగునట్టి కడజాతివాఁడైనఁ, గల్గఁ గోరు వారకాంత మదిని.
సీ. కడుఁ గురూపినినైనఁ గందర్పనిభుఁ డంచు నభినుతి యొనరింతు రలఘులీల
నంత్యజన్మునినైన నమలవంశజుఁ డంచుఁ బల్కుదు రెంతయుఁ బ్రౌఢి దనర
నతిమూఢమానసుం డగుమానవునినైన సరసుఁ డటంచురు సరభసమున
బ్రహ్మహంతకునైనఁ బరమధార్మికుఁ డంచు గణుతింతు రెపుడును గ్రమముతోడ
తే. నెన్నఁ గల్గినసీతివిహీనునైనఁ, దవిలి సద్వృత్తనుం డంద్రు తమకు నొక్క
వీసమైనను గాసైన వీడెమైనఁ, జేతి కొసఁగినచో వెలచిగురుఁబోండ్లు.
ఉ. చిన్నెల వన్నెల న్వగలఁ జిత్రవిధంబుల ముద్దుమాటలన్
వెన్నెలనెన్నునవ్వులను వేమఱుఁ బిత్తరివాలుఁజూపులన్

సన్నల సైగల న్నిగుల జాణతనంబున వారకామినుల్
చెన్నుగఁ బల్లవప్రతతిచేత ధనంబులు దోఁతు రెప్పుడున్.

చ. పొలుపుగ నిన్నుఁ బాసి యొకపూఁట మహాయుగ మంచు నెంచువో
వలనుగ నీవు నన్నిటుల వంచనసేయఁగఁ బాడియే యిటుల్
దలఁపఁగ నీతియే యనుచుఁ దక్కుచుఁ బొక్కుచు నిక్కువంబుగా
పలుచినయట్లు మాయలను వారవధూటి భ్రమించుఁ బల్లవు౯.

జంగాలు.

సీ. కక్షపాలలు పైఁడికట్లబెత్తంబులు శంఖసంఖ్యల మించుశంఖములును
పిడిగంటలును కేకిపింఛంపుఁగుంచెలు ఛత్త్రము ల్వలితోళ్లు చామరములు
యోగదండంబులు యోగపట్టెడలును గండపెండేరము ల్కుండలములు
తనువులభూతిపూఁతలు కావివస్త్రముల్ మేలైనరుద్రాక్షమాలికలును

తే. శ్వేతకేతనములు రుద్రవీణియలును, బాత్ర మగునట్టిరజతంపుఁబాత్రికలును
గేలుఁదామర బలువైనశూలములును, మొలకబంగరుగిలుకుపావలును గలిగి.

సీ. అతులితవిమలపంచాక్షరీమంత్రంబు మించుకోరిక బఠియించువారు
తఱచుగా శైవకథారహస్యార్థము ల్మీఱ శిష్యవరుల కేర్పఱచువారు
సారెసారెకు నమశ్శర్వాయ రుద్రాయ పశుపతయే యని పల్కువారు
నడుగడుగునకుఁ గాహళాదిరవంబులు చెలఁగించుచును వేడ్క నలరువారు

తే. చిత్రగతులను గానంబుఁ జేయువారు, సరవితో గద్యపద్యముల్ చదువువారు
నగుచు గోటానుకోట్లొక మొగిని నడువ, సాగి రానేల యీనినచందమునను.

సీ. మల్లయ్య వీరయ్య మఱి విరూపాక్షయ్య జడముడిబసవయ్య శంకరయ్య
పిడిఘంటచిక్కయ్య భీమయ్య సోమయ్య శివ్వయ్య హరిణాంకశేఖరయ్య
మరులయ్య సంగయ్య మార్కండలింగయ్య పర్వతనాథయ్య పశుపతయ్య
శరభయ్య రుద్రయ్య కరపాత్రిసిద్ధయ్య శితికంఠయోగయ్య శ్రీగిరయ్య

తే. విశ్వనాథయ్య వీరమాహేశ్వరయ్య, యాదిగాఁ బేరు గల్గి మహాత్ములయిన
జంగమస్వాము లారాజసముఖమునకు, సరగఁ జనుదెంచి రత్యంతసంభ్రమమున.

ఇటు లింతకంటెను సరసములైనపద్యము లెన్నియో యున్నను గ్రంథవిస్తరభీతిని వాని నుదహరింప మానితిమి.

చెన్నపురి.
7—1—1915. } వావిళ్ల. రామస్వామి శాస్త్రులు అండ్ సన్స్.

శ్రీరస్తు.

రాజశేఖరవిలాసము.

పీఠిక.

శ్రీనగజాతనుద్యుతులు చెల్వు మెఱుంగులుగా వియన్నదీ
ధ్వానము లెల్ల గర్జితకదంబముగా రజతాచలాంబరా
స్థాని జనించు శర్వజలదంబు కృపారసధార మీఱ మ
స్నానసబర్హి నెంతయు ఘనంబుగ సంతస మొందఁ జేయుతన్. 1

ఉ. కరిముఖుఁ గన్నతల్లి శశిఖండవిభూషణుమూర్తి రాణి భూ
ధరవరు ముద్దుపట్టి నిజదాసగృహాంగణకల్పవల్లి కి
న్నరగరుడోరగాద్యమరసవ్యకిరీటమణిప్రభాతివి
స్ఫురితపదాబ్జ యా త్రిపురసుందరి మాకు నభీష్ట మిచ్చుతన్. 2

చ. వల్లవపల్లవాధరు లవారితభక్తిని బాలుఁ డంచుఁ ద
మ్మెల్లనఁ బిల్చి యొంతయును మే లగు క్రొవ్విరిబాళ్యసంగఁ దా
నొల్లక యుల్ల కప్పికొని యుంచినబంతు లొసంగు మంచు భా
సిల్లుకుచంబు లంటుచు హసించు ముకుందుఁ డభీష్ట మిచ్చుతన్. 3

గీ. కమలజార్చితమృదుపదకమల యైన, కమల మాయింట నెప్రొద్దు కడుముదమున
నెలకొని యభిలషితార్థముల్ గలుగఁ జేసి. చిరతరం బైనకృపను రక్షించుఁగాత. 4

క. ఎంచఁ దగునంచతేజని, జంచలగతి నెక్కుజాణ సరసిజగర్భుం
బంచితమతిచేఁ దానొన, రించుంగావుతను మాకుఁ బ్రేమన్ శుభముల్. 5

సీ. వేదాదివిద్యల వెలయించుపూఁబోణి నెఱి భక్తతతిఁ బ్రోచు నీలవేణి
యురుకవిత్వప్రౌఢి యొనగూర్చుకల్యాణి మహనీయపుస్తకమహితపాణి
నిఖిలగీర్వాణవర్ణితసద్గుణశ్రేణి నిజలోచనప్రభానిర్జితైణి
ఘనతరోత్తుంగసైకతసన్నిభశ్రోణి రాజీవభవుని గారాబురాణి
తే. సమదపికవాణి యవ్వాణి సంతతంబు, మదిని దైవార రచియించుమత్ప్రబంధ
మునసి దుర్దోషరహిత మౌనట్లు గాను, జిరకృపాస్ఫూర్తిఁ బరిపూర్తి చేయుఁగాత.

చ. పొలుపుగ నీశుకంఠమునఁ బూనిన యట్టికపాలమాలికల్
వలనుగఁ జూచి గొప్పలుగ పండినయుండ్రము లంచు భ్రాంతి లో
పల జనియించి తుండమునఁ బట్టి పడిం దివియంగఁ జూచు వి
ద్యలగురుఁ డేకదంతుఁడు ముదంబున మత్కృతిఁ బ్రోచుఁగావుతన్. 7

చ రవి శశి భౌమ సౌమ్య సురరాడ్గురు భార్గవ మంద రాహు కే
తువు లనఁ బేరుఁ గల్గి యలతోయజగర్భసురేంద్రముఖ్యు లా
దివిజుల కెల్లకోరిక లతిస్థిరమానసు లై యొసంగుచున్
భువిని బ్రసిద్ధులైన గ్రహముల్ మముఁ బ్రోతురు గావుతం గృపన్. 8

సీ. కచశైవలంబులఁ గటిసైకతంబుల గొమకారునక్షోజకోకములను
లాలితబాహుమృణాళనాళంబుల నిరుపమలోచనేందీవరములఁ
గమనీయతరపాదకహ్లారదళముల మానైన దరహాసఫేనములను
బంధురకరతలకంకేరుహంబుల వరవళి వీచికావ్రాతములను
తే. భాసిలుచు నుండు గిరిజావిలాససరసి, నమరఁ గ్రీడించుగిరిశహంసము మదీయ
దురితనీరంబు దిగనాడి నెరిని సుకృత, దుగ్ధములఁ గైకొనెడుఁగాతఁ దూర్ణగతిని.

సీ. ఆశాంతవిదితపుణ్యశ్లోకు వాల్మీకు నఖిలశాస్త్రాగమాభ్యాసు వ్యాసు
భాసురకవితాప్రభవభూతి భవభూతిఁ జారుతరాతియశోరుఁ జోరు
వీరారిభుజగమయూరు మయూరుని బంధురనవపుష్పబాణు బాణు
నసమవిద్వన్మనోహర్షుని శ్రీహర్షు సారవాక్యక్రియాశ్లాఘు మాఘు
తే. కలితవిద్యాసముల్లాసుఁ గాళిదాసు, బుధజనానందకరముఖాంభోజు భోజు
మఱియు గీర్వాణకావ్యనిర్మాణచతుర, సుకవీంద్రులఁ బ్రార్థింతు నగణితముగ.

మ. రమణన్ నన్నయభట్టుఁ దిక్కమఖి నెఱ్ఱాప్రెగ్గడ న్భాస్కరుం
గ్రమ మింపొందఁగఁ బోతనాహ్వయుని లోకఖ్యాతుఁ భ్రాజిష్ణుపూ
డమరేశున్ ఘను భీమసత్కవిని దధ్యం బొప్ప శ్రీనాథము
ఖ్యమహాంధ్రార్చితకావ్యకల్పకుల నేఁ బ్రార్థింతు నెల్లప్పుడున్. 11

సీ గురుతరకౌండిన్యగోత్రవిఖ్యాతుండు బయ్యనామాత్యుఁ డేభవ్యతాత
నిరతాన్నదానవర్ణితయశస్సాంద్రుండు తిమ్మనసచివుఁ డేధీరుతండ్రి
ఘనులు జగ్గనయు సింగన్నయు నరసన్న యనుమువ్వు రేమంత్రియనుఁగుఁదమ్ము
లలరఁ దిమ్మన్న రాజన్న జగ్గన్నయు సూరన్న యేమంత్రిసుతవరేణ్యు
తే. లానర వీరమ పాప మేఘునునిసహజ, లతిపతివ్రత లక్ష్మి యేచతురరాణి
యట్టి శ్రీకూచిమంచి వంశాబ్ధివిధుని, మజ్జనకు నల గంగనామాత్యుఁ దలఁతు. 12

క. ఛందమునుం గావ్యాదుల, చందము నిత్తైన నెఱుఁగ సతతము విద్వ
ద్బృందంబులకృపఁ గవితా, సందర్భం బొగి నొనర్తు సాహసవృత్తిన్. 13

చ. ఎనయఁ బ్రసూనదామ మెవ రేక్రియఁ గూర్చిన నందుఁ గల్గువా
సనలకుఁ గాదె మానవులు సంతసమందుదు రుర్వి నట్టిపా
వనతరశంభుభక్తి యనువాసనకు న్మది మెచ్చి మత్కృతిం
గనుఁగొని తప్పు లెన్నక తగం గరుణింపుఁడు సత్కవీశ్వరుల్. 14

వ. అని నిఖిలవిబుధ విబుధ వినుతిం గావించి మఱియు నిష్టదేవతాప్రార్థనంబుఁ జేసెద.

సీ. శ్రీమదిరీంద్రజాచిత్తసరోహంస హంససహస్రదివ్యప్రతాప
తాపసానేకసంతతరక్షణాధ్యక్ష యక్షేశసఖ దక్షయాగహరణ
రణరంగరిపునాశ రజతాచలనివాస వాసవార్చితపాదవనజయుగళ
గళమాలభూషణలలితహాలాహల హలధరానుజసన్నుతాజ్ఞనాంగ

తే. యంగసంభూతమథన సత్యప్రచార, చారణాపూరసోత్సవసతతవిభవ
భవ విరూపాక్ష యోగిహృత్పద్మపీఠ, పీఠపురికుక్కుటేశ కిల్బిషవినాశ. 16

సర్వలఘుసీసము.

తరుణశశిధరణ సువితరణ భయహరణకర యరుణ సరసిరుహనిభచరణయుగళ
మదనమదమథన ఘనకదనతలవిజయ గిరివదన జగదవన కరివదనజనక
వనజభవదమన పురదనుజకులశమన మునిమనుజసురవరద ప్రతిదినవిలసిత
బహుళతరవిభవ రిపుగహనదవదహన పటువిహగపతిగమననుత మహితచరిత
ధరణిరథ తరణిశతసదృశ హరత్రినయన, గరళగళ ధనదసఖ శుభద గగనచికుర
వరసుగుణనికర మృదుహృదయ శరధిశరధి, యురగవరభరణధరపరమపురుష గిరిశ. 17

క. దుర్గాధినాథ దివి జని, వర్గార్చితమృదులపాదవనరుహయుగళా
గర్గాదిమునిసన్నుత, భర్గా శ్రీకుక్కుటేశ భవ్యవిలాసా. 18

చ. విను మఖిలేశ మర్త్యులకు వేడుకఁ గావ్య మొసంగి ధాత్రిపై
నొనరఁగ సౌఖ్యసంపదల నుద్ధతులై సుకవీంద్రు లుందు రా
ర్యనికరవంద్య నీ విహపరంబుల సౌఖ్య మొసంగుసామి యం
చును మది నెంచి నీకు సరసుల్ విని మెచ్చఁ బ్రబంధ మిచ్చెదన్. 19

ఆ. తప్పు లున్నయెడల నొప్పులుగా నెంచి, పూని కావ్య మొనరఁ బూర్తిచేసి
కరుణమీఱ మాకుఁ గామితార్థములెల్ల, ఘనత నొసఁగి యేలుకొను గిరీశ. 20

క. అని విన్నవించి యాతని, ఘనతరకరుణావిశేషగౌరవమున నే
నొనరించెద నవ్విభునకు, జను లెల్లను బొగడఁదగిన షష్ఠ్యంతంబుల్. 21

క. ధీరునకు భక్తజనమం, దారునకు సురారిమదవిదారునకు మహో
దారునకు నఖిలజగదా, ధారునకు నఘౌఘవారిదసమీరునకున్. 22

క. సోమునకు రజతభూధర, ధామునకు నుదంచితాహిదామునకు నయో
ద్దామునకుఁ బ్రకటసద్గుణ, ధామునకున్ మౌళిశీతధామున కెలమిన్. 23

క. భవునకు శోషితసరసిజ, భవునకు నగణితసద్విభవునకు గౌరీ
ధవునకు వృషభేశ్వరసైం, ధవునకు గిరిబాంధవునకు ధవళాంగునకున్. 24

క. శూలికి విమలదయాసం, శీలికి గజదైత్యచర్మచేలికిఁ బురని
ర్మూలికిఁ బరిపాలితదివి, జాళికి నతహృత్పయోరుహాళికి భక్తిన్. 25

క. స్థాణునకు నురుచతుర్భుజ, బాణునకు జితప్రసూనబాణునకు బుధ
త్రాణునకు నిరతపోషిత, బాణునకున్ సత్యవాక్యపారీణునకున్. 26

క. నరకిన్నరవిద్యాధర, గరుడోరగ సిద్ధసాధ్య గంధర్వసురా
సురపూజితచరణునకును, హరిణాంకనిభప్రకాశుఁ డగుపశుపతికిన్. 27

క. భృంగిరిటనాట్యరతునకు, సంగరవిజయునకుఁ బాణిసారంగునకున్
గంగాధరునకు నబ్ధిని, షంగున కుర్వీరథునకు జగదధిపతికిన్. 28

క. యక్షాధీశ్వరసఖునకు, నక్షీణలసత్కృపాకటాక్షునకు గణా
ధ్యక్షప్రియునకు విదళిత, దక్షాధ్వరునకును ధర్మతాత్పర్యునకున్. 29

క. హరునకు గాంచనధరణీ, ధరకోదండునకు మృత్యుదర్పహరున కీ
శ్వరునకుఁ బీఠాపురమం, దిరకుక్కుటలింగమునకు దివ్యాంగునకున్. 30

వ. అనంతసాష్టాంగదండప్రణామంబులు సమర్పించి యద్దేవతాసార్వభౌమునకు నంకి
తంబుగఁ దత్కృపాతిశయమున నాయొనర్పం బూనినయట్టి రాజశేఖరవిలాసం
బునకుఁ గథాక్రమం బెట్టి దనిన. 31

కథారంభము.

ఉ. శ్రీకరలీలఁ దొల్లి మునిసింహు లనేకులు నైమిశాటవిం
బ్రాకటరీతి సూతుఁ గని ప్రశ్నముఁ బ్రార్థనఁ జేసి యొప్పుడున్
లోకములందు యోగిజనలోలుఁ డుమాపతి తత్కథావళుల్
చేకొని పల్కినన్ వినినఁ జేయు సౌఖ్యము లెట్టివాటికిన్. 32

సీ. అసమానఘోరదుఃఖారణ్యములకుఁ బ్రజ్వలితాగ్నికీలలు శంభుకథలు
ఘనతరాఘౌఘాంధకారంబునకు లసజ్జలజాప్తబింబముల్ శంభుకథలు

గాఢామితోగ్రదుష్కర్మోరగములకు సమదమయూరముల్ శంభుకథలు
అపమృత్యుముఖ్యదోషాంభోధరములకు జంఝూనిలంబులు శంభుకథలు
తే. సజ్జనస్తోత్రపాత్రముల్ శంభుకథలు, సకలసంపత్కరంబులు శంభుకథలు
శాశ్వతైశ్వర్యయుక్తముల్ శంభుకథలు, పావనఫలదాయకంబులు శంభుకథలు 33
తే. గిరిశకథలందు నీవు నేర్పరివి మున్ను, శంభునకు వేశ్యగాఁ బ్రియసతి నొసంగి
యతని కారుణ్యమునకుఁ బాత్రత వహించినట్టిమనుజేంద్రుకథఁ జెప్పవయ్య మాకు.
క. అనవుడు సూతుఁడు మునులం, గనుఁగొని వెస నిట్టు లనియె గౌరీశుకథల్
వినిపించెద నని పూనఁగ, జనులకుఁ దరమగునె యోగిసంఘములారా! 35

శా. వాణీశామరవల్లభాదు లగుగీర్వాణుల్ నిజంబొప్ప న
య్యేణాంకార్ధవిభూషణుం దెలియఁగా నింతేనియుం జాల రీ
క్షోణిన్ మానవుఁ డెట్లు నేర్చు వృషభక్తుల్ గొంద ఱాచక్రభృ
ద్బాణుం గాంతురు సత్కథావళులు నిత్యంబుం బ్రశంసించుచున్. 36
క. ఘనుఁ డగుపినాకిచరితలు, వినయవివేకజ్ఞుఁ డగుచు విలసిల్లెడుసూ
తునికిం దెలిసినవిధమునఁ, బనివడి యితరులకుఁ దెలియఁబడు జెప్పరయన్. 37
క. ఘనశైలంబులు ముంచెదు, వననిధిలో నోడ నిలిపి పడి నీఁదెడు మ
ర్త్యనికరణి భక్తియను నా, వను గిరిశకథాసుధార్ణవం బీఁదఁదగున్. 38
తే. అట్లు గావున నతనిపాదాబ్జయుగము, భక్తితో డెంద మది నిల్పి ప్రకటగతిని
మీర లడిగినకథ లెల్లఁ గోరికలర, నెఱుఁగఁ బలికెద వినుఁ డని యిట్టు లనియె.
క. శ్రీకరమై రిపుజనహృ, ద్భీకరమై త్రిభువనప్రథిత శివమతర
త్నాకరమై యనవరతము, భాకరమై సింధుకటక మనుపురి వెలయున్. 40
మ. శశికాంతోపలజాలనిర్మితమహాసౌధాగ్రభాగోల్లస
ద్విశదాబ్జారిముఖీజనాంచితముఖావిర్భూతమందస్మితా
తిశయప్రస్ఫుటకౌముదీముదితహృద్దేశానిశోద్యచ్చకో
రశకుంతావళి యై తనర్చుఁ జెలువారన్ దత్పురం బెంతయున్. 41
చ. అరయఁగ నప్పురిం గనకహర్మ్యతలంబులఁ గేళిసల్పుచుం
దరుణులయొయ్యారముల్ గని ముదంబున నచ్చరలెల్ల మెచ్చి భా
సురగతిఁ గాన్కలంపిన ప్రసూనపుదండ లనంగ నెల్లెడం
దఱచుగ రత్నతోరణకదంబము లందము మీఱు నెప్పుడున్. 42
మ. లలనల్ తత్పురిసౌధవీథులను డోలాకేళిచే నుండి తా
రల జాలార్కుని మింటఁ జూచి తమపాదాబ్జద్యుతిం బోలరాఁ

గలకెందమ్మి యటంచుఁ బాదములఁ ద్రొక్కన్ దంతముల్ రాలి యు
ట్లలరెంగాదె సహస్రపాదుఁ డనుపే రాహాసరస్స్వామికిన్. 43

తే. నాగరులు మేన నలఁదినవ్యచంద, నాగరుల సౌరభానిలం బానుచున్న
చంచరీకాళులో యనుసరణిఁ బొదలుఁ, బురివితానాంచలాంచితసురపమణులు.

చ. మరకతరత్నసంఘటితమానితకుడ్యకదంబజాలకాం
తరముల నుండి వేవెడలు తద్ఘనసారపుధూపధూమముల్
పరువడిఁ జూచి నీలఘనపంక్తు లటంచు నటించు నెంతయున్
గులుకుగ మేదినీస్థలిని గోర్కెలచే శిఖినీసమూహముల్. 45

మ. నెల యవ్వీటను గోటచాటుఁ జనుచో నీ టొప్పు నర్కోపమో
జ్జ్వలపంకేరుహరాగరత్నరుచివ్యాప్తిం బ్రకాశించుని
వ్వలిచెంతన్ బరిఘాంతరాంబుజతతుల్ వ్యాకోచభావంబుచే
నలరుం బున్నమ రేలు తన్మణిరుచుల్ హంసాళులన్ భ్రాంతిచేన్. 46

ఉ. గట్టిగ వెండిబంగరపుగట్టులె యిల్లును విల్లుఁ గాఁగఁ జే
పట్టియు భిక్షుకుం డిరుగుభర్గుని జేటివిభూతియంచుఁ బె
న్గట్టుల మించువిత్తముఁ గ్రక్కన వెచ్చము చేయుచుండు ర
ప్పట్టణమర్త్యసంఘములు స్వవిభూతిఁ జెలంగి యెప్పుడున్. 47

క. వేడుక నజుతో వాదం, బాడఁ బులకితాంగు లగుదు రాపురిలోనం
బాడబులు దురితజలనిధి, బాడబు లని జగములెల్లఁ బ్రస్తుతిసేయన్. 48

క. మారుని యాకారముఁ బలు, మారును నిరసించురాకుమారులు వీటన్
మాఱుండు లేక నడిఁ బరి, మాఱుతు రరివరులఁ దృణముమాఱుగ నెపుడున్. 49

క. ధనదుఁ డనుపేరుమాత్రము, తన కబ్బెంగాక పిలిచి ధన మెవ్వరికి
చ్చెను యతఁడంచు నెంచుచు, ధన మిత్తురు బుధులఁ బిలిచి తత్పురివైశ్యుల్.

క. ధరణీసురాంఘ్రిసేవా, నిరతులు శ్రీకంఠభక్తినిపుణులు రిపుకుం
జరసమదయహార్యత్ములు, సురుచిరయశు లందుఁ గలుగుశూద్రజనంబుల్. 51

సీ. వలనొప్పు నీదండ వలె నింతి మా కన్న దండ గావలె నేని యుండు కొనుము
కనుఁగొని యెద బంతు లానర నిమ్మపం డన్న గోరంటబంతులఁ గోరుకొనుఁడు
మారుబేరము లింక మాకెట్లమరు నన్న మరుమాట మేలగు మాయెడలను
ననుమోవిచివురునకును వెల యెంత న్నఁ బ్రియ మంచు దీనికిఁ బెనఁగఁదగునె

తే. యనుచు దముఁ జేరి నెఱదంటతెనముమీఱఁ, బలుకునలకోడెకాండ్రకు బ్రతివచనము
లొసఁగుచును బువ్వులమ్ముదు నుండుచుండు, వందముగ నెప్పుడును గొందఱిందుముఖులు

సీ. అలకంబు లలరించి తిలకంబు లొగి ఫాలఫలకంబులను ముద్దుగులుక దిద్ది
యందంబు లగుమంచిగందంబు లెనఁ దానందంబుతో గుబ్బలందు నలఁది
సింగారముగ మేల్మిబంగారుతోడవులు పొంగారువేడ్కఁ జేఁ బూనఁగఁ దాల్చి
బలువైనవిలువచేఁ జలువైనసన్నంపునలువలు రంగులు వారఁ గట్టి

తే. యనంగభవకేళిఁ గోరి దాయంగ వచ్చు, వల్లవులమానసంబులు పల్లవింపఁ
బొందుమీఱంగ విహరించుచుండు రెపుడు, వారకామిను లందు నవారితముగ. 53

శా. శుంభద్విక్రమరూఢిచే బలుసుఱుక్ శోభం బ్రకాశించువ
జ్జంభద్వేషణుచేతివజ్రమునకుక్ శంకించి చంచత్కృపా
రంభుం డావిభుచెంతఁ జేరినమహీధ్రశ్రేణు లన్నైకవడిక్
గుంభీంద్రంబులు గల్గియుండు నెపుడుక్ గోటానకోట్లప్పురిన్. 54

చ. గుఱుతుగ నప్పురిం గలుగు ఘోటకసంఘముతోడ నెంతయుక్
బరువిడ నోడి వేగ హరిణంబులు వాయునిశాధినాథ శం
కరులను జేరి డాయొన నధికం బగువైరము దీర్పలేక యా
కరణిన యుండెఁ దథ్య మిది కాదన వానికి నట్టు లేటికిన్. 55

తే రాజహంసప్రభులచేత రాత్రి పగలు, కుముదకమలాళి హెచ్చుచుఁ గొమరుదూప
రాజహంసప్రతతులచే రమ్యమైన, సరసు లలరారు నప్పట సరసు లలర. 56

సీ. అసదృశఫలపల్లవాహారలాలసశుకపికాదివిహంగశోభితములు
చంచత్ప్రసూనవనిష్యందన్మరందాభినందితనుందరేందిందిరములు
సతతవిలాససంచారనారీజనరమణీయగీతవిరాజితములు
సకలశ్రమాపనోదకభూరివిస్తారమానితచ్ఛాయాసమన్వితములు

తే. బకుళసహకారచంపకాశ్వత్థపూగ, నారికేళకపిత్థజంబీరపనస
కేతకీబిల్వముఖ్యభూజాతయుతము, లున్నతములొప్పు నప్పురియుపవనములు. 57

సీ. లలి బృహస్పతు లందు నలరు విప్రోత్తము లెన్నటి కల్పకము లందుఁ దరువులెల్లఁ
గామధేనువు లందుఁ గల గోగణములెల్లఁ బొసఁగ నచ్చర లందుఁ బువ్వుఁబోండ్లు
వలనొప్ప నుచ్చైశ్శ్రవంబు లందు హయంబు లైరావణము లందు వారణములు
గంధర్వవరు లందు గాయకానీకంబు లల వైజయంతు లందుల గృహంబు

తే. లభవనామజపంబె యుం దమృతసేన, గాఁగ సురలోకసుఖ మందె కల్గియుండు
రాజజంభారి భల్యాణరాయవిభుఁడు, కరుణఁ బాలించు తత్సింధుకటకమునను. 58

సీ. ఆతఁడు స్వప్నంబులందైన నెప్పుడు పాటిఁ దప్పి యసత్యభాషణములు
చూడఁ డొక్కండనైన సురుచిరసౌందర్యవరవధూజనముఖపద్మములను
వీడఁ డెంతటి యవివేకచిత్తులనైన శరణు వేఁడినభీతజనవితతుల
నోడఁ డత్యుగ్రరణోర్వీస్థలులనైనఁ జలితుఁడై శాత్రవసంఘములకు
తే. నతఁడు రాజేంద్రమాత్రుఁడే మతిఁ దలంప, నర్థిదారిద్ర్యతిమిరార్కుఁ డమితయశుఁడు
భవ్య శివదేవరాయ భూపాలసుతుఁడు, భూరివిభవుండు కళ్యాణభూధవుండు. 59

తే. ధర్మగుణకాండములె చాలఁ దనకుఁ దోడు, గాఁగ నరులను రక్షించు గణన లేక
ధర్మగుణకాండములె చాలఁ దనకుఁ దోడు, గాఁగ నరులను శిక్షించు గణన లేక.

సీ. అలచందురునియందు గలకందుఁ గని ముందు పలుచందముల నింద లలి నొనర్చి
ఘనలీలలను శూలిగళమూలమున నీలమును బోలురుచిజాలమును హసించి
తగ నీరిపై భూరి తరవారి యగుచీరఁ గని సారెకును గేరి వినుతిమీఱి
పికవాణి యగువాణి పృథువేణి గలపోణిమిని జాణతనమున మించనాడి
తే. కుందమందారవిశదారవిందచంద, నేందుమణిహారతారకాహీరవార
ములఁ దిరస్కృతి యొనరించుఁ జలము మిగుల, వరుసతోఁచుత నమ్మహీవరునికీర్తి. 61

సీ. కోరినయప్పుడే కురియును వర్షంబు భూమి ఫలించు నద్భుతముగాఁగ
మొదవులు పాలిచ్చు మూఁడువేళలయందు విడువక కాచును వృక్షతతులు
నెఱి నపమృత్యువు నెఱుఁగ రెవ్వారైనఁ జోరరుగ్బాధలు సోఁకు టరిది
జలతృణోపేతమై విలసిల్లు ధారుణి నిత్యోత్సవము లొప్పు నిఖిలదిశల
తే. జనులు కలనైనఁ గలహంబుఁ గనుట లేదు, జాతిభేదంబు దప్పక జరుగుచుండు
జలరుహాప్తాన్వయాంభోధిచంద్రుఁ డగుచుఁ, దనరు కళ్యాణవిభుఁ డేలు ధరణియందు.

తే. సతతపుణ్యవ్రతలు గుణోన్నతలు పతికి, హితల శేషజగజ్జనసుతలు భాగ్య
వతులు రూపున మాఱటిరతులు సుమతు, లతులసౌజన్యయుత లిర్వు రతనిసతులు. 63

ఆ. వారిలోన నగ్రవనజాక్షి చల్లాంబ, మఱియుఁ జిన్నపొలఁతి మల్లికాంబ
సవతు లెరుసు లేక సతతంబు మెలఁగుచు, సవతు లేక యుండ్రు సమ్మదమున. 64

సీ. కమనీయమేఖలాఘటితభూరినితంబ పోషితాశేషసద్బుధకుటుంబ
సుందరాస్యప్రభానిందితశశిబింబ మధురోష్ఠవిహసితమహితబింబ
చికురకోమలకాంతిజితమత్తరోలంబ కేవలతరకరుణావలంబ
యానావధానప్రహర్షితకాదంబ నిఖిలపాపౌఘావనీధ్రశంబ
తే. గురుజనానందకరలసద్గుణకదంబ, సేవకాభీష్టఫలదప్రసిద్ధసాంబ
శివ చరణ భక్తివాసనాంచిత కదంబ, సతత సత్యవ్రతాలంబ చల్లమాంబ. 65

శా. ఆ చల్లాంబవిలాసవైఖరులు భాషాధీశ భోగీశులున్
వాచాప్రౌఢిని బల్కఁ జాల రల గీర్వాణాబ్జపత్త్రాక్షులం
దాచెల్వం బొకయింతయుం గలుగ దిక్కైనట్టి యాలేమతో
భూచక్రంబునఁ గల్గు నిందుముఖులం బోల్పంగ నీ డౌదురే? 66

చ. కలికిపదద్వయంబునకుఁ గ్రక్కున నోడినవ్రీడఁ గచ్ఛపా
వళి తలఁ జూపఁ జాలక జవంబున లోఁతగు నీటిలోఁ బడెం
దలరఁగ నెఱ్ఱతామరలు దట్టపుకాంతికి నోడి తత్పదం
బులఁ బడి యెప్పుడున్ వదలిపోక భజించు నహర్నిశంబులున్. 67

తే. సకియజంఘాయుగంబుతో సాటిరాఁగఁ దలఁచియెదిరించియోడి డెందమునబలియు
భీతిచేఁ గాదె పొట్టలు పిగులుచుండుఁ, గలమగర్భంబు లెల్లనుఁ గ్రమముతోడ.

క. కరిగమనతొడలతోడుత, సరివోలఁ దలంచి చూచి చక్కఁగ నరఁటుల్
పెరిగి జిగితఱుగుఁగా కటు, తర మగునే పిల్లపిల్లతరములఁ దమకున్. 69

క. కలికిపిఱుందుల కెన గాఁ, బులినము లిసుమంత లెటులఁ బోలెడు నొకచోఁ
దుల తుల యనుచుండెడు వే,దులఁ దుల యన నేల వానితో సరి యగునే. 70

తే. అతివనడలకు నోడి రాయంచతుటుము, లరయ నిలువెల్ల వెల్లనై యాత్మలోనఁ
దద్విరోధంబు సాధింపఁ దలఁచి కాక, కమలజుని మోవఁ దమ కేమికారణంబు. 71

చ. చిరతరవిక్రమస్ఫురణచే సముదంచితకుంభికుంభముల్
పఱియలు జేసి తత్పిశితభక్షణ సేయుమృగేంద్రకోటులు లా
గురుకుచసూక్ష్మమధ్యమునకుం దగ నోడి యదృశ్య మయ్యెఁ గా
కరయ గుహాంతరాళముల నట్టు వసింపఁగ నేల వానికిన్. 72

తే. లలనవళు లెప్పుడును దారు నిలిచియుండు, నిలుకడయొకింతయును లేకచలనమొందు
చుండు నంచును బలుమాఱు నుల్లసమున, భంగత యొనర్చు జలధితరంగములకు. 73

చ. పొలఁతుకయారుతీ రలరఁ బొందుగ నాభి గుహా న్వసించుస
ల్లలితపయోధరద్వయమిళద్ఘనలేపన దివ్యసౌరభం
బులమలయాద్రిశృంగసముదంచితచంచలమందచందనా
నిల మనుచుం బయల్వెడలి నిల్చిననీలభుజంగమో యనన్. 74

చ. చలమునఁ జంద్రుఁ డేఁచఁగను జక్కన లాచెలిగుబ్బచన్నులై
పొలుపుగ నుద్భవించి మదిఁ బూనినసాధ్వస మెల్లఁ దీఱె త

ద్విలసిత నామధేయమున వేఱుఁ జెల్వగునట్టిచంద్రస
మ్మిళితములై వసించుఁ జెలిమిన్ మనెనో యన నొప్పు నెప్పుడున్. 75

క. విరిచెండ్లు నిమ్మపండ్లును, గర మొప్పగు పసిడిగిండ్లు కరికుంభములున్
సరిగా వా వడవర్ణిని, గురుకుచయుగళంబుతోడ గోరంతైనన్. 76

క. గళమునకు నోడి శంఖము, గళగళ మని పలుకుచుండెఁ గలకంఠంబుల్
పలుచందంబుల నయ్యె, గ్మలిసుస్వరమునకు నోడి మలినము లయ్యెన్. 77

సీ. వనజాక్షికెమ్మోవి కెనఁ బోల్పఁ దగు నని పల్కఁ దళాల్ గావె పల్లవములు
శుకవాణియధరంబునకు సాటి యౌనంచుఁ గీర్తింప జాల్గావె కెంపు లెల్ల
నెలనాగపెదవితోఁ దుల యంచుఁ బొగడంగ విలువ దేరునుగావె విద్రుమంబు
లింతివాతెఱతోడ నీ డనంగను గంధరహితంబు నగుఁ గాదె రక్తకంబు
తే. నరయ నెందులతోఁ బ్రతి యనఁగవచ్చుఁ, బలుచనై తేనె లొలుకుచు విలువదెగక
సతతఘనసారసౌరభోన్నతులఁ దనరు, కంబుకంధర రదనాంశుకంబునకును. 78

క. తలతల మనువజ్రంబులఁ, దళతళ మను నిందువదనదంతమరీచుల్
కలకల మనియెడు రాచిలు, కలకలమనసుల్ గలంచుఁ గలికిమృదూక్తుల్. 79

ఉ. తామరసాక్షి వీనుగవ తా నవసంఖ్యల నెంచఁజాలుఁ ద
త్కామినితళ్కుఁ జెక్కు లలకాముని చేతిమెఱుంగుటద్దముల్
సామజయానసాసికము సంపఁగిమొగ్గల నెగ్గులాడు నా
కోమలిలోచనంబులు చకోరగణంబుల నేలు నెంతయున్. 80

క. వనితారత్నంబునవుం, గనుబొమ లందమున మీఱుఁ గందర్పునిచేఁ
దనరెడి సింగిణివిండ్లో, యనుచున్ జను లెల్లఁ జూచి యభినుతి సేయన్. 81

మ. నెరి నబ్జాహ్వయ మిర్వురందు నలరన్నీరేజతారేశు లా
తరుణీరత్నము ముద్దునెమ్మొగముచందం బంద వాదించుచో
సరసీజాతవళి యోడెఁ గా దని యొరుల్ చర్చింప సర్వోర్వికిం
గర మాహ్లాదము చేయుచంద్రుఁ గని స్రుక్కెన్ వాని కష్టేటికిన్. 82

క. నీలంబుల మృదుతరశైవాలంబులఁ జారుచమరవాలంబుల స
ద్రోలంబమేచకాంబుద, జాలంబుల నేలఁ జాలు సఖిచికురంబుల్. 83

సీ. జలజాక్షినునుకురుల్ శైవాలలతికలు రాజాస్యవళులు తరంగతతులు
కలకంఠిలోచనంబులు గండుమీలు సుముగంధివిపులహాసములు నురువు

లతివకంఠము దక్షిణావర్తశంఖంబు భాసుచన్నుబ్బులు పర్వతములు
కామినీమణిజంఘికలు మకరంబులు చానపిఱుందులు సైకతములు
తే. గంధగజయానచరణముల్ కచ్ఛపములు, రమణిహారంబు లెల్లను రమ్యమణులు
తరుణి ఘననాభి సుడి యనఁ దనరుచుండుఁ, గావున విలాసజలరాశి యీవెలంది.

వ. ఇవ్విధంబున ననన్యసామాన్యయౌవనసౌందర్యసద్గుణకదంబ యగుచల్లమాంబయు నఖిలగుణంబుల నప్పరమపతివ్రతారత్నంబున కెనయం దగుసుశ్లోకాదేవియుం దనకుఁ బ్రియపత్నులుగా నభీష్టభోగంబు లనుభవించుచుండి యారాజపురందరుం డొక్కనాఁ డాత్మగతంబున నిట్లని వితర్కించె నంత. 85

చ. సిరిగలనాఁడె మానవుఁ డశేషజగద్విభవంబు గాఁగ సు
స్థిరతర మైనకీర్తులను జెందుట మేలగు నట్టుగానిచో
సిరియును లేమియుం దలఁపఁ జీఁకటి వెన్నెలవాసి గాక యె
వ్వరికిని లేఁతప్రాయమును వార్ధకముం గురిగాదె మేదినిన్. 86

ఆ. ధనము గల్గియుండ ధర్మంబు సేయక, యున్న నదియుఁ బరుల కౌదవుఁ గాదె
తేఁటు లెల్లఁ గూడి తేనియఁ గూర్చిన, నోరుల కబ్బినట్లు లెఱుఁగుకొనిన. 87
తే. చెలఁగు చౌశీతిలక్షలజీవరాసు, లందు జనియించి నరకంబు లనుభవించి
యంతమీఁదట మనుజుఁ డై యవతరించి, తేటపడఁగ సమస్తంబుఁ దెలిసియుండు.
ఉ. అట్టిమనుష్యదేహ మటు లబ్బినయప్పుడె భక్తిమీఱఁగా
గట్టులరేనియల్లుని జగద్విభు నీశ్వరు నిందుశేఖరుం
గట్టిగఁ బూజసేయుచును గౌతుకలీలలఁ గీర్తికాంతఁ జే
పట్టి తుదిం దిరం బయినభవ్యపదంబును జెంద మేలగున్. 89
క. అడిగినవస్తువు లొరులకుఁ, గడువేడుక నొసఁగి ముజ్జగంబులకుం దా
నొడయఁ డగునట్టిశంభునిఁ, దడయక హర్షింపఁ జేతుఁ దథ్యము మీఱన్. 90
క. ఈవిధమున ప్రతికార్యముఁ, గావింపఁ దలంచుచోటఁ గావలయుఁ దగ
న్పావనతర గురుదీక్షను, ధీవరు లగువారలను నధికతరభక్తిన్. 91
క. పొసఁగ గురుచరణయుగళము, వెసఁ గాంచినయపుడె తొలఁగు వెఱచియఘంబుల్
విసవిసఁ బవనుఁడు జనమున, విసరిన విడి పాఱుజలదవిసరముభంగిన్. 92

మ. వనజాతప్రభవాండమండితజగద్వ్యాకీర్ణుఁ డై యొప్పుభ
ర్గునిఁ గాంచన్ గురు నాశ్రయింపవలయుం గుంభాంతరాపూర్ణద
ధ్యనిశోద్యన్నవనీత మారయఁగఁ దధ్యం బొప్ప నెట్లప్పుడుం
ఘనమందారము నాశ్రయించుకరణిం గౌతూహలప్రక్రియన్. 93

సీ. బహుజన్మజనితమౌ పాపాబ్ధికిని నావ చర్చింప సద్గురుచరణసేవ
కమనీయపుణ్యలోకప్రాప్తికిని త్రోవ చర్చింప సద్గురుచరణసేవ
చిరతరైశ్వర్యలక్ష్మీప్రదం బగు రేవ చర్చింప సద్గురుచరణసేవ
దుష్కర్మరుక్సంహతులకు నౌషధసేవ చర్చింప సద్గురుచరణసేవ
తే. వనజసంభవముఖ్యగీర్వాణబృంద, ములకుఁ గానంగ రానిశంభునిపదాబ్జ
దర్శనం బాత్మఁ గోరినధన్యమతుల, కిరవలరు సేవ సద్గురుచరణసేవ. 94
క. అని తలంచి యాక్షణంబున, దినకరకులజలధి శీతదీధితి యగున
జ్జనపాలవరుఁడు కౌతుక, మునఁ దనరారుచును వేగమునఁ బయనంబై. 95
సీ. గములు గూడుక కురంగములచందమున వేగమునఁ బారెడుతురంగములతోడ
నరుణకచ్ఛైరవుగాఁ దరలి యాడెడు పెద్దగిరులఁ బోలెడుగంధకరులతోడ
నుతులు సేయఁగఁ జాలుగతులఁ జెల్వలరారు నతులశతాంగసంహతులతోడ
కుటిలారివరులఁ గోటులఁ జేసెడిమహోద్భటులు గల్గినవీరభటులతోడ
తే. హితులతో మాన్యు లగుపురోహితులతోడ, బుధులతోడను వంధిమాగధులతోడ
మఱియుఁ దక్కినపరివార మరుదుమీఱఁ, గొలువఁ జనియె నిలాభర్త గురునికడకు.
క. అటు లరిగి కనియె నరపతి, పటుశైవకథారహస్యభాసురహృదయున్
ఘటితాఖిలజనకామున్, నిటలాక్షుపదాబ్జభక్తినిధి నాచార్యున్. 97
క. కనుఁగొని వినయంబునఁ బద, వనజంబుల కెఱఁగి లేచి వసుధాధిపుఁ డొ
య్యన ముకుళితకరతలుఁడై, వినుతింపఁగఁ జూచి గురుఁడు వెస నిట్లనియెన్. 98
మ. క్షితినాథోత్తమ! నీకు నీసతులకున్ సేమంబె? నీమంబుతో
సతతంబుం బ్రజ నేలుచుండుదువె? నీసైన్యంబు లెల్లం బలో
న్నతి నొప్పారుటఁ జేసి శత్రువరులన్ మర్దించి యిష్టార్థముల్
కుతుకం బొప్పఁగ ధారుణీసురులకుం గొంచింప కీఁ జూతువే? 99
క. పరమర్మభేదనుండును, జిరమతిమంతుండు హితుఁడు శిష్టవ్రతుఁడున్
వరకులజుండునుఁ గరుణా, నిరతుండును నైనమంత్రి నీయొద్దఁ గలఁడే? 100
క. దేవాధీశ్వరునకు మును, జీవుఁడు దా మంత్రి యగుటచే ఘనుఁ డయ్యెం
గావున విభవముఁ గోరిన, భూవిభునకు మంత్రివరుఁడు భూషణ మరయన్. 101
ఉ. స్నానము సేయునీమమును శంభుపదార్చనఁ జేయుమర్త్యుఁడున్
దానలఁ గల్గుసస్యమును వారిరుహాహితుఁ డుండురాత్రియున్
మానిని గల్గుసౌఖ్యమును మంత్రివరేణ్యుఁడు గల్గ నొప్పున
మ్మానవనాథురాజ్యమును మానుగఁ దేటపహించు నెంతయున్. 102

వ. అట్లగుటం జేసి నేర్పరి యగుమంత్రి గలరాజు రిపులం జయించి యక్షీణ రాజ్య
సుఖంబు లనుభవించుం గావున సప్తాంగబలంబులకన్నఁ బెద్ద యగుమంత్రాంగబలం
బు పరిగ్రహించితివే యని మఱియు భవదాగమనప్రయోజనంబును సవిస్తరంబు
గాఁ దెల్పు మనిన నద్ధరావల్లభుం డిట్లనియె. 103

క. జననుత! మీ రాజ్ఞ యొసం, గినరీతి నొనర్చినాఁడఁ గృతపుణ్యా! భవ
ద్ఘనకరుణను నే నిచటికిఁ, జనుదెంచుట మీపదాంబుజంబులం గొల్వన్. 104

సీ. గురునాథ! జంగంబు గోరిన వస్తువు నెద్దియైన ముదంబు నివ్వటిల్ల
నొసఁగి జగంబులం దసమానకీర్తులఁ జెంది గిరీశుఁ డానంద మొందు
నట్లు గావించెద నని తగ నూహించి వ్రతము గైకొనఁ గోరి వచ్చినాఁడ
మీర లిందుల కిచ్చ మెచ్చి యాదరమున నీక్షింప నిప్పుడే దీక్ష యొసఁగి

తే. భూతి నొక్కింత నొసటిపైఁ బొట్టుబెట్టి, పాదతీర్థంబు మూర్ధంబుపైనిఁ జల్లి [డు.
యాజ్ఞ దయ సేయుమనుటయు నతనిఁ జూచి, యద్భుతంబొంది యాచార్యుఁ డనియెనపు

ఉ. ఓనరనాథ! భూరిగుణోన్నత! నీవిపు డాత్మలోపలం
బూనినకార్య మాపనభుగ్వరకంకణుఁ డైన నిష్ఠతోఁ
దా నొనరింపఁజాలఁ డన ధారుణిలో జను లెట్టు నేర్తు ర
ట్లైనప్రయోజనంబునకు నర్హమె నీ కిటు లూహ సేయుటల్. 106

ఉ. ఇప్పటిభక్తిమార్గము నరేశ్వర! చిత్తమునందు నెప్పుడుం
దప్పక నిల్పఁజాలుదువె? తద్విధ మెంతయు దుర్లభంబు నీ
కెప్పగిదిం జొసంగు! వసుధేశ్వరు లెక్కడ! చెప్పఁ జోద్యమై
యొప్పువ్రతంబు లెక్కడ? మనోభవరూప! యెఱుంగఁ బల్కుమా. 107

క. ఇచ్చెద రనువోటికిఁ గడు, వచ్చెద రాద్యులు చెలంగి వారికిఁ గృపతో
నిచ్చల్ గలుగుపదార్థము, లొచ్చెం బించుకయు లేక యొసఁగఁగ వలయున్. 108

ఉ. ఆరయఁ బుత్త్రి నైన సతి నైనఁ దనూభవు నైనఁ గాంచనా
గారము లైనఁ జెల్వ మగుకాయ మొకింతుకఁ గోసి యైన యా
ధారుణి నైన నిట్టిశపథం బొనరించినచోట నేటుగాఁ
గోరిక యెంతలే దనక గొబ్బున నీవలయుఁగా బుధాళికిన్. 109

చ. ఘను లరుదెంచి యీఁ దరము గానిపదార్థము లాసతోడఁ గో
రినయెడ నీయఁజాలక ధరిత్రిపయి న్నగుబాటుఁ జెందుకం

కైన విను భూవరా! మునుపటింబలె నూరక మేరతో వసిం
చినదియె మేలుసుమ్ము శశిశేఖరు నెమ్మదిఁ బూజసేయుచున్. 110

క. అదియునుగా కొకరొకడ గుడి, వదలి వెసన్ శిష్యవరుఁడు వ్రతభంగముచేఁ
బొదలినయప్పు డొకించుకఁ, గొదువంటుఁ జుమీ! తలంప గురునాథునకున్. 111

ఉ. నావుడు రాజశేఖరుఁడు నవ్వలరన్ గురుఁ జూచి పల్కె నో
దేవ! భవత్ప్రసాదమున ధీరత మీఱఁగఁ దద్వ్రతంబు పృ
థ్వీవరులెల్ల నెన్నఁగను వేడ్క నొనర్చెద సంశయంబు మీ
భావమునందు నిల్పక కృపామతి నానతియీవె శీఘ్రతన్. 112

మ. అరవిందోదరతుల్య పుణ్యయుతకార్యారంభసంరంభవి
స్ఫురితాక్షీణధ్వాంతరంగ మితరంబుల్ గోరుటల్ నేర్చునే?
చిరగీర్వాణతరంగిణీవిమలవీచీజాలలీలానిరం
తరసంతోషిత రాజహంస మిరవొందం జేరునే వాఁగులన్? 113

వ. అదియునుంగాక. 114

సీ. సతి నమ్మి మును హరిశ్చంద్రభూనాథుండు సత్యంబు నిలుపఁడే జగమెఱుంగఁ
దనతండ్రియానతిఁ దప్పక హర్షించి రాజ్యంబు వదలఁడే రాఘవుండు ?
శిబిచక్రవర్తి వాసిగఁ దొల్లి డేగకుఁ గొనకొని దేహంబు గోసియీఁడె ?
ఘనత మీఱఁ బరోపకారార్థము దధీచి తా నస్థు లొసఁగఁడే తనువు విడిచి?
తే. వారలెల్లను బృథ్వి నున్నారె యిపుడు?, సలలితం బగు ప్రఖ్యాతి వెలసెఁగాక
వినుము గురునాథ! యిఁకబెక్కులనగ నెందు, కటులసత్కీర్తి నిలిపెద నవనియందు.

చ. జలనిధు లింకినన్ ధరణిఁ జంద్రుఁడు గ్రుంకిన వేధ జంకినన్
జలజలమంచుఁ జుక్కలు కృశం బయి డుల్లిన భూమి క్రుంగినం
గులగిరులెల్లఁ బెల్లగిలి కూలిన దిక్కరు లోలి మ్రొగ్గినం
బొలుపుగ నీ వ్రతంబు పరిపూర్తి యొనర్తు శివుండు మెచ్చఁగన్. 116

వ. మహాత్మా! మీ యనుగ్రహంబువలన మన్మానసంబు సంతోషించుచున్నయది మీ
రిందులకు సంశయింపక శీఘ్రం బానతీయవలయు నని ప్రార్థించిన. 117

తే. అన్నివిధముల నీమది నెన్ని చూచి, గట్టిగా గుడి నిలుపఁగలట్టులైన
భూమిపాలక ! మాచేతిభూతి యంది, భూతనాథుని మెప్పింపు ఖ్యాతిమీఱ. 118

క. కరుణారసపూరితహృ, త్సరసిజుఁ డైయపుడు గురుఁడు జనపతినొసటన్
సరగున భూతి యొకించుక, తిరముగ నిడి యాజ్ఞ యొసఁగ దినకరకులుఁడున్. 119

క. శరణార్థి యగుచు శిరమున, గురుపదతీర్థంబుఁ జల్లుకొని సద్భక్తిం
బరివర్తింపుచు నొయ్యన, మరలెం బురి కధికసంభ్రమం బలరారన్. 120

ఉ. అంతఁ గొలంత లేక బల మంతయుఁ జెంత ననంతవాజులన్
దంతుల నెక్కి యొంతయు నితాంతజవంబున నంతకంతకుం
బంతము మీఱ నింతలుగ బంతులుసాగి యొకంత రాఁగ భూ
కాంతుఁడు సొచ్చె నప్పురముకాంతలు సేసలఁ జల్లుచుండఁగన్. 121

చ. అలికులవేణు లెల్ల మణిహర్మ్యతలంబుల నిల్చి చెల్వగాఁ
గలువలు నాణిముత్తెములు గాఢముగాఁ బయిఁ జల్ల నప్పుడా
జ్జలజహితాన్వయుం డలరెఁ జారుతరంబుగఁ దారకాగణం
బులు బలుదిక్కులం గొలువఁ బొల్పగు చల్లనిచంద్రుఁడో యనన్. 122

తే. రమణఁ దళుకొత్తు మేదినీరమణునకును, బసిఁడిపళ్లెరములను దీపముల నుంచి
రమణు లతనునికంఠహారమణు లనఁగ, నిచ్చ నలరుచు నారతు లిచ్చి రపుడు. 123

తే. ఇందుకాంతావళులభావ మెల్లఁ గఱఁగ, రా జుదయపర్వతమునుఁ జేరంగ నెఱిఁగె
నిందుఁ గాంతావళులభావ మెల్లఁ గరఁగ, రాజుదయపర్వతమును జేరంగ నెఱిఁగె.

వ. ఈచందంబునఁ బౌరసుందరీసందోహం బమందం బగు నానందంబు డెందంబులం
గ్రందుకొన నందంద పయిం దొలంగించెడు కుందాది సుమబృందంబుల గందం
బులు పొందుగా హృదయారవిందంబునకు విందొనర్ప వందిమాగధులు ముందరసం
దడిగొని వినుతింప దివ్యదుందుభినాదంబులు చెలంగఁ గందర్పసుందరుం డగువ
వ్వసుంధరాపురందరుండు మందహాసం బొదవ నిజమందిరంబుం బ్రవేశించి తనయిం
దుముఖులుం దానును సుఖంబున వసించె నంత. 125

మ. సరసీజోద్భవరుక్మకారకుఁడు ఘస్రస్త్రీమణిం బ్రేమతోఁ
గర మింపొంద నలంకరించుటకు వేగం గాఁచి తా నీటిలోఁ
బరఁగన్ ముంచినయట్టి మేల్మి యగుబల్బంగారపుంబూదె యా
న్కరణిన్ భానుఁడు పశ్చిమాంబునిధిజక్కం గ్రుంకె నొక్కుమ్మడిన్. 126

తే. రాజు కువలయ మలరింప రాఁ దలంచు, టెంచి సమయాధికారి గట్టించినట్టి
భవ్యకహ్లారతోరణపంక్తి యనఁగ, సాంధ్యరాగము విలసిల్లె సాంద్రముగను. 127

మ. గురుపత్నిన్ వరియించుద్రోహి తనుఁ గన్గొరాదటంచున్ సుధా
కరురాకల్ మది నెంచి పద్మిని సువక్త్రంబుం గడు న్వంచె న
ట్లరయం బుణ్యవధూమణుల్ ధరణి నత్యంతోగ్రదోషాత్మునిన్
సరవి న్గన్గొన నొల్లకుందురు కదా చర్చింప నెంతేనియున్. 128

సీ. విటులపై మదనుఁడు వెడలుచో దిక్కులఁ గ్రమ్ముపికాళిసంఘ మ్మనంగ
మిగుల నిశాకాంత మేలుసుం గిడుకొన్న లాలితనీలచేలం బనంగ
బద్మబాంధవునితోఁ బాసి వర్తించువాసరలక్ష్మి ఘనదుర్యశం బనంగ
నజుఁడు విష్ణుపదంబు నమరఁ బూజించినఁ బరఁగునిందీవరప్రతతి యనఁగ
తే. నవనిఁ దమ నెందుఁ జొరనీక దవిలె నంచుఁ,దపనుఁడపరాబ్ధిఁబడెనింక దాఁగ నేల
యనుచు గిరిగుహలంగుండి యొనరవెడలు,కలుషతతి యనఁబర్వె దిక్కులఁదమంబు.

తే. పేర్మి రేఱేఁడు కుముదినిఁ బెండ్లియాడ,రమణఁ బఱతెంచు ననితిమిరమణి చదలు
మంగలంబున వేఁచినమంగళార్ధ, లాజలవరుసఁ దార లట్లనఁ జెలంగె. 130

తే. దృఢతమోభూతబాధితదిగ్వధూటిఁ, బ్రోవఁ దత్కాలఘనయోగిపూనికఁ దెచ్చి
నట్టిబల్లిద్విటీ యన నబ్జవైరి, యురుతరశ్రీలఁ దా నంత నుదయ మయ్యె. 131
సీ. అజుఁడు చకోరామరావనార్థము నిల్పఁ గొమరారునమృతంపుఁగుండ యనఁగఁ
బతిరాకకును నిశాసతి హారతిం బట్టు బాగైనరజతంపుఁబాత్ర యనఁగ
ఘనపాంథహృత్పద్మవనములు గలఁచంగఁ దవిలి యేతెంచుచాదంతి యనఁగఁ
దొగకన్నె ముద మంది నగుఁగాక యనుచుఁ బ్రాజ్ఞగముచూపెడుదర్పణంబనంగ
తే. విశదకాంతుల నంతంత వృద్ధిపొంది, శీతకరబింబ మింపొందఁ జెలఁగె దిశల
సాంద్రతరముగఁ జంద్రికాసమితి దనరెఁ, గోరికలమీఱ కేరం జకోరకములు.

వ. అయ్యెడ. 133

సీ. పట్టైనసిగలపైఁ బట్టుబొందులు జుట్టి వలిపెగుడ్డలఁ బొంక మలరఁ గట్టి
సొగసుగా నుదుటఁ గస్తూరిరేఖలు దీర్చి కడఁగి ముత్యాలచౌకట్లు గట్టి
కరములఁ బచ్చలకడియంబు లొగిఁ దాల్చి కంఠమాలికలు చొక్కమున నించి
చలువదుప్పటులు పైవలెవాటు గావించి కర మొప్పుచందనగంధ మలఁది
తే. మల్లెపూదండ లింపు శోభిల్లఁ బూని, పండుటాకులు కపురంపుబాగ లూని
పరఁగఁ జేపట్టి యొయ్యారిభామ లెసఁగ, విటులు విహరింపసాగి రవ్వేళయందు.

చ. చెలు వగుపెన్నెరుల్ దళుకుఁజెక్కులు నిద్దపుముద్దుమోములుం
గులుకుమిటారిచన్గవలు గొప్పపిఱుందులు వాలుఁజూపులు
న్గిలకిలనవ్వులున్ మిగుల నే టగుగాటపునాటిమాటలుం
గలిగి విటావళిం దిరముగా వలపింతురు వేశ్యలత్తఱిన్. 135

చ. చిలుకలతేఱునున్ జెఱకుసింగిణివిల్లును దేఁటినారియున్
బలుజిగురాకుటాలును వనప్రియసైన్యము పువ్వుదూపులున్

జెలఁగెడుమీనుటెక్కెమునుఁ జెన్నొదవ న్వెడలెన్ విటాళిపై
మలయమరుద్వసంతఘనమంత్రులఁ గూడి రతీశుఁ డయ్యెడన్. 136

క. పుండ్రేక్షుచాపమునఁ గడు, వేండ్రపుఁబువుటమ్ముఁ దొడిగి విరహిజనులఁ బె
క్కేండ్ర నపుడేసె మన్మథుఁ, డెంద్రాయని యొరుఁడు తన్నె నెదురుటలేమిన్.

చ. బలములఁ బొఁజుదీర్చి నిజబాణపరంపర లెల్ల నేర్చి దో
ర్బల మరుదారఁ జేర్చి కడుబాగుగ సింగిణిఁ జేర్చి లీలతోఁ
బలుమఱు నేసి యార్చి వరబంధురవేణులఁ దార్చి నాథులం
గలయఁగఁ గూర్చె నోర్చి యలకాయజువైఖరి నేర్తురే! యొరుల్. 138

ఉ. కొమ్మ లనంగనొప్పపుష్పఁగొమ్మలఁ జేరి వినూత్నదివ్యగం
ధమ్ములఁ గేరి మోవి నమితమ్ముగ తేనియఁ గ్రోలి సోలి యా
ముమ్మరమైనకోడిచను ముగ్గలమీఁదను వ్రాలి చాల సౌ
ఖ్యమ్ములఁ దేలె లీలఁ బురపావళి యన్ మధుపంబు లయ్యెడన్. 139

ఆ. అంతఁ గడఁక నంత కొంతకుఁ డంగజుఁ, డరయఁ దనదుభక్తవరునిపురము
జనుల నేఁచు టెఱిఁగి సరగ వేఁ జూచు కైవడిని వేగుఁజుక్క వొడిచె దివిని. 140

లయగ్రాహి.
కుక్కుటము లెంతయును బెక్కు లగుదిక్కులను నిక్కి మద మెక్కి భువి పిక్కటిల
మ్రోసెన్, జుక్కలును సోముఁడును గ్రక్కునఁదొలంగి రలజక్కవలు గేరె మరుఁ
డుక్కుచెడి పాఱెన్, జక్కఁగ విహంగములు జిక్కువడియున్న తమటెక్కు లల
రించుకొని చొక్కముగఁ బల్కెన్, గ్రిక్కిఱిసి తేఁటిగము లక్కమలరాజిపయిఁ
బొక్కుచుఁ జరించెఁ దొగ లొక్కట మునింగెన్. 141

చ. అతులతరార్చు లెల్ల నలరారఁగ నెంతయుఁ గ్రోధచిత్తుఁడై
నతజనఘోరకిల్బిషవనంబులఁ గాల్పఁగ నాత్మ నెంచి శ్రీ
ఘ్రుత నరుదెంచినట్టి యలగంధవహాప్తుఁడొ యవ్విధంబునన్
ధృతి నుదయించె జంభరిపుదిగ్గిరిపై హరిదశ్వుఁ డంతటన్. 142

క. పురజనము లపుడు కడున, బ్బురపుంగోరికల నంతిపురములలోఁ గ
ప్పురపుఁ ధూమము లిడి గో, పురములపైఁ గనకకుంభములు నిల్పి తగన్. 143

సీ. తీరుగా సాణిముత్తియపుఁబందిరు లిడి కలువలు నించి మేల్కట్లు గట్టి
గోడల నెల్ల రంగుగఁ జిత్తరువు వ్రాసి వీధులు దేవతావేశ్మములును

వింతగా నలరించి వృషభకేతనముల గీములయందెల్లఁ బ్రేమనునిచి
వీథులు జక్కఁగావించి చందనమునుఁ గస్తూరియునుగూడఁ గలిపి చల్లి
తే. యఖిలజనములు పురినెల్ల నమరఁజేసి, తప్పటికిమున్నె యొప్పాలకుప్పలయిన
తనవధూరత్నములుఁ దాను ధరణివిభుఁడు, వేగమేల్కాంచి తత్కాలవిధులఁదీర్చి

ఉ. తానము లాడి నియమమున ధౌతపటంబులు గట్టి యంత సం
స్థానమునందు భర్మమణిసంఘటితం బగు వేదిమీఁదటన్
భానుకులాగ్రగణ్యుఁ డగుపార్థివశేఖరుఁ డాత్మలోన నిం
పూనినవేడ్కతోడ శివపూజ యొనర్పఁగ సాగె నుబ్బుచున్. 145

సీ. ఆవాహనంబు వృషాధిపవాహున కాసనం బమలసింహాసనునకు
నర్ఘ్యం బనేకలోకాధారమూర్తికిఁ బాద్యంబు సుగుణసంపాద్యునకును
నిజభక్తి నాచమనీయ మీశ్వరునకు స్నానంబు వేడ్కతో స్థాణునకును
వస్త్రం బశేషగీర్వాణసన్నుతునకు బ్రహ్మసూత్రము పరబ్రహ్మమునకు
తే. గంధ మిభదైత్యదాననిర్గంధునకును, బుష్ప మశ్రాంతమునిజనపోషణునకు
ధూప మాననకాంతివిధూపమునకు, దీప ముష్ణాంశుకోటిప్రదీపునకును. 146

శా. నైవేద్యం బహిరాజకంకణునకుం దాంబూల మేపారఁ ద
ద్దేవేశార్చితపాదపంకజునకున్ ధీయుక్తి నీరాజనం
బావేశాత్మునకున్ సుమాంజలి రతీంద్రారాతికిన్ విస్ఫుర
ద్గ్రావస్థానునకుం బ్రదక్షిణనమస్కారంబు లర్పించుచున్. 147

సీ. మందారకుందారవిందనీలోత్పలబంధూకవకుళసౌగంధికములఁ
బ్రియ మొప్పఁ దులసికాబిల్వాదిమృదులతరోల్లసద్బహువిధపల్లవముల
ఘనసారచందనాగురుచారుగుగ్గులుకస్తూరికాదికవస్తువులను
దధిఘృతగోక్షీరమధురసనారికేళాంబువు లనెడుపంచామృతములఁ
తే. బొలుపు మీఱెడుకాంచనపుష్పములను, నాగవల్లీదళక్రముకభాగములను
సులలితాపూపసూపాన్నఫలతతులను, జనవరుఁ డొనర్చె నవ్వేళ శంభుపూజ. 148

వ. మఱియు గీత వాద్య నృత్తాది బహువిధానందంబుల నంబికారమణు నారాధించి యి
ట్లని వినుతింపం దొడంగె. 149

సీ. కలధౌతనగవాస! కరిచర్మమృదువాస! శరదిందునిభహాస! శరణుశరణు!
ఇనకోటిఘనదీప! కనకాద్రిపటుచాప! సనకాదినుతరూప! శరణుశరణు!
వరయోగిజనలోల! దురితాభ్రవాతూల! సురరాజవరపాల! శరణుశరణు
ఏణవంగరిపుభంగ! రమణీయధవళాంగ! చతురాగమతురంగ! శరణుశరణు

తే. సలిలతాంభోధితూణీర! శరణుశరణు!, శాశ్వతైశ్వర్యసంయుక్త! శరణుశరణు!
సాధులోకసురోర్వీజ! శరణుశరణు!, శరణు! విశ్వేశ! భూతేశ! శరణుశరణు!. 150

సీ. పొంకంబు గలమంచిజింక నంకంబుగాఁ గొంకక ప్రేమతోఁ జంక నిడికి
దిట్టతనంబుతో గట్టిగా సామేన గట్టులదొరముద్దుపట్టి నునిచి
వింతఁగా నికను బూబంతిగా జాబిల్లి నెంతయుసంతసం బెసఁగ నిలిపి
మేలైనయేనికతోలు శాలుగఁ బూని లీలతో ముమ్మొనవాలుఁ దాల్చి
తే. పొసఁగ భసితంబుఁ బూసి యాఁబోతు నెక్కి, గాలిమేఁతరిసొమ్ములఁ గడుధరించి
లచ్చిమగఁడును నలువయు మెచ్చిపొగడ, జగము లేలెదు నినుఁగొల్తు నిగమవినుత.

శా. నీరేజోద్భవముఖ్యులౌ సురమునుల్ నిన్బ్రస్తుతుల్ సేయఁగాఁ
దా రొక్కింతయు నేర రంచును బుధుల్ తథ్యంబుగాఁ బల్కఁ జో
సోరాజార్ధకిరీట! మర్త్యుఁ డిక నెట్లోపున్ బ్రశంసింపఁగా
గౌరీమానసపద్మషట్చరణ! శ్రీకంఠా! జగద్రక్షకా. 152

తే. శివశివా యని సన్నుతి సేయనేర, వినయ మొప్పారఁ బూజఁ గావింపనేర
మూఢుఁడను నన్నుఁ గృపఁజూడు మోదముతోడఁ, బార్వతీలోల సంతతభక్తపాల.

క. జయజయ పురదైత్యాంతక!, జయజయ శృంగారలీల! సదమలశీలా!
జయజయ నాకాధిపనుత!, జయజయ లోకాధినాథ! జయ పరమేశా! 154

వ. ఇట్లనేకప్రకారంబులఁ బ్రస్తుతించి తదనంతరంబ. 155

క. తరుణారుణాంశునిభభా, సురనవరత్నచయఖచితశోభితదివ్యా
భరణోజ్జ్వలాంగుఁ డయి యత్యురుతరచిత్రాంబరముల నొగి ధరియించెన్. 156

తే. అరయ రుద్రాక్షమాలిక లమర మెఱయ, ఫాలమున భూతిరేఖయు శ్రీల దనరఁ
బసిఁడిపావలు దొడిగి వైభవముచెలఁగఁ, గప్రపువిడెంబు సేయుచుఁ గౌతుకమున.

సీ. దివి పిక్కటిలఁ బెక్కుతెఱఁగుల నెడలేక భేరీమృదంగముల్ భోరుచెలఁగఁ
గంతునిచేతిచేమంతిబంతు లనంగ వంతుకెక్కినకళావంతు లాడఁ
దుంబురునారదాదులఁ దిరస్కృతి సేయుగాయకుల్ గీతముల్ కడఁగి పాడ
వందిమాగధులు చెల్వొంది ప్రస్తుతి సేయఁ జేరి భూదేవు లాశీర్వదింప
తే. రమణఁ బరిచారికలు ముందఱను బిఱుందఁ, బసిఁడిబెత్తులచేఁ బరాబరు లొనర్ప
రాజసంబున నంతఃపురంబు వెడలి, ఘనత సుర్వీశుఁ డాస్థానమునకుఁ జనియె. 158

సీ. చాలుచాలునఁ జాలునీలంపుఁబగడంపుఁగంబము ల్మితి లేనికాంతిఁ దనర
గారుత్మతపుమణు ల్గదియించినట్టిమేల్మేడగోడలు సొంపుమీఱ యలర
నిందుకాంతములఁ బొల్పొంద నొనర్చిన సోపానములు వింతశోభ లెసఁగ
వెలలేనివజ్రంపువేదిక ల్చెలువాఱ గోమేధికపుగవాక్షులు చెలంగ
తే. నతులవైడూర్యపుష్యరాగాదినీల, రత్నవస్తువు లెంతయు రమణ మెఱయఁ
గ్రొత్తముత్తెఁపుబెత్తులు గొమరుమిగుల, కొలువుకూటంబునందునఁ గూర్మితోడ.

క. కురుమగధచోళమాధవ, కరహాటమరాటలాటకర్ణాటకఘూ
ర్జరయవనముఖ్యధరణీ, వరు లెల్లం గొలువ భూరివైభవలీలన్. 160
సీ. వేదశాస్త్రపురాణవివిధరహస్యము ల్వరుసతోఁ గవిబుధావళులు దెలుప
సంగీతనృత్తాదిసరసవిద్యాప్రౌఢి కడువేడ్క నర్థిసంఘములు నెఱప
శైవవైష్ణవజైనచార్వాకబౌద్ధశాక్తేయులు తన్మతక్రియలు సెప్ప
కరవాలశూలతోమరభిండివాలాదిశస్త్రపాతకులు ప్రశస్తిఁ జూప
తే. రమణు లిరుగడ వింజామరములు వీవఁ, గడఁగి డెబ్బదిరెం డగుఘననియోగ
ములఁ దవిలి రత్నపీఠాగ్రమునఁ జెలువుగఁ, గొలువుఁగూర్చుండె మేదినీతలవిభుండు.

క. అతులితవిభవంబున నీ, గతిఁ గొలువున నుండి యచటఁ గలజనములకుం
గుతుకం బొప్పఁగ ధరణీ, పతి దా నపు డిట్టు లనుచుఁ బలికెం బ్రేమన్. 162

చ. వినుఁ డిదె యాదిగాఁగఁ బృథివిం గలజంగమకోట్లకెల్లనుం
గొనకొని సత్పదార్థములఁ గోరినయంత నె పూన్కితోడ లే
దనక రయంబుమీఱ ననయంబు నిత్తు నృపాధిరాజవా
హనునకుఁ బ్రీతిగాఁగ జగమంతయు మెచ్చఁగ నుత్సవంబునన్. 163

ఆ. ప్రజలకెల్లఁ దెలియఁ బ్రతిన గావించెద, నడుగకున్నవారి కరయ నొట్టుఁ
జేరి యాసతోడఁ గోరినవారల, కీయలేనివాని కిదియ యొట్టు. 164

క. అని పలికి సకలదిశలం, బనివడి చాటింపఁ బనిచి బాగుగ మొగసా
లను గంట వ్రేలఁ గట్టిం, చెను జనములకెల్లఁ గడువిచిత్రము మీఱన్. 165

వ. ఇట్లు శపథంబు గావించి దిశలం జాటించినఁ దద్వృత్తాంతం బంతయు విని క్రమం
బున. 166

సీ. కత్తుపాలలు పైఁడికట్లబెత్తంబులు శంఖసంఖ్యల మించుశంఖములును
పిడిగంటలును నేకిపింఛంపుఁగుంచెలు ఛత్రముల్ బులితోళ్లు చామరములు

యోగదండంబులు యోగపట్టెడలును గంధపెండేరము లుంకుండలములు
తనువులభూతిపూఁతలు కావివస్త్రము త్రైసరరుద్రాక్షమాలికలును
తే. శ్వేతకేతనములు రుద్రవీణియలును, బాత్ర మగునట్టిరజతంపుఁ బాత్రికలును
శెలుఁ దామరఁ బలు వైనశూలములును, మొలకబంగరుగిలుకుపావలును గలిగి. 167

సీ. అతులితవిమలపంచాక్షరీమంత్రంబు మించి కోరికఁ బఠియించువారు
తఱుచుగా శైవకథారహస్యార్థము ల్నెఱి శిష్యవరుల కేర్పఱచువారు
సారెసారెకు "నమ శ్శర్వాయ రుద్రాయ పశుపతయే" యని పల్కువారు
నడుగడుగునకుఁ గాహళాదిరవంబులు చెలఁగించుచును వేడ్క నలరువారు
తే చిత్రగతులను గానంబుఁ జేయువారు, సరవితో గద్యపద్యము ల్చదువువారు
నగుచుఁ గోటానకోట్లొక మొగిని నడువ, సాగి రానేల యానినచండమునను. 168

సీ మల్లయ్య వీరయ్య మఱి విరూపాక్షయ్య జడముడిబసవయ్య శంకరయ్య
పిడిఘంటచిక్కయ్య భీమయ్య సోమయ్య శివ్వయ్య హరిణాంకశేఖరయ్య
మరులయ్య సంగయ్య మార్కొండలింగయ్య పర్వతనాథయ్య పశుపతయ్య
శరభయ్య రుద్రయ్య కరపాత్రసిద్ధయ్య శితికంఠయోగయ్య శ్రీగిరయ్య
తే. విశ్వనాథయ్య వీరమాహేశ్వరయ్య, యాదిగాఁ బేరు గల్గి మహాత్ము లయిన
జంగమస్వాము లారాజసముఖమునకు, సరగఁ జనుదెంచి రత్యంతసంభ్రమమున.

వ. ఇవ్విధంబునఁ బఱతెంచి నృపాలుం గాంచి. 170

శా. ఏరా! భూవర! మాకుఁ గాంచనతురంగేభాంబరాందోళికా
భూరిస్యందనమందిరోపవనసద్భూషామణిశ్రేణులున్
జేరెం గావునఁ బల్లెలున్ బశువులున్ లెక్కింప కర్థంబు మా
కీరా! కోరిక దీఱ మీఱ కిఁక నీ వెంతేనియున్ ధీరతన్. 171

క. పాలు పెరుఁ గిక్షురసమునుఁ, జాల ఫలరసములు దేనె శర్కర ఘృతమున్
మే లగుకజ్జంబులు నీ, వేళకుఁ దెప్పించరోరి వేగమె మాకున్. 172

మ. అనుచుం గోరినజంగమయ్యలకు నత్యానందచేతస్కుఁడై
మనుజాధీశ్వరుఁ డర్ఘ్యపాద్యవిధులన్ మన్నించుచుం గాంచనా
సనము ల్వెట్టి బహుప్రకారములఁ బూజ ల్చేసి యశ్రాంతమున్
ధనధాన్యాంబరముఖ్యవస్తువులచేత న్బ్రీతి గావించుచున్. 173

క. అడిగినవస్తు వొకింతయుఁ, దడయక యాక్షణమునందె తాత్పర్యముతోఁ
గడునిడి నొసఁగుచు భూపతి, పుడమిన్ బ్రతివాసరంబు బ్రోది యొనర్చెన్. 174

క. జంగంబు లెల్ల నచట భు, జంగమరాజాంగదుని వెసం గొల్చుచు నో
జం గములై వసియించిరి, బంగరపుమఠంబులందు భాసురలీలన్. 175

వ. ఈక్రమంబున వర్ధరాధీశుండు దతులితధర్మమార్గప్రచారుండై ప్రతిదినజంగమారాధన సేయుచుండె నని సూతుం డెఱింగించిన నైమిశారణ్యమహామును లటమీఁది కథావృత్తాంతం బెట్లని యడుగుటయును. 176

ఉ. హారతుషారహీరశరదభ్రనిశాకరతారకాబ్జడిం
డీరసురాళపారదపటీరవియత్తటినీసితాభ్రమం
దారసురేంద్రనాగకలధౌతసుధారససన్నిభోజ్జ్వలా
కార లసద్విహార సుమకాండవిదార! యుదార! శంకరా! 177

స్రగ్విణి.
చారుకారుణ్యవిస్తార! తారేశ కో, టీర! దైత్యేభకంఠీరవేంద్రాదిబృం
దారకానీకమందార! సత్యవ్రతా, చార! గోరాజసంచార! గౌరీశ్వరా! 178

తురగవల్గనము.
ధరణిధరవరశరణ చిరశుభదాయకా హరిసాయకా
తరణిశశిశిఖినయన దురితవిదారణా! లయకారణా!
పరమపురుష హరిహయనుత! పురభంజనా! మునిరంజనా!
హర! గరళగళ! విమతదనుజభయంకరా! జయ శంకరా! 179

గద్య. ఇది శ్రీమత్కుక్కుటేశ్వర వరప్రసాద లబ్ధ కవితా సామ్రాజ్య ధురంధర ఘనయశోబంధుర కౌండిన్యగోత్ర పవిత్ర కూచిమంచి గంగనామాత్యపుత్త్ర బుధజనవిధేయ తిమ్మయనామధేయ ప్రణీతం బైన రాజశేఖరవిలాసం బను కావ్యంబునందు ప్రథమాశ్వాసము.

శ్రీరస్తు.

రాజశేఖరవిలాసము.

ద్వితీయాశ్వాసము.

శ్రీరాజితాఖిలాగమ
పారగ! సురరాజమౌళిభాసురతరకో
టీరా! మణిరుచిరచరణ!
క్రూరాహితమదవిభంగ! కుక్కుటలింగా!. 1

వ. అవధరింపుము నైమిశారణ్యమహర్షులకు నిఖిలపురాణవ్యాఖ్యానవిఖ్యాతుం డగు సూతుం డిట్లనియె. అట్లు నిరంతరజంగమారాధనదీక్షితుం డై యాత్మమావల్లభుండు వర్తించుచున్నసమయమున నొక్కనాఁడు. 2

సీ. ఘన మైనతనుకాంతిఁ గనుఁగొన్నచో శరద్ఘన మైనఁ దాఁకకే కదలి పాఱఁ
బొడ వైనజడలదీప్తులు సాంద్రతరబాలజలజాప్తరుచులతోఁ జెలిమి సేయ
నిండుచందురుఁ బోలునిటలభాగంబున రమ్యభస్మత్రిపుండ్రంబు మెఱయఁ
బవమానవశమునఁ బలుకు చేతివిపంచిగళరవంబునకు రాగంబు గూర్ప
గీ. మండితం బైనదండకమండలువులు, నలరుపటికంపుసరులు మృగాజినంబు
గల్గి యరుదెంచె నమ్మహీకాంతుకడకు, భూరిలీలాప్రచారుండు నారదుండు. 3

ఉ. వచ్చు టెఱింగి మానిజనవర్యు నెదుర్కొన నేగి మ్రొక్కి తో
డ్తెచ్చి యనర్ఘ్యరత్నరుచిదీపితపీఠమునందు నుంచి తా
హెచ్చుగ నర్ఘ్యపాద్యవిధు లిచ్చి కడు న్వినుతించి భక్తితో
నచ్చతురాస్యసూతికి ధరాధిపుఁ డిట్లని పల్కె నేర్పునన్. 4

చ. మునివర! సర్వలోకములముఖ్యుఁడ వీశ్వరభక్తిమార్గసం
జనితయశఃప్రకాశుఁడవు సంతతపుణ్యుఁడ వీవు మద్గృహం
బున కిపు డిట్లు రాఁ గనుట భూరిశుభంబుల కెల్లఁ దానకం
బనుదినభోగభాగ్యవిభవాతిశయంబుల కెల్ల మూలమున్. 5

క. అనఘ! మిముఁబోటిపుణ్యులఁ, గనుఁగొనుభాగ్యంబు మాకుఁ గల్గుటయొల్లన్
ఘన మగునిధిఁ గాంచినపే,దనుఁ బోలుటగాదె తలఁపఁ దాపసముఖ్యా!. 6

సీ. అనవుడుఁ గలహభోజనుఁడు సర్వంసహావరున కిట్లని పల్కె వలనుమీఱ
రాజాధిరాజ! యోరమణీమరతిరాజ! రాజశేఖరపదాంభోజమధుప!

యాచకామరభూజ! హరిదశ్వనిభతేజ! కాంచనాచలధైర్యకలితశౌర్య!
పండితజనగేయ! భల్లాణరాయ! నీసరివారలేరు ముజ్జగములందు
తే. వడుగునయ్యలకెల్ల లేదనక యీయఁ, జాలినా వెద్దిరైన నీచరితమువలన
సంతసం బయ్యె నీపుణ్యమింత యంత, యనుచు వర్ణింపఁ దరమె యయ్యజునకైన.

క. కొట్టితివి రిపులఁ జోరులఁ, బట్టితివి మహేశ్వరాంఘ్రిపంకేరుహముల్
పుట్టితివి వంశమణివై, కట్టితి వర్థులకు నొసఁగుఘనమగు బిరుదున్. 8

క. వచ్చితి నినుఁ గనుఁగొనుటకు, మెచ్చితి నీసుగుణములకు మేల్భళి! యిటు లీ
విచ్చినయర్చనలకుఁ గడు, హెచ్చుగఁ బరితోష మయ్యె నిచ్చో మదికిన్. 9

తే. పార్థివోత్తమ! నిశ్చలభక్తితోడ, నిందురేఖావతంసు గిరీశు నీశుఁ
గోరి సతతంబుఁ బూజించుధీరమతుల, కనఁగ నిహపరసౌఖ్యంబు లందఁ గలుగు.

సీ. ఫణిహారునకుఁ బ్రదక్షిణము గావించుట దేవాదిదేవునిఁ దెలిసికొనుట
చంద్రశేఖరుపదాబ్జంబు లర్చించుట తవిలి శంభునిచరిత్రములు వినుట
పురదైత్యహరుని నేర్పునఁ బ్రస్తుతించుట భర్గునిదివ్యరూపంబుఁ గనుట
ధరఁ జాగి పార్వతీధవునకు మ్రొక్కుట నెఱి నీశుఁ దనయందు నిల్పికొనుట
గీ. వలయుఁజువ్వె నృపాల! పావనతమీఱ, నిరవుగా నీశ్వరుని నాశ్రయించువారి
కంఘ్రిధీహస్తకర్ణజిహ్వాగ్రనేత్ర, శీర్షహృదయంబు లలరు విశేషముగను. 11

సీ వినవయ్య! శితికంఠుఁ డనెడునిక్షేపంబు గురుకృపాంజనముచేఁ గోరి కాంచి
హృదయపీఠికయందుఁ బదిలంబుఁ గావించి యదె జగత్కారణం బని తలంచి
గరిమమీఱఁగఁ దదేకధ్యానమున నుండి కడఁగి షడ్వర్గతస్కరులఁ దఱిమి
చారుశంభుకథాసుధారసం బానుచు నవిరళభక్తివైభవముఁ జెంది
తే. వామదేవార్చనంబె జీవనము గాఁగ, నొనర ముక్తివధూటికి నుంకు వొసఁగి
యలర నిహపరసౌఖ్యంబు లందవలయు, మహితసుజ్ఞానమతి యైనమానవుండు. 12

మ. పురవిధ్వంసిపదారవిందయుగళీపూజావిధానోల్లస
ద్వరమార్తాండమహోగ్రచారుకిరణవ్రాతంబుచేఁ గాక యో
నరనాథోత్తమ! యెంచిచూడ భువి నన్యాయక్రియాయుక్తిదు
స్తరవిస్తారనితాంతఘోరకలుషధ్వాంతౌఘము ల్వాయునే. 13

తే. విను మిలాధీశ! కడు నవివేకులయిన, నరు లెఱుంగరుగాక శంకరునివంటి
భక్తలోకాభిరక్షణప్రౌఢి నలరు, దైవ మెందైనఁ గలఁడె చిత్తమున నరయ. 14

క. చదువులు పెక్కులు నేర్చియు, మది దుర్జనుఁ డెట్టు లభవుమహిమ యెఱుంగున్
వదలక విద్యలు నేర్చియుఁ, బదపడి కాసరము ముక్తిపద్ధతిఁ గనునే? 15

మ. బలభిన్మౌళిమణిప్రభావిసరశుంభద్దివ్యపాదద్వయున్
బలవద్వైరినిశాచరాంబుదజగత్ప్రాణున్ ఫణీంద్రాంగదున్
నలినాప్తేందుకృశానులోచను సువర్ణగ్రావకోదండునిం
గలుషారిన్ ఘనునిం గడుం దెలియ శక్యం బౌనె యెవ్వారికిన్? 16

మ. సురదైతేయులు వారిధిం దరుచువోఁ జోద్యంబుగా నయ్యెడం
గరళం బుద్భవ మై జగంబుల నడిం గాల్పంగఁ దా నవ్విషం
బరయం గుత్తుకయందుఁ బూని దయతో నంతర్బహిర్లోకముల్
పరిరక్షించినయట్టిశంభుని ప్రతాపం బెన్న సామాన్యమే? 17

క. నెఱి ద్వాదశవర్షాయుః, పరిమాణు మృకండుతనయు బ్రతికించి యమున్
గరువం బణఁచినశంభుని, చరితం బహివరున కైనఁ జనునే పొగడన్? 18

క. సర్వేశుఁడు దా నని కడు, గర్వంబునఁ బలుకుచున్నకమలజుశిరముం
గీర్వాణు లెన్నఁ ద్రుంచిన, శర్వునివిక్రమ మెఱుంగ శక్యమె చెపుమా? 19

మ. హరిజంభారివిరించిముఖ్యు లగుదేవానీకముం గూర్చి శం
కరునిం బిల్వక దక్షుఁ డధ్వరముఁ దాఁ గావించుచున్నంత న
గ్గరళగ్రీవుఁడు వానిఁ బట్టి శిరమున్ ఖండించి గీర్వాణు లం
దఱినిం గొట్టినయట్టితద్విజయ మేతన్మాత్రమే భూవరా! 20

తరళ. సురల కేరికిఁ గెల్వరా కతిచోద్యలీలఁ జెలంగు న
ప్పురము లొక్కట శరముఖంబునఁ బూని యేసి జగంబు లా
దరముమీఱఁగఁ బ్రోచినట్టిసుధామయూఖకిరీటునిం
దరమె సన్నుతిసేయ నింతయు ధాతకైన నరేశ్వరా! 21

సీ. మహిమమీఱఁగ సర్వమంత్రరాట్టనఁ బొల్చుగాయత్రి కెవ్వాఁడు నాయకుండు
కనుఁదమ్మిఁ బూజింపఁ గైటభారాతికిఁ దిరముగాఁ జక్ర మేదేవుఁ డిచ్చె
బ్రహ్మాద్యఖిలజంతుపరిపాలుఁ డౌటచేఁ బశుపతినామ మేప్రభున కలరు
శ్రుతి 'యేక ఏవ రుద్రో న ద్వితీయ' యం చనిశంబు నేవాని నభినుతించు
తే. నట్టిగిరిజేశుఁ డఖిలేశుఁ డఘవినాశుఁ, డార్తరక్షాధురీణుఁ డగాధమూర్తి
గరళగళుఁ డొక్కరుఁడె కాక కలఁడె మఱియు, దైవ మెందైనఁ బరికింప ఫణినాథ!

ఉ. చీమ మహీరుహాగ్రములఁ జేరి ఫలంబులసార మెంతయుం
ప్రేమ భుజించురీతిఁ గడుఁబెద్దయొడల్ గలయుష్ట్రి మెక్కియుం
దా మెసఁగంగ నేర్చు? విదితంబుగ నిశ్చలుఁడైనభక్తున
ట్లామినువాఁకతాల్పువిధ మజ్జభవుండు నెఱుంగ నేర్చునే? 23

ఉ. తొల్లి గుణాఢ్యుఁడైనచరితోండఁడు వేడ్కను శైలరాట్సుతా
వల్లభుఁ గొల్చి యాత్మ జూని వంచనలేక నధించి భక్తిరం
జిల్లఁగఁ బాక మర్పణముచేసి నిరంతరకీర్తిమంతుఁడై
యెల్ల జగజ్జనం బెఱుఁగ నీశ్వరసత్కృపఁ జెందఁడే తగన్? 24

క. కావున నీ వత్తెఱఁగున, భావజమదహరునిచరణపద్మంబులు స
ద్భావమునఁ గొల్వు మిఁక నా, దేవుఁడు గరుణించి యొసఁగు దివ్యపదంబున్.

వ. అనుటయు మునీంద్రునకు నరేంద్రుం డిట్లనియె. 26

సీ. తాపసోత్తమ! ధరాధరకన్యకాధీశుఁ డనిశంబు చాంచలికునివిధమున
జగదుద్భవస్థితిసంహారకరుఁడును సకలభూతాంతరస్థాయి యగుచుఁ
గర్తయు భోక్తయు గణుతింపఁ దానయై వర్తించుఁ గా కెట్లు నేర్తు రొరులు?
కావున నద్దేవుకరుణాకటాక్షవీక్షణముచే వ్రత మెట్లు జరుగఁగలదో?

తే. కాక మముబోంట్ల కిది పూనఁ గాఁదరంబె?, యనుచువినయంబుమీఱ మేలైనయట్టి
కట్లమము లోసంగుటయు మాని కౌతుకంబు, మదిని హైవార వికసితవదనుఁ డగుచు.

క. వీణె యనుతిఁ గూర్చి జగ, త్ప్రాణాశనశయనిమహిమఁ బాడఁగ విని భ
ల్లాణుఁడు మదిఁ జొక్కుచు గీ, ర్వాణమునీంద్రుని నుతించె రభసముతోడన్.

వ. ఇవ్విధంబున నారదుం డవ్వసుంధరావల్లభుం డొసంగుపూజలఁ గైకొని యనేకా
శీర్వచనంబు లొసంగి యతనిచేత నాజ్ఞ వడసి తద్వృత్తాంతం బీశ్వరుని కెఱింగిం
చువాఁడై చనుచుఁ దనమనంబున. 29

సీ. చిలువలదొర మంచివిలువమించినసొమ్ము సొగసైనసిగపువ్వు తొగలఱేఁడు
పాలుపుగుల్కునయాలఁబోతు చొక్కపుజక్కి పరఁగునేనిగతోలుపట్టుశాలు
తెలిపక్కిబలురౌతుతలపున్క పళ్ళెంబు బాగైనయవ్విసం బోగిరంబు
వణఁకుగుబ్బలిపట్టి వలపులయిల్లాలు మొగములాటిటిమేటి ముద్దుకొడుకు

తే. సరవిఁ జక్కులయొకిమీఁదు సంగడీఁడు, పసిఁడిమల విల్లు వెన్నుండు పొసఁగునమ్ము
కధలిదౌనపాము నారిన్నుఁబుడమి తేరు, గాఁగఁ జెలువొందుముక్కంటిఁ గాంతుమదిని.

వ. అని మహేశ్వరధ్యానంబు సేయుచు. 31

చ. చని కనియె న్నిలింపమునిసంతతభవ్యయశోవిశాలమున్
సనకసనందనప్రముఖసాధుగణస్తుతిమూలము న్నృహా
ఏనతరసానుదేశపరివర్తితకిన్నరకంబుకంధరీ
జనమృదుగానమోదితభుజంగమజాలము శ్వేతశైలమున్. 32

సీ. ప్రకటితసహకారపల్లవోద్యత్స్వాదనామోదపరభృతోద్దామరవము
ఘననితంబస్థలోగ్లాఘలీలాలోలగీర్వాణకామినీగీతరవము
చారుమారుతపూరితోరుతరాశేషకీచకానీకప్రకీర్ణరవము
సదమలవరఝరీసందోహసంఘమానితఘూర్ణాయమానరవము
తే. సతతగంగాతరంగసంగతబలాక, చక్రసారసహంసాదిశకునిరవము
నొక్కటఁ జెలంగు మిగులఁ గర్ణోత్సవముగ, సురుచిరంబైనయమ్మహీధరమునందు.

చ. గుఱుతుగ పద్మరాగమయకూటతటంబులఁ గ్రీడసేయుస
త్కరనికరంబు లాప్రకటకాంతులఁ జెంది వసింపఁ దుమ్మెద
ల్పరగున వానినూత్నమదసౌరభలీలలఁ జేరి నిర్ణయం
బెఱుఁగకయుండుఁ దిమ్మరుచు నెంతయు నబ్బురపాటుతోడుతన్. 34

ఉ. చందురుఱాలచప్పరపుఁజాయలఁ గిన్నరదంపతు ల్కడుం
బొందుగ నాశ్రమంబులను బుష్పశిలీముఖకేళిఁ దేలి తా
రందురు రేలునుం బవలు నుత్షతురంగశిరస్సుధాంశురు
గ్బృందముల న్మణు ల్గఱఁగి పెంపలరం బయిఁ జిల్కఁ నగ్గిరిన్. 35

సీ. కొదమసింగములతోఁ గదిసి మేలములాడుఁ గేరుచు నున్మత్తవారణములు
వాడిమెకంబులఁ గూడి వేడుకతోడఁ గ్రీడించుఁ బ్రోడలై లేడిగములు
పేర్మితో బావురుబిల్లుల మెల్లన సయ్యాట లాడు మూషకచయంబు
గారవం బలరారఁ గాఱెనుబోతులఁ జేరి లీలల నుండు వారువములు
తే. చిలువలునుముంగిసలుచాలఁ జెలిమి సేయుఁ, దగరులెప్పుడుతోఁడేళ్ళఁదగిలియుండుఁ
బగ లొకింతయు నెఱుఁగ కప్పర్వతమునఁ, దుహినకరశేఖరునిమహామహిమఁ జేసి.

మ. కమనీయామలతోయసంయుతములౌ కాసారరాజంబు లం
దము మీఱ న్విలసిల్లుచుండుఁ బొగడొందం దత్ప్రదేశంబులం
గుముదేందీవరపద్మహల్లకలసత్కూర్మాండజగ్రాహన
క్రమహావ్యాళకుళీరహంసబకకోకస్తోమధామంబులై. 37

చ. ఘన మగుపోఁకమ్రాఁకులును గాంతినిఁ జెన్నగుపొన్నగున్నలుం
బనసలు నారికేళములు పాటలము ల్వకుళామ్రసాలచం
దనములు పారిజాతములు దాడిమము ల్సురపొన్నలాదిగాఁ
దనరు ననేకభూజములు తచ్ఛిఖరీశసమీపభూములన్. ౩౮

వ. మఱియును. 39

చ. సకలితపత్త్రము ల్ప్రకటజాలకచంచువులు న్వసింప నిం
దుకశుకనామ మబ్బుటనె సొంపున మాకు సమంబె? తాళకిం
శుకము లటంచు నెంతయును జూడఁగ నొవ్వక తమ్ముఁ బల్కుటన్
శుకములు పల్కె నం దతులశోభలఁ గేరుపలాశజాలముల్. 40

చ. సకలసుమంబులం దుఱుముశంభున కెగ్గొనరించి వానిపూ
జకు వెలి యైనగేదఁగిని సమ్మతి నుండు నటంచు ఫుల్లచం
పకములు ప్రాన్కితోడ మధుపమ్ములఁ బాఱఁగఁ దోలుఁ జేరనీ
యక యటుగానిచో మధుకరావళి సేసిన దేమి వానికిన్? 41

తే. మిండుకొని గండుతుమ్మెదపిండు నిండి, యుండ గన్నులపండువై బొండుమల్లె
పొద లలరు నందు హరిరత్నములు ఘటించి, నెఱినిడినము త్రియుంపుఁబందిరులనంగ.

చ. సురుచిరపల్లవప్రకటచూతలతాస్థితకోకిలావళు
ల్వరుసఁ జెలంగు మాధవుఁడు వావిరి నవ్వనలక్ష్మి కెంతయున్
గులుకుగఁ బ్రేమతోడుతను గూర్చె యొసంగినశోణనీరజ
స్ఫురదసితోత్పలౌఘములఁ బొల్పగుమాలిక లోయనం గడున్. 43

రగడ. మఱియుఁజివురించు నెలమావులను గావులను, బొరిపొరిని విలసిల్లుపూఁప్రలను దావులను
సొలయుచును జారుతరసూనముల లీనములఁ, దలగునిందిందిరవితానముల గానముల
నారూఢఫలరసాహారముల బీరములఁ, గేరి పాలుపారుమదకీరముల వారములఁ
బగలు రేయిలతాగ్రభాగముల భోగములఁ, బొగరెక్కి కూయుపికపూగములరాగముల
మాటికిని బాదరింప్లమాటులను నీటులను, గూటములఁ బెనఁగుసురకోటులను బోటులను
దానకము లైవమంచారముల తీరముల, మానైనపుష్పోడిదుమారముల పూరముల
మరిగి విద్యాధరకుమారికల చేరికల, సరసగతి నలరారుశారికల కోరికల
విరివిమీఱఁగ నెప్పుడు వేదముల నాదముల, మొరయును నిజనులసమ్మోదముల వాదముల
నయ మొప్పసంతతానందముల డెందములఁ, బ్రియలీలఁదగు నధూబృందముల వందముల

బలసైనపూఁదేనెవానలను గోనలను, జెలఁగి తడియునిలింపసేనలను జానలను
దఱుచైనఘనసారతరువులను బోరువులను, దిరమైనవలచదురుతెరువులను విరువులను
నెఱిఁబూచుసంపెంగనీడలను వాడలను, సరవిఁ దిరిగెడుచెలువజాడలను గ్రీడలను
డొలఁగ కతిమందవాతూలములలోలములు, నలరియాడెడుమహావ్యాళములజాలములఁ
దొడరి మార్గము లెల్లఁ దుండముల కాండములఁ, దడిపి విలసిల్లు వేదండములతండముల
బరఁగుగిరిచెంగటను బాత్రమున గోత్రమున, మరలక వసంతపతిమాత్రమున సూత్రమున.

క. వెండియుఁ బ్రచండమండల, మండితమార్తాండకరసమంచితమై యు
ద్దండజగదండభయదా, ఖండగతి న్గ్రీష్మఋతువు గడునొప్పారెన్. 45

వ. మఱియు మింటనంటిన యున్మహీధరంబు జంటన శక్రచాపంబులం బన్ని చెన్నుగఁ
గాఱుగ్రమ్ముచున్న పెనుమబ్బులును, మబ్బుల నిబ్బరంబుగాక యబ్బురంబుగా నొ
బ్బున మెఱసి మరలి చనుక్రొక్కారుమెఱుంగులును, మెఱుంగులరంగు గుబ్బునం
గనుంగొని యంతరంగంబునఁ బ్రియాంగనల మేనుల మెఱుంగులఁ దలంచి యల్లన
నుల్లంబులు ఝల్లన నొల్లంబోయి మల్లడిగొని తల్లడిల్లెడు పాంథవ్యూహంబుల గే
హినులకు మోహం బలరఁ బ్రియులరాక యెఱింగించు తెఱంగున ఘోషించు ఘన
తర స్తనితంబులును, స్తనితశ్రుతిజనిత కుతూహలాత్త్వాంబు లగు బర్హ్వాంబులు వి
ప్పి తప్పక నర్తనంబులు సేయునీలకంఠంబులును, నీలకంఠధ్వానంబులు హీనం
బులుగాక సోఁకిన లీనంబులై యుండు భీకరదర్వీకరానీకంబులును, దర్వీకరానీకం
బుల నొక్కొక్కతఱి నాలోకించి మూఁకలై పాఱు భేకంబులును, భేకంబులశోకం
బులఁ బాపి లోకంబు లేకంబు సేయుకరణి నదీహ్రదంబులు నిండి యఖండంబులై పా
ఱునట్లుగాఁ గురియు నవారిత వారిధారాపరంపరలును, వారిధారాపరంపరలవలన
నుండి మెండుగఁ దండంబులై పుడమిముద్దియకు సమయనాయకుం డొసంగిననూ
త్నహారరత్నంబు లనంబడు కరకలును, కరకలసరకుగొనక యెఱికి జలబిందుప్రలం
దంబుగాఁ గ్రోలి సోలినచాతకవ్రాతంబులును, చాతకవ్రాతంబుల కాతుకం బలరె
నని దిశల నెఱింగించువిధంబునం బఱచు కేతకీగంధబంధురగంధవాహంబులును,
గంధవాహంబులకుఁ జలింపక పెంపున గుంపులై మృగయావిహారలంపటంబునఁ
గ్రుమ్మరు కిరాతులును, కిరాతయువతీ చరణపంకజ సంకలిత కుంకుమాంకిత
పంకంబు లగు తెరువులును, తెరువులం బరువులై విరువులుగఁ బూచి మురువు లలరు క
దంబతరువులును, తరువుల నీరవులు చేసి మొల్లంబుగఁ బిల్లల నిడి యుల్లసిల్లు ఖగం
బులును, ఖగపోతంబులకు మేఁతలిడు దాతలనం దగి నానాకీటకకోటులం బొటిల్లు

పచ్చికపట్టులును, పచ్చికపట్టుల దట్టంబు లై మరకతప్రదేశంబుల భాసిల్లు పద్మ
రాగంబుల చెలువున నలరు నింద్రగోపంబులును గలిగి వితరణహస్తంబునుం బో
లె నిరంతరవారిధారాకరంబై, మహాశైలగేహంబునుం బోలె సముంచితనీలకంఠశ
బ్దంబై, దివ్యజ్ఞానమూర్తియుం బోలె వికసితసుమనోయుక్తం బై, యుత్కర్షం
బునఁ గర్షకహర్షదం బగువర్షాగమంబు నొప్పు నొక్కభాగంబున. 46

చ. కొలకులఁ బద్మముల్ దొఁగలు కోమలకాంతిఁ జెలంగ సస్యము
ల్ఫలభరితంబు లై పొదల భవ్యవిపాండురలీలమీఱు చు
క్కలదొర తోలు వెన్నెలలు గాయఁగ వేల్పులత్రోవ చాల ని
ర్మలత వహింప నందుల శరత్సమయం బలరారు నొక్కెడన్. 47

సీ. ఉత్తరానిలముల మొత్తంబు లలరారె సాంద్రతుషారవర్షంబు గురియ
లీల మీఱ రసాలసాలము ల్ననలెత్తె నదులెల్ల నింకి కాల్నడలుగాఁగఁ
జలికి నోడినభంగి శాంతరూపము దాల్చె చండభానుఁడు వేగ జరుగుచుండఁ
గొమ్మలగుబ్బచన్గొండలదండల నెల్లవారును మని యుల్లసిల్లఁ
తే. దెఱపఁబడు నంగజానికేళిఁ దృప్తి యలరఁ, జేయవలె నని తలఁచి నిల్చెడువిధమున
యామినులు దీర్ఘములమీఱ నన్నగమున, నలరు హేమంతఋతువొక్కతలమునందు.

వ. మఱియు నమందసుందరకుందబృందనిష్యందమకరందపానానందిత హృదయార
విందేందిందిరసందోహం బగుశిశిరసమయంబును నొక్కభాగంబునఁ గలిగి, యి
ట్లు షడృతువులుం దప్పక యెప్పుడును వర్తింప నలవిగాక మనోహరం బై చెలంగు
నమ్మహీధరాగ్రభాగంబున. 49

సీ. మరకతహరినీలమౌక్తికాంబుజరాగవజ్రవైడూర్యప్రవాళపుష్య
రాగగోమేధికరత్నసంస్థాపితమహితకాంచనదివ్యమందిరముల
శక్రాదిదిక్పతుల్సురవితో సేవింపఁ బ్రమథగణంబులు బలసి కొలువ
వీరభద్ర కుమార విఘ్నరాజ విరించి జలజనేత్రాదులు చనువు సెఱపఁ
తే. గశ్యపాగస్త్యమాండవ్యగౌతమాత్రి, వాలఖిల్యభరద్వాజవామదేవ
గాలవవసిష్ఠమైత్రేయకణ్వముఖ్యు, లైనమునిసంఘములు భక్తి నభినుతింప. 50

వ. మఱియును. 51

సీ. గొనికొని 'స శివ ఏకో దేవ' యంచును సరవితోఁ బల్కెడుశారికలును
దత్త్వరీతిని 'శివా త్పరతరం నాస్తి' యం చాడెడుమదమరాళావళియును

'హర వామదేవ మహాదేవ' యని భక్తిఁ గీర్తించుఘనరాజకీరములును
'భర్గ శంకర పరబ్రహ్మ త్రినేత్ర' యం చారయుఁ గేరుమయూరతతులు

తే. 'నభవభూతేశ హరివిరించ్యర్చితాంఘ్రి, పంకరుహయుగ్మ' యని కేరుపరభృతములు
గలిగి యభినవశృంగారగరిమఁ దనరి, మహితగతి నొప్పు శశిమౌళిమందిరంబు. 52

క. అద్దివ్యధామ మెంతయు, నుద్దామతఁ జొచ్చి యందు నొకచెంగటఁ దా
నుద్దీపితమణిమయ మగు, గద్దియపై సౌఖ్యలీలఁ గదిసినవానిన్. 53

సీ. ఘనతప్తరజితకాంచనభూషణవ్రాత సతతవిశాలయశస్సమేత
నిజభక్తలోకమానితకల్పభూజాత భూరికారుణ్యవిస్ఫురితచరిత
మహిషదానవగర్వమర్దనవిఖ్యాత ముదితాప్సరోజనముదితగీత
కమనీయతరదివ్యకరధృతశుకపోత వితతకటాక్షపోషితవిధాత
తే. బుధజనవ్రాత కేవలభువనమాత, యగుమహాసితనగజాత నమితపూత
నభినవానందబంధురస్వాంతుఁ డగుచుఁ, గనియె సురమౌని కన్నులకఱవుదీఱ. 54

సీ. సర్వగీర్వాణప్రచయసమర్చితదివ్యచరణారవింద యేహరిణనేత్ర
హారహీరపటీరతారకాహిమచారుకీర్తివిస్తార యేకీరవాణి
సతతమానితదాసజనగృహాంగణనవ్యకల్పభూజాత యేకంబుకంఠి
సమరారిసందోహసంహారకరలసద్విక్రమోల్లాస యేవిధునిభాస్య
తే. చిరతరైశ్వర్యయుక్త యేచిగురుఁబోణి, విమలసౌందర్యమూర్తి యేద్విరదయాన
భూరికారుణ్యచిత్త యేపుష్పగంధి, యట్టిశర్వాణి నతిభక్తి నభినుతింతు. 55

మ. సురరాజార్చితపాదపద్మయుగళీ! సూరిస్తవానందినీ!
శరదిందుప్రతిమాననుందరముఖీ! చంచత్కురంగేక్షణీ!
పరదైతేయభయంకరీ! శివకరీ! బ్రహ్మాండభాండోదరీ!
దురితవ్రాతలసన్మతంగజహరీ! దుర్గా! జగత్పావనీ!. 56

తోటకవృత్తము జయ శాంకరి భూరియశస్స్ఫురితా!, జయ సర్వవరప్రదసాధునుతా!
జయ సంతతపావని! శర్వరతా!, జయచంద్రధరప్రియ! శైలసుతా!. 57

చ. అని వినుతించుచున్నఁ గని యంబిక యిట్లను నోమునీంద్ర! నీ
వెనయఁగ నెందు నుండి యిట కిప్పుడు రాక జగంబులందు స
జ్జను లగువారివార్తలు నిజంబుగ వేగ నెఱుంగఁబల్కవే
యనవుడు నారదుండు వినయంబునఁ జెప్పఁ దొడంగెఁ బొంగుచున్. 58

మ. విను శర్వాణి! యశేషలోకములు నే వీక్షించితింగాని ధా
త్రిని మర్త్యు ల్కడుశంభుభక్తినియతిం దీపించుచు న్నిత్యసం
జనితానందము నొంది రందు నొకరయ్యాశ్చర్యంబుఁ గన్గొంటి నో
జననీ! సత్కృపఁ జిత్తగింపు మది విస్పష్టంబుఁగాఁ జెల్పెదన్. 59

సీ. ఘనత మీఱఁగ సింధుకటకం బనఁగ నొప్పు పురవర మొక్కటి ధరణియందు
నప్పట్టణం బేలు నమితకృపాస్వాంతుఁ డర్కవంశజుఁడు ధర్మాద్రిధీరుఁ
డనుదినశైవవ్రతాచారశీలుండు భల్లాణుఁ డనురాజు భక్తిమిగుల
నడుగనిజంగాన కలరఁగా నొట్టగు నడిగిన లేదన్న నడియె తనదు
తే. నని దిశలనెల్లఁ జాటించి యద్భుతముగఁ, దనదు మొగసాల నందంబుఁ దనర గంట
త్రేలఁ గట్టించె నెంతయు వేడ్కతోడ, నెద్దివేఁడిన నర్థుల కిచ్చుచుండు. 60

గీ. మఱవఁ డెపుడైన శివనామమంత్రజపము, వెఱవఁ డెందైన నర్థులు వేఁడుటకును
బఱవఁ దరిసంఘములకు సంగరమునందు, గిరిశపదభక్తినిరతుండు నరవరుండు. 61

క. కోప మనికైన లేద, ప్రకోపమనిరతప్రతాపుఁ డొగి నీతనికిం
గోప మని తలఁచి శాత్రవ,భూపతు లరుగుదురు తమదుపురవరములకున్. 62

గీ. అర్ధరాధీశునగరిసమృద్ధి యతని, భక్తిమార్గంబు భాసురయుక్తిఁ దెలిసి
మీకు నెఱిఁగింప వచ్చితిఁ బ్రకటముగ, సమదపికవాణి! శర్వాణి! జలజపాణి!

ఉ. నావుడు శైలపుత్త్రి మునినాథునిపల్కుల కాత్మలోన నెం
తో వెఱఁగంది సంతసముతో నపు డాతని వీడుకొల్పి భ
క్తావళిఁ బ్రోచుతత్పరత నందముమీఱఁ బయోరుహాక్షి యా
భావజగర్వభంజనునిపాలికి శీఘ్రమ యేగి యిట్లనున్. 64

సీ. జయజయ ఫణిహార! సర్వలోకాధార! జయ జయ నగచాప! శశికలాప!
జయ భక్తసురభూజ! సంతతోజ్జ్వలతేజ! జయ మహోన్నతవేష! సాధుపోష!
జయ మానిజనపాల! సామగానవిలోల! జయ చక్రధరబాణ! శరధితూణ!
జయ చారుదరహాస! సామజాజినవాస! జయ విధుస్తుతిపాత్ర! సత్పవిత్ర!
తే. జయ జయ సురపముఖ్యనిర్జరకదంబ, ధర్మమకుటాగ్రసుఘటితప్రకటనూత్న
చిత్రరత్నప్రభావిభాసితసుదివ్య, చరణపద్మద్వయోల్లాస! జయ మహేశ! 65

వనమయూరవృత్తము. సామజహరా! హర! తుషారకరభూషా!
కామితఫలప్రద! జగద్విదితవేషా!

తామరససంభవనుతా! గగనకేశా!
నీమహిమ లేఁ బొగడనేర్తునె గిరీశా! 66

క. జగములు పడిఁ బుట్టింపను, దగ సంరక్షింప నణఁప దైవము వని ని
న్నొగడునుగాదె ముదంబున, నిగమంబులు దేవదేవ! నీలగ్రీవా! 67

క. అరయ నొకవార్త విని మీ, కెఱిఁగింపఁగ వచ్చితి నిపు డెంతయు వేడ్కం
బరిపాటిఁ జిత్తగింపుము, పరమేశా! నగనివేశ! భవ్యవిలాసా! 68

క. హెచ్చుగ గొల్చినవారికి, మెచ్చుగ నర్ధాంగ మయిన మిగులం గృపతో
నిచ్చుఘన మైనదేవుఁడ, వచ్చుగ నినుఁ బొగడఁ దరమె యవ్విధికైనన్. 69

సీ. దంట యై యొకఁడు నేత్రమున నిన్నూజించె నింట నొక్కఁడు గొట్టె వెఱపులేక
యింట గావలియుంచె నితవుగా నిన్నొక్కఁ డొంటిగా దం డెత్తె నొకఁడు గినిసి
కంటకంబలర రోఁకటఁ గ్రుమ్మె నొక్కఁడు కుంటెన నిన్నంపెఁ గోర్కె నొకఁడు
గొంటితనమున జాల్గొని బొప్పె నొకఁడు నిన్నొంటిగ వెలిఁజేసె నొకఁడుపూని
తే. మఱియు నిటమీఁద నద్భుతకరముగాఁగ, నొక్కభక్తుండు ధాత్రిపై నిక్కముగను
నిన్నుఁగొల్చుచు నున్నాఁడుచెన్నుమీఱ, నతనిమహిమను నెఱిఁగింతునభవ! వినుము.

క. నెఱిసింధుకటక మనియెడు, పురి యేలునృపాలుఁ డమితపుణ్యుఁడు తగ నీ
శ్వరభక్తుఁడు భల్లాణుం, డరయఁగ సతతంబు జంగమార్చనపరుఁడై. 71

చ. అడుగకయున్న జంగమున కారయ నొట్టగుఁ గోర్కె మీఱఁగా
నడిగిన నియ్యకున్నయెడ నల్లె యగుం దన కంచుఁ బల్కె తా
నెడతెగ కెద్దియైన వడి నిచ్చుచు గర్వముతోడ నున్నవాఁ
డుడుపతిసత్కిరీట! కమలోదరపూజిత! భక్తవత్సలా!. 72

గీ. అతనిపట్టణమునకు నీ వరుగుదెంచి, సరవిఁ దద్భక్తిమార్గంబు లరసి చూచి
రమ్ము వేవేగ నని గిరిరాజపుత్రి, పల్కుటయు మోదముననుండె భర్గుఁ డపుడు. 73

క. అద్భుతము నొంద నేటికి, మద్భక్తులజాడ లెఱుఁగ మదవతి! సరసీ
జోద్భవహరిజంభాసుర, జిద్భోగీంద్రులకుఁ దరమె? చిరతరయుక్తిన్. 74

క. నాకన్న నధికు లెన్నఁగ, లోకానీకంబు లెల్ల లోఁగొనఁగల రో
కోకస్తని! మద్దాసులు, చేకొని యెటులాడుచున్నఁ జెల్లుం జుమ్మీ! 75

ఉ. నిక్కముఁ దెల్పెద న్వినుము నీరజనేత్ర! విధాతకేనియుం
జిక్క నొకింత భక్తునికిఁ జిక్కినపద్ధతి నట్టు లౌటచే

మిక్కిలిభక్తి నన్ గొలిచి మీఱి నరుండు విధూతపాపుఁడై
పెక్కువిధంబుల న్మహిమఁ బేర్మి వహించు నుదగ్రలీలలన్. 76

తే. అశ్వమేధాదియాగంబు లైన ధేను, భూహిరణ్యేభహయతులాపురుషశకట
ముఖ్యదానంబు లైన నోమోహనాంగి!, సరవి మద్భక్తి కింతైన సరియె? చెపుమ!.

క. అలిగినచో విధినైనం, దలఁ ద్రుంతు నిజంబు మీఱ దయచేసినచోఁ
దలఁ దాల్తు నెపుడు వేడుక, లలర గురుద్రోహినైన నంబుజనేత్రా! 78

క. కంటికి ఱెప్పవలె న్వా, ల్గంటిరొ! మద్భక్తవరునిఁ గాచుకొనుదు వె
న్వెంటం దిరుగుదు నెప్పుడు, వింటే! చర్చింప నిఁకను వేయేమిటికిన్. 79

ఉ. కావున నీదువాక్యమును గాదన కిప్పుడ యేగుదెంచి త
ద్భూవరుభక్తి చూచుటకుఁ దోడ్కొని శీఘ్రముగాఁగ వత్తు ని
చ్చో వరవర్ణినుల్ గొలువ శోభనలీల వసింపు మింపుతో
నీ వని పల్కి యద్రిసుత నెమ్మది సమ్మతిచేసి యంతటన్. 80

తే. హరిసురేశాబ్జసంభవాద్యమరవరుల, వేడ్క మీఱంగ నప్పుడే వీడుకొలిపి
కొలువు చాలించి వేవేగ నిలను డిగ్గి, తనర భల్లాణువీటికిఁ జనుచునుండె. 81

క. చనిచని కనె శివుఁ డొకచో, ఘనతరకల్లోలమాలికాపరిభాసి
న్వినుతయశోరాశిం ద్రిభు, వనదురితవినాశిఁ బృథులవణవారాశిన్. 82

సీ. వేలాతలోదంచదేలాలతాగ్రాతిహేలావిలోలాళిజాలకంబు
శుంభత్క్రియారంభకుంభీనసగ్రాహకుంభీరసంరంభజృంభితంబు
రంగన్మహోత్తుంగభంగావళీతటశృంగారితాంభోమతంగకులము
భూరిప్రకారసంచారధారాధరవారచారుతరప్రతీరభూమి
తే. కలితబలయుతఘనతిమింగిలవిలాస, చలనసతతస్ఫుటీకృతఝషజలూక
భేకకర్కటకమకరకుంభీరశుక్తి, శంఖవరరత్నసంఘ మాసాగరంబు. 83

చ. సకలజగంబుల న్మనుచుసామికి నీకు విసం బొసంగెనే
ప్రకటితలీల నంచు నలపాల్కడలి న్నిరసించి తాఁ బురాం
తకునకుఁ గాన్క లియ్యగ ముదంబునఁ బట్టుసుధాసముత్కరం
బొకొ యన నొప్పుఫేనతతి యొప్పుగ నజ్జలరాశి నెంతయున్. [రతమ్ముల్

లయగ్రాహి. ఇమ్ము లగుఘూర్ణితరవమ్ములు మృదంగనినదమ్ములుగ నండజచయమ్ముల
ప్రమ్ముకొని గీతపురవమ్ములుగ సారెకుఁ బ్లవమ్ములధ్వనుల్ ఘన్మనమ్ములుగ మ్రోయన్

సెమ్మి యలరార నటనమ్ము లొనరించు నళికొమ్మలో యనంగఁ జెలువమ్ముగ నకూపా
రమ్మునఁ జెలంగు నిరతమ్మును విలాసగతిఁ ద్రిమ్మరుచు వీచిక లొకమ్మడినిఁ జూడఁగన్.

చ. సలలితనూత్నరత్నమయసైకతము ల్విలసిల్ల నచ్ఛజం
గళితబలాకజాలము లఖండగతి న్వసియింపఁ జాల ని
మ్మల మణిమేఖలాఘటితముం బరిశుద్ధనవీనచేలముం
గలజలజాక్షి చొక్కపుని గారపుగొప్పపిఱుందులో యనన్. 86

ఉ. జాలరుపువ్వుఁబోణులు వెసం దమవి త్రిరివాలుఁగన్నులం
బోలిక చేసిరో యనఁగఁ బూనికె పాలికెగండుమీల బ
ల్గాలమునందుఁ గ్రుత్తు రధికం బగుకోరికమీఱఁ బట్టి తా
రేలలు పాడుకొంచు మది కింపుగ నప్పనరాశిచెంతలన్. 87

శా. ఆరత్నాకరతీరభూములు సముద్యల్లాంగలీతాళజం
బీరామ్రక్రముకప్రవాళకదళీబిల్వామ్లకాకేతకీ
నారంగప్రముఖాఖిలాగమవితానచ్ఛాయలం దెల్లఁ బ
ల్మారుం గోర్కెల విశ్రమించుచును లీలన్ శౌరి దా నంతటన్. 88

సీ. రమణీయమౌక్తికరచితసౌధంబులు మేలైనహరినీలజాలకములు
విమలచంద్రోపలవేదికాస్థలములు గురుతరాంబుజరాగకుడ్యములును
సురుచిరవైడూర్యసోపానవితతులు పాటింప వజ్రకవాటములును
బటుపుష్యరాగసంఘటితార్గళంబులు భూరిగారుత్మతద్వారములును
తే. శుంభదున్నతవిద్రుమస్తంభములును, గలితసంతతశృంగారగరిమతోడఁ
బొలుపుమీఱెడుభల్లాణపురవరంబుఁ, దగఁ బ్రవేశించె నగ్గజదైత్యహరుఁడు. 89

క. అప్పురవీథిం జనుచోఁ, గప్పురము జవాది యగరు కస్తురియును బెన్
గుప్పలుగ నుంచి యమ్మెడు, గొప్పపసారములు గాంచె గుఱుఁ డొకచోటన్. 90

చ. నిరుపమరత్నపుంజరమణీయతలేందుశిలావితర్దిపై
నరయ సమస్తవస్తువులు నమ్మెడువైశ్యునిఁ జూచె శౌరి తా
నురుమణిశృంగసంగరజితోర్విధరాంచితమధ్యసీమయం
బిరవుగ నుండునట్టి యలకేశ్వరుఁ బోలినవాని నొక్కెడన్. 91

క హాటకమయచిత్రాంబర, కోటులు మేటులుగ నుంచి గుఱుతుగ నెపుడు
న్నాటించి యమ్ముచుండెడు, చోటులుగనె నొకట నిందుజూటుఁడు వీటన్. 92

క. శృంగారవేష్టితోపభు, జంగమరాజాంగదుండు వెసఁ గనుఁగొనియెన్
రంగత్తురంగఘనమా, తంగశతాంగములగములఁ దగ నొకచోటన్. 93

క. చనుఁగొనె నొక్కచోట నవకాంచనరత్నసముంచదూర్మికా
ఘనతరమేఖలాకటకకంకణకంఠవిభూషణాదిమం
డనవిచయంబు సెంతయు దృఢంబుగ నిల్పి క్రయించుచోటులం
దునఁ దుదిలేనివేడుకలతో నలరారి పురారి సారెకున్. 94

చ. ఒనరఁగ విప్రకాంతలసమున్నతదేహరుచుల్ తటిద్రుచుల్
ఘనతరవేదనాదములు గర్జితము ల్పటుహోమధూమముల్
తనరఁగ నీలనీరదకదంబము లందు గృహాహిభుక్తతు
ల్పనివడి వే నటింపఁ గనె బ్రాహ్మణవీథిఁ గపర్ది యొక్కెడన్. 95

వ. మఱియును గరితురగరథారోహణాస్త్రశస్త్రవిద్యాభ్యాసపరాయణజనభాసురంబులగు క్షత్త్రియనివాసంబులును, ధనకనకాంబరప్రముఖసమస్తవస్తుసుందరంబులగు వైశ్యమందిరంబులును, గోమహిషోష్ట్రచ్ఛాగాద్యఖిలపశుసమూహంబులగు శూద్రగేహంబులును, గంధపుష్పాక్షతధూపదీపఫలరసాపూపోపహారసమేతంబులగు దేవతానికేతనంబులును, కలితమణిగణకిరణవిస్ఫారంబులగు కాంచనప్రాకారంబులును, ఝషకమఠకర్కటగ్రాహమహోరగభీకరభేకానీకకుముదకహ్లారసారసప్రచయవిశాలంబులగు పరిఖాజాలంబులును, సముంచితనూత్నవరత్నమాలికలగు కపోతపాలికలును, ముక్తాఫలచూర్ణరంగద్రంగవల్లికాసంగతంబులగు వితర్దికాప్రాంగణంబులును, లీలావిలాససంచారిసుందరీసందోహసౌధశిఖరంబులును, నిరంతరపల్లవితకోరకితపుష్పితఫలితలలితక్రియాప్రమోదితశుకపికమధుకరనికరప్రకటారవభాసమానంబులగు నుద్యానవనంబులును, గ్రమక్రమంబునఁ జూచుచుఁ బ్రచ్ఛన్నవేషంబునం జని మఱియు 96

చ. రతిపతిపువ్వుఁదోఁట యొనరంగ భుజంగుల కొడ్డుమీట సం
తతమదనజ్వరంబునకు దట్టపుమందులమూట సౌఖ్యసం
హతులకు బల్కరాట మిరవై తగునప్పురినొక్కచోట శో
భితగతిఁ జెంది వేశ్యతతిపేఁట బుధు ల్నుతిసేయ నేటగున్. 97

సీ. చిత్తజాతుఁడు విటశ్రేణి కాసలు గొల్పఁ బూని నిల్పినపైఁడిబొమ్మ లనఁగఁ
జెలువొప్ప రతికాంతచే విలాసప్రౌఢిఁ బరఁగుచేమంతిపూబంతు లనఁగఁ

బొలుపుగాఁ బరిపూర్ణపూర్ణిమారాత్రుల నలరారుశీతాంశుకళ లనంగ
జగము లామోదింపఁ జతురాస్యుఁ డొనరింపఁ దనరారుమించుటద్దము లనంగ

తే. బాగుమీఱినపగడంపుఁదీఁగె లనఁగ, నొఱపు గలిగినతొలుకరిమెఱుపు లనఁగ
రూపలావణ్యయౌవనరూఢి నలరి, యందముగ వారభామిను లుందు రందు.

సీ. అళులు తామరలు చెల్వారుమారునివిండ్లు కలువఱేకులు మంచిగంధఫలులు
కుందము లెక్కింపునింపొందునద్దంబులు శ్రీలు శిరీషము ల్చిగురుటాకు
లలశంఖములు జక్కవలు నీలసర్పము ల్చీమలు సింగము ల్వెలయుఁగొలఁకు
లిసుకతిన్నెలు బొ గెసఁగుదింటెనవిరు ల్కరికరాలు కలమగర్భములును
తే. గచ్ఛపంబులు నొనఁగూర్చి కమలభవుఁడు, మిగుల నేరుపు దనర నిర్మింపఁబోలు
భూరిశృంగారగరిమచేఁ బేరు గలిగి, యలరునమ్మించుఁబోణులయవయవములు. 99

ఆ. అతులగతులఁ బతుల నత్యుపరతులసం,గతులచేఁ బ్రమోదయుతులఁ జేసి
నుతులఁ దనరురూపవతు లగునవ్వార, సతులప్రతులు గలరె క్షితులయందు? 100

ఉ. ఆసవపానయోషిదధరామృతపాననవోపగూహనో
ల్లాసముల న్సమంచితవిలాసముల న్మృదుగంధసారపు
న్వాసనల న్బ్రవాసముల వావిరి నగ్గజరాజయానల
న్వాసురలీలఁ గూడుకొని పల్లవసంఘము లుందు రందఱున్. 101

క. ద్యూతంబుల మృదుతరసం, గీతంబులచేత మఱియుఁ గేరుచు విట సం
ఘాతంబులు వసియింతురు, చేతంబులు లేక తొల్చెల్వున నెపుడున్. 102

చ. మదనకిరాతతీవ్రతరమార్గణపంక్తుల కాత్మ నెంతయుం
గదిసినభీతిఁ బల్లవమృగంబులు వారవధూప్రదేశము
ల్కుదురుఁగఁ జేరి గుబ్బచనుఁగొండలచాటున దాఁగ రాఁగఁ ద
త్సదనములందు బెబ్బులులచాడ్పున వేశ్యలతల్లు లుండ్రొగిన్. 103

వ. అని వేశ్యవాటంబు వాటంబుగాఁ బ్రవేశించి శశిజూటుం డందుల బోటులనెల్ల నొ
క్కచోటికి రావించి. 104

సీ. బన్నసరంబులు పచ్చలకడియంబు లాణిముత్తెపుఁబేసు లందియలును
గమ్మలు బవిరెలు గంటలమొలనూళ్ళు రంగైనభుజకీర్తు లుంగరములున్
మొగపులతీఁగెలు బొగడలు బావిలీ ల్నీలంపుముంగఱు ల్కెవళములు
చెవులపువ్వులు ఘంటిచేర్చుక్కబొట్టులు సొగసొప్పుబంగారుమొగలిఱేకు

తే. లాదిగాఁ గల్గుదివ్యభూషావళియును, వన్నెచీరెలు అవికలు వలసినంత
విత్తమును వేగ నొసఁగె నవ్వేలఁదులకును, గట్టుగమి తేనిగారాబుపట్టిమగఁడు.

ఉ. అతుల నొసంగి యొక్కకనకాంబుజహస్త విశాలనేత్రకుం
బటుతరకామశాస్త్రచయపారగుఁడై విలసిల్లునట్టి స
ద్విటు నొకనొక్కని న్మిగుల వేడుకతో నొనఁగూర్చి వారిఁ బ్ర
స్ఫుటరతికేళిసౌఖ్యములఁ బూని వసింపఁగఁ జేసె వాసిగన్. 106

తే. కూర్చెఁ బల్లవకోటి నక్కొమ్మలకును, దనర నొనఁగూర్చినట్టిమాధవునిలీలఁ
గూర్చెఁ బల్లవకోటి నక్కొమ్మలకును, దనర నొనఁగూర్చె నయ్యమాధవుఁడువెసను.

మత్తకోకిల. మానితంబుగ లోకము ల్నిజమాయచేఁ బలుమాఱును
న్మాని మోహము నొందఁజేసి వినోదవైఖరిఁ గేరు త
ద్భానుకోటిసమానతేజుఁడు బాగుమీఱఁగ నయ్యెడం
దానును న్విటజంగమాకృతిఁ దాల్చె నెంతయువేడుకన్. 108

చ. నెఱపుల తేఁటిగుంపుల గణింపఁగ జాలును సోగవెండ్రుక
ల్నెఱిఁ గొనగోళ్ళ దువ్వికొని నేర్పలర న్నిగవైచి యాపయిం
దఱుచుగ మేల్మిబంగరపుఁదాయెతులు న్విరిదండలుం గరం
బఱుదుగఁ జుట్టి పూనెఁ జెలువార శిరోంశుక మింపుమీఱఁగన్. 109

చ. మసపగు నిల్వుటద్దముఁ గనుంగొని సన్నపుభూతిరేఖ యొ
య్యన సొగసొప్ప నెన్నుదుటియందునఁ దీరిచి చూచునప్పురీ
జనులకు సొంపుగా బొమలసందున జంత్రపుఁజుక్క బొట్టు నే
ర్పున నిడె నమ్మహేశ్వరుఁడు పొల్పుగుమిక్కిలికంఠవైఖరిన్. 110

క. గండస్థలదీధితులకు, మెండుగ విందొసఁగుగతి నమితతరశోభా
మండితవరకాంచనమణి, కుండలయుగళంబుఁ దాల్చెఁ గొమరుదలిర్పన్. 111

తే. కనకభూషణహారినీలకాంతితతుల, తోడ జోడుగఁ గూడుక క్రీడసేయు
కరణిఁ దనరెడురుచులఁజొక్కముగ మెఱయు, బవిరిగడ్డంబు సొగసు లేర్పడఁగ దువ్వె.

వ. మఱియును. 113

సీ. మణిమయోజ్జ్వలవిభూషణము లొప్పుగఁ దాల్చి గట్టిగాఁ గటి బట్ట దట్టిఁ జుట్టి
జిలుగుబంగరుశాలు వలెవాటుఁ గావించి మేదురంబుగ భూతి మేన నలఁది

సజ్జలింగము సూత్రజన్నిదంబులు బూని రుద్రాక్షమాలికఁ బ్రౌఢి నించి
గండపెండేరమును గంటలు జంగులు గిలుకపావలును జెల్వొదవఁ దొడిగి

తే. చెలఁగి నెలవంకకత్తియుఁ జేకటారి, గులుకుఁగ నలుతఁ గడుమొల్లవిరిసరులును
వెలయఁగెంజేతశూలంబు గలిగి గరళ, కంఠుఁ డఁటఁ రొందె మోహనాకారలీల. 114

తే. మొదల సాదర మొనరించి పిదపఁ దన్నుఁ, దవిలి ప్రార్థింప నయ్యవతారమునను
దాల్చు నలకేతకీగర్భదళములనఁగ, మారవైరికి వాలోరుగోరు లలరె. 115

ఉ. చెక్కులదక్కులన్ మిగులఁ జెల్వగుమోవినిఁ బంటినొక్కులం
జొక్కులచెక్కులం బెళుకుఁజూపులఁ జెన్నగుచిన్నినవ్వులం
జక్కఁగ విక్కుముక్కువలఁ జక్కెర లొక్కటఁ జిల్కుపల్కులం
గ్రక్కున నెల్లవారలకుఁ గామవికారవిహార మేర్పడెన్. 116

సీ. ఒకభృత్యుఁ డురుయుక్తి జికిలినిద్దపుటద్ద మొగిఁ బూనినీడ బాగొనరఁ జూప
నొకసేవకుఁడు క్రేవ నకలంకమతిఁ జెల్వు మెఱయ నేరుపునఁ జామరము వీవ
నొకదాసుఁ డభిలాష మొదవంగఁ గపురంపుఁదమలంబు వేమాఱు తవిలి యొసఁగ
నొకకింకరుఁడు పొంక మొప్పఁ జెంతలనుండి భూషణానీకము లొప్పంగుపఱుప

తే. మఱియు నొకభక్తుఁ డత్యంతమధురగీత, రవముఁ గావింప నెంతయు రభసమునను
జారుసౌందర్యరేఖాప్రశస్తుఁ డగుచుఁ, దనరి జంగంబు బురవీథిఁ జనుచునుండె.

వ. అట్టియెడ. 118

ఉ. నీరజగంధు లిందుమణినిర్మితనిర్మలభర్మహర్మ్యవి
స్తారతరాగ్రభాగములఁ దా రలరం జరియింపుచుండి సిం
గారము మీఱునవ్విటశిఖామణిచెల్వముఁ గాంచి యెంతయు
న్మారవికారసంచలితమానసలై తమకించి రందఱున్. 119

క. మఱియును బౌరవధూమణు, లఱుగుగ నమ్మిండజంగమయ్యయొయ్యారం
బిరవుగఁ గనుఁగొనుటకుఁ ద, త్తఱమునఁ బఱతెంచి రధికతత్పరమతులై. 120

ఉ. ప్రేమఁ బడంతి యోర్తు మకరీసుపత్రము నందమొప్ప ను
ద్దామగతిం గుచాగ్రములఁ దా నిడికొంచు నసించి యవ్విట
గ్రామణిఁ జూడఁ బయ్యెదఁ దిరంబుగఁ జేర్పక వచ్చెఁ గాన్కలా
స్వామికి రత్నకీలితసువర్ణపుబంతులు దెచ్చెనో యనన్. 121

ఉ. ఒల్లెచెఱంగుపై సడలి యుర్విపయి న్నటియింప లీల ధ
మ్మిల్లము జాఱి మల్లికలు మెల్లన నెల్లెడలందు డుల్లఁగాఁ
బల్లవపాణి యోర్తు కచభారచలల్లలితావలగ్నయై
యల్లన నేగుదెంచెఁ గుసుమాయుధసన్నిభుఁ జూడ వేడుకన్. 122

క. నెఱినొడ్డాణము గళమునఁ, దిరముగ ధరియించి మెఱుఁగుఁదీఁగెఁ గడున్ భా
సురగతి నడుమున నిడి యొక, హరిమధ్య మహేశుఁ జూడ నరుదెంచె వడిన్. 123

క. బాలుని బాలకుఁ బిలుచుచు, లీలం గరయుగము సాఁచి లేమ యొకతె య
ట్లాలింగనఁ గన వేగం, బాలింగన మొసఁగ వచ్చు నటు లరుదెంచెన్. 124

సీ. కమనీయసౌవర్ణకర్ణపత్త్రిద్యుతు ల్తళుకులేఁజెక్కుటద్దములమీఁదఁ
జారుముక్తాహారభూరిశోభావళు ల్ప్రకటపత్త్రోజకుంభములమీఁదఁ
బటువైనమేఖలాఘటితరత్నప్రభల్ ఘనతరజఘనభాగంబుమీఁద
సురపనీలాభవిస్ఫురితవేణీరుచు ల్సలలితపృథుకటిస్థలముమీఁదఁ
తే. జిలుఁగుఁజెంగావిపావడసిరులు మిగుల, చెల్వుగలచల్వవలువపైఁ బల్విధములఁ
గలిసి వర్తింప నొకశీతకరనిభాస్య, సరవి నరుదెంచె నమ్మహేశ్వరునిఁ జూడ. 125

మ. ప్రమథాధీశునిఁ జూడ నొక్కచెలి శుంభత్ప్రక్రియ న్వచ్చుచో
వమర న్నవ్వుమొగంబుపైఁ గురులు చెల్వారెం గడు న్వేడి స
త్కమలేందీవరవ్రజపుష్పనవమాఖ్యప్రోల్లసద్రూపికా
సుమమధ్యంబుల సంచరించుమధుపస్తోమంబులో యన్గతిన్. 126

ఉ. గొబ్బున గిబ్బగబ్బిచనుగుబ్బలు జొబ్బిల నబ్బురంబుగా
నిబ్బరమొప్ప చందనము నేర్పునఁ బూసి వెలంది యోర్తు మే
నుబ్బఁగ దివ్యసౌరభము లొక్కట దిక్కులఁ జిక్క యెల్లెడం
బ్రబ్బ భుజంగుజంగముఁ దిరంబుగఁ గన్గొనఁ జేరెఁ గేరుచున్. 127

సీ. ఘనలీలఁ దనరారుననుసోగవెండ్రుక ల్మేలైనసురరాజనీలములుగ
సదమలతరవిరాజన్నఖాంకురములు ప్రకటితమౌక్తికప్రకరములుగ
సతతశోభాసమంచితదంతపంక్తులు వన్నెకెక్కినమంచివజ్రములుగ
భూరిప్రభాపరిస్ఫురదధరోష్ఠంబు రమణీయతరపద్మరాగముగను
తే. రతివధూమణిచే నూత్నరత్నఖచిత, మగుచుఁ జెలువొందుచొక్కపుజిగిపసిండి
బొమ్మ యన నొక్క ముద్దులగుమ్మ వేడ్క, నవ్విరూపాక్షుఁ గన్గొన నరుగుదెంచె.

శా. చంచల్లీల నొకర్తు నీలజలదచ్ఛన్నోడురాడ్బింబమో
యెంచ న్మించినచంచరీకతతిచే నింపొందురాజీవమో
యంచు న్బొల్పఁగఁ జాలి మోముపయి జెల్వౌకుంతలశ్రేణి న
ర్తించ న్నీలగళుం గనుంగొనుట కేతెంచె న్సిరు ల్మించఁగన్. 129

చ. సకియ యొకర్తు నూపురలసన్మణికంకణకింకిణీధ్వను
ల్వికటగతిం జెలంగఁ బరిభాసితనవ్యసువర్ణభూషణ
ప్రకరము లుల్లసిల్ల నలపల్లవశేఖరుఁ జూడవచ్చె ద
ర్పకకరము క్తమై సరవిఁ బర్వెడుచొక్కపుడేగయో యనన్. 130

సుగంధి. ఈగతి న్ద్విరేఫవేణులెల్ల సంతసంబుతో
వేగ నేగుదెంచి యంత వింతకాంతి నెంతయు
న్బాగుమీఱినట్టినట్టిమేటి పైఁడిగట్టువిల్తునిన్
యోగినాథుఁ జూచి రాగయోగ మొప్ప నొక్కటన్. 131

ఉ. అంగన లెల్ల వేడుక ననంగశతప్రతిమానభంగ ది
వ్యాంగుని నబ్భుజంగునిఁ బ్రియంబున నీక్రియఁ జూచి జాళువా
బంగరుపళ్ళెరంబులను బాగుగ రత్నము లుంచి హారతు
ల్సంగతితో నొసంగి సరసంబుగ సేసలు చల్లి రంతటన్. 132

ఉ. అద్దిర వీనిచెల్వము! జయంత ధనేశకుమార మారుల
న్బద్దయుఁ గెల్వఁజాలు ధరణి న్వెలసిల్లెడు మేనితేజ మా
ప్రద్దునకు న్సమం బనఁగఁబోలు నయారె విలాసలీల నో
ముద్దియలార రండు కడుముద్దులు గుల్కెడునమ్మ! సారెకున్. 133

సీ. పొడలెడుకొదపుతుమ్మెదగుంపు నదలించుఁ బరికింప వీనిపెన్నెరులకాంతి
తొగలరాయునితోడఁ దుల యౌ ననఁగవచ్చు మొనసి నేర్పడు వీనిముద్దుమోము
వెలిదమ్మిరేకులఁ బలుమాఱు నిరసించు రమణిరో! వీనినేత్రములచెల్వు
తళతళ మెఱయునిద్దపుటద్దముల నేలు లీలతో వీనికపోలయుగము
తే. వెలయుతిలపుష్పమును గేరు వీనినాస, వింత యగుసింగిణీవిండ్లు వీనిబొమలు
కొల్లలుగ మొల్లమొగ్గలఁ గోడిగించు, నెంతయును బంతమున వీనిదంతపంక్తి.

క. నెలఁతా! పున్నమ కోవె, న్నెల తా సరియగునె పోల్ప నెఱి నీతనిచె
ల్వలరెడునగవునకు న్మను, బలుకులకు న్సరియె చిలుకపలుకులు ధాత్రిన్? 135

గీ. కంబుసన్నిభ మైనగళంబువాఁడు, ఇమ్ముమీఱు విశాలవక్షమ్మువాఁడు [డు
రమణఁబొసఁగుబాహుదండములవాఁడు, తొడరిసింగంబుఁ గెల్చు నెన్నడుమువాఁ

ఉ. తమ్ములఁ గేరుపాదలసితమ్ములవాఁడు నవీనబంధుజీ
వమ్ము నదల్చు మోవిచెలువమ్మును గల్గినవాఁడు పేర్మిఁ జో
క్కమ్మునఁ గమ్మవిల్తుతమకమ్ము నణంచెడువాఁడు లీలతో
నమ్మకచెల్ల! వీఁడు మది నమ్మక పోవఁ డి దేమిచోద్యమో? 137

సీ. ఎమ్మెమీఱఁగ వీనికెమ్మోవి యానుట భావింప నమృతంబుసేవ గాదె?
పొలుపొందవీనితోఁ బొందొనర్చుట వేడ్క నలకల్పభూజాశ్రయంబు గాదె?
లీల వీనిని గౌఁగిలించుట నిర్జరగవి యిచ్చునిష్టానుభవము గాదె?
వల నైనచెల్వముఁ బరిపూర్తి కన్గొంటఁ దలఁపఁగ ననిమిషత్వంబు గాదె?
తే. కుసుమశరకేళి వీనితోఁ గూడియుంటఁ, బ్రకటితం బగుసామ్రాజ్యపదవి గాదె?
యిమ్ముగా స్వర్గలోకసౌఖ్యమ్ము వేఱె, కోరవలయునె వీఁడు చేకూరినయె నేని?. 138

ఉ. కొమ్మరొ! మోము ముద్దుగొని కోరికఁ జెక్కులు గోట మీటి చె
ల్వమ్ముగ నెంతయున్ గళరవమ్ములు మీఱఁగఁ బూని తేనియల్
గ్రమ్మెడుమోవి యాని యధికంబుగ వీనియురమ్ము సారెకుం
గ్రుమ్మఁగరాదె గబ్బిచనుగుబ్బల నుబ్బున గొబ్బుగొబ్బునన్? 139

క. కుతుకమునఁ బ్రతిదినము నీ, చతురుని మెయిజంట నుండుసతిభాగ్యము సం
స్తుతి సేయఁదరమె తిరముగఁ, జతురాస్యున కైన వానిచానకునైనన్. 140

ఉ. ఈ నెఱజాణఁ డీచెలువుఁ డీదరహాసవిభాసితాననుం
డీనళినీకళత్రనిభుఁ డీప్రభుఁ డీనవయౌవనాంగుఁ డే
మానినినైన నెంతయును మన్మథబాణవికంపితాత్మఁ గాఁ
దా నొనరింపకున్నె? వనితామణులార! విలాససంపదన్. 141

శా. వీనిం జూచినపూవుఁబోఁడి మదనావిర్భావలోలాత్మయై
మేనం బుల్కలు గ్రమ్మ మేటిజిగిచన్నిట్టల్ గగుర్పాటుఁగా
నూనాస్త్రాలయమెల్లఁ జెమ్మగిలఁ దాఁ జొక్కంగదే కొమ్మ! యిం
పూనం జంద్రునిఁ గన్నచంద్రశిలయుంబోలెం బ్రమోదంబునన్. 142

ఉ. కంజదళాక్షి! యీనవపుఁగానిఁ గనుంగొనినంతనుండియున్
రంజిలి మానసంబు పరిరంభణలాలసమయ్యెఁ జయ్యనన్

మంజులపుష్పబాణములు మన్మథుఁ డేయఁదొణంగెఁ బైపయిం
బింజయుఁ బింజయుం దవులఁ జేర్చి కడున్ దృఢలీల నొక్కటన్. 143

క. అతివా! శతధృతి యీతనిఁ, బతిఁగా నూహింపకున్న పాపమున నె కా
మతిఁ దలకోఁతలఁ బడియెన్, సతతము భువనంబులెల్లఁ జర్చింపంగన్. 144

వ. అని మఱియు నిట్లని వితర్కించిరి 145

సీ. పణఁతి యీతండు వాక్పతియొ! యిట్లనఁగ నల్మోగములుఁ బుక్కిట ముగ్ధ యేది?
తరుణి యితండు మాధవుఁడో! యిట్లన శంఖచక్రముల్ ఱొమ్మునఁ జాన యేది?
ధవళాక్షి యితఁడు వాసవుఁడో! యిట్లన వేయుఁగన్నులుఁ గులిశంబుఁగలుగుటేది?
శుకవాణి యితఁడు దర్పకుఁడో! యిట్లనఁగ గ్రొవ్విరితూపులును దియ్యవిల్లు నేది?
తే. యితఁడు భల్లాణునిజభక్తి మతినిఁ దెలియఁ, జల్లమాంబనిజంబెల్ల సరవి నరయఁ
బూనిచనుచున్న శివుఁడు గాఁబోలునిదియొ, తథ్యమగు నిందుముఖులార! తలఁచిచూడ.

క. తొలినోములఫల మిప్పు డీ, చెలువునిఁ గనుఁగొంట యిందుచే భాగ్యం బో
చెలులార! కల్గె నిట్టులఁ, దలఁపఁగ నద్భుతము గాదె ధారుణియందున్?. 147

క. అని యివ్విధమునఁ బురసతు, లెనలేనిముదంబుతోడ నీక్షించుచుఁ దన్
గొనియాడ నంత శివుఁ డా, జనపతి మొగసాలదరికిఁ జనియెన్ లీలన్. 148

వ. అని సూతుం డెఱింగించిన విని నైమిశారణ్యమహామును లటమీఁదివృత్తాంతం బె
ట్లని యడుగుటయు. 149

శా. గౌరీచారుపయోధరద్వయమిళత్కస్తూరికాకర్దమ
స్ఫారోదగ్రభుజాంతరాళవిధిజంభద్విణ్ముఖామర్త్యకో
టీరస్థాపితనూత్నరత్నరుచిధాటీప్రోల్లసత్పాద! మం
దారక్షీరపటీరహారహిమగుస్తారాభమందస్మితా!. 150

క. తరుణారుణాబ్జసుందర, చరణా! దురితాబ్ధితరణ! సంతతకరుణా!
ధరణీధరశరణా! శశి, భరణా! కరిహరణ! నిఖిలభయసంహరణా! 151

తరల. భువనపోషణ! సత్యభాషణ! భోగిరాజవిభూషణా!
దివిజపాలన! వహ్నిఫాలన! దివ్యతాండవఖేలనా!
పవిధరార్చిత! మౌనిపూజిత! భానుకోటివిరాజితా!
శివగిరీశ్వర! భూతిదాయక! సింధుజాధిపసాయకా!. 152

మాలిని. మనసిజశతరూపా! మర్దితాశేషపాపా!
దనుజరిపుకలాపా! దర్పితోద్యత్ప్రతాపా!
ధనపతివరమిత్రా! దాససంస్తోత్రపాత్రా!
ఘనతరనిజశౌర్యా! కాంచనాహార్యధైర్యా! 153

గద్య ఇది శ్రీమత్కుక్కుటేశ్వర వర ప్రసాద లబ్ధ కవితా సామ్రాజ్య ధురంధర ఘన
యశోబంధుర కౌండిన్యగోత్ర పవిత్ర కూచిమంచి గంగనామాత్య పుత్ర బుధ
జన విధేయ తిమ్మయ నామధేయ ప్రణీతం బైన రాజశేఖర
విలాసం బను కావ్యంబునందు ద్వితీయాశ్వాసము.

శ్రీ ర స్తు.

రాజశేఖరవిలాసము.

తృతీయాశ్వాసము.

శ్రీమత్కామితజనసుర
భూమీరుహ! భుజగవరవిభూషణ! సుగుణ
స్తోమ! హిమాచలకన్యా
కోమలముఖపద్మభృంగ! కుక్కుటలింగా. 1

వ. అవధరింపుము నైమిశారణ్యమహర్షులకు నిఖిలపురాణవ్యాఖ్యానవిఖ్యాతుం డగు సూతుం డిట్లనియె నట్లు జగన్మోహనాకారుం డగు నవ్విటజంగమేశ్వరుండు తన మందిరద్వారంబునకు వచ్చు టెఱింగి భల్లాణుండు. 2

చ. ఎదురుగ నేగి యాగురుజనేశ్వరుఁ గాంచి నమస్కరించి స
మ్మదమునఁ దోడితెచ్చి సుషమం బగుపీఠిక నుంచి శోభన
ప్రదముగ నర్ఘ్యపాద్యములు భాసురలీల నొసంగి వేగఁ ద
త్పదసలిలంబు మూర్ధమున భక్తినిఁ జల్లుక నిల్చి యుండినన్. 3

క. నెఱిఁ గక్షపాలయుం ద, త్స్వరుకాంతులఁ దనరుభూతి యొక్కింత కరాం
బురుహమునఁ బట్టి యోగీ, శ్వరుఁ డానృపునుదుట నిడిన సరవి నతండున్. 4

ఉ. పావనమయ్యె మద్గృహము పక్వము లయ్యెఁ దపోవిశేషము
ల్వావిరి వృద్ధిఁ బొందెఁ జెలువం బగుకీర్తియుఁ బూని యర్థి వై
నీవు మహానుభావుఁడవు నేఁ డరుదెంచుటఁ జేసి వేడ్క నో
భావజరూప! పూర్వకృతభాగ్యవశంబున మాకు నియ్యెడన్. 5

క. గురులింగ మిమ్ముఁ గన్గొని, పరితోషము నొంది మది శుభస్థితిఁ దనరెం
బరమేశ్వరుఁ డిప్పుడు స, త్కరుణం బ్రత్యక్షమైనకైవడి మీఱన్. 6

సీ. ఎందుండి యిచటికి నేగుదెంచితి రిట్లు మునిచంద్ర! సౌందర్యమూర్తి దనర
నీమోవిపలుగంటు లీచెక్కుగవచీరు లీచిన్నివెన్నెల నెన్నునగవు
లీముద్దునునుబల్కు లీచిత్తరపుఁజూపు లీవలిపపుఁజెక్కు లీయొయార
మరయంగ మీకు భాసురలీలఁ దగునయ్య మఱి యొందునైన నీమహిమగలదె?

తే. నాఁగ నాశంభుఁ డప్పు డానంద మొదవఁ, జేతులారఁ జేసి నవ్వియుఁ జెలువు మెఱయ
నట్టివిటచిహ్న తేర్పడ నఖిలజనులు, వినఁగ నెఱజాణ యగుచు నిట్లనియెఁ బ్రీతి.

సీ. జననిగర్భంబున జనియించినట్టితత్ఫలమెల్లఁ దెల్పెద నలర వినుఁడు
జారుఁడై సతతంబు వారకాంతలతోడఁ గామకేళులయందుఁ బ్రేమఁ గూడి
కొమరొప్ప నింతుల గుబ్బచన్నులమీఁద గరిమఁ జేయిడుకొని విరులశయ్యఁ
బవళించి సుఖలీలఁ దవిలి యుండినఁగాక కోరికలెల్లను గుదియఁబట్టి
తే. కలలఁ దరుణులఁ గామించి కలితుఁడగుచుఁ, బెరిగి పంచేంద్రియంబులు బిగ్గఁబట్టి
తియ్యవిల్కానిబారికి నొయ్య నోరిగి, తిరుగుచుండిన ఫలమేమి సిరుల కరయ? 8

క. మానినులఁ దవిలియున్నను, మానుగ నిహపరము లొదవు మనుజులకెల్లన్
గానల భూములఁ దిరుగుచుఁ, దానములు జపంబు లేల తగ నొనరింపన్? 9

సీ. సరవి మత్తేభద్రిమ్మరిఁ దలనిడుకొన్న కరిదైత్యమథనుండు కామి గాఁడె?
కొమరొప్ప మోహించి కూఁతు నిల్లాలిఁగఁ గైకొన్న పరమేష్ఠి కామి గాఁడె?
కూర్మిఁ బదాఱువేలగొల్లపూఁబోణులఁ గలసినవెన్నుండు కామి గాఁడె?
గౌతమమునిపత్నిఁ గడఁగి వరించిన గట్టులపగవాఁడు కామి గాఁడె?
తే. కోరియాచార్యభామినిఁ గూడినట్టి, కైరవాప్తుండు మిక్కిలి కామి గాఁడె?
కామి గాకున్న యట్టియక్షలితుఁ డెవఁడు, కామి గాఁడేని నిర్వాణకామి యగునె?

గీ. అదియునుంగాక కామశాస్త్రాళియందుఁ, గామి గావచ్చు నని పల్కు కతన నిట్లు
తనర విటజంగమాకృతిఁ దాల్చి యేను, నలర వెలయాంద్రభక్తుల నడిగికొనుచు. 11

క. భోగింతు నెల్లవేళల, బాగొప్పెడు కామశాస్త్రపద్ధతి వెలయన్
శ్రీఁగల్గుట కరయఁగ ఫల, మీగతి సుఖియింపవలదె యింపలరారన్? 12

చ. రమణికుచద్వయం బొగి నురమ్మున నానుక మోము మోముపైఁ
బ్రమదము మీఱఁ జేర్చికొని పల్మఱుకోర్కులఁ బుష్పశయ్యపై
నమరఁగఁ బవ్వళించి యనయంబును మన్మథసౌఖ్యలీలలన్
గ్రమమున నోలలాడుటయె గాదె సుజన్మఫలంబు ధారుణిన్. 13

క. అని పెలపులఁ బాఱఁగఁ జ, య్యన నవ్వుచుఁ బల్కు జంగమాధిపు నారయం
జనదనుచు నృపుఁడు లింగా, ర్చన సేయఁగఁ బిలువ నతఁడు క్రమ్మఱఁ బలికెన్.

సీ. జననాథ! మాకాకచందమంతయు నీకు వినుమెఱిఁగింతు సవిస్తరముగ
నన్నంబుపై నింపుకైనఁ గోరికలేదు వలనైనవెలఁది గావలయుఁ జూమ్మ
వేశ్యలేనిదినాలు వేరైనఁగాని భోజన మొనరింపను సైఁపకుండుఁ
గావున వేవేగఁ గన్నులపండువ యగు దాని నొక్కతెఁ దగినభక్తి

తే. తోడఁ దెప్పింపు వేడుకతోడ నిపుడు, గారవంబుగ నీ విచ్చుకట్న మిదియె
యనుడు నృపశేఖరుఁడు నేర్పుదనర నతనిఁ, గాంచి యిట్లను సద్వచోగరిమ మీఱ.

చ. విను గురునాథ! నిక్క మగువిన్నప మొక్కటి చిత్తగించి యి
ట్లనుచితము ల్వచింపఁగ మహాత్ములకున్ దగదయ్య మిమ్ము ని
ప్పుని విని యెవ్వరైన నగుబాటొనరించెదరయ్య మీ రెఱుం
గని దిపు డెద్ది యుష్మహినిఁ గార్యము లేదు గదయ్య తెల్పఁగన్. 16

చ. అడుగు మటెద్దియేని యిడ కయంబ యొసంగెదఁ గాక మీకు ని
ప్పుడు నొకకన్నియం దెలిసి పొందుగఁ బెండ్లియొనర్చి రత్నపుం
దొడవులు జీరలుం బసులతో ధనధాన్యములున్ గృహంబులున్
గడుపడి భృత్యవర్గమును గైకొను మిచ్చెదఁ గోర్కె మీఱఁగన్. 17

క. ఊరూరుఁ దప్పకుండఁగ, మేరలు సేయింతు నిపుడు మీశిష్యులకు
న్వారంబు లొసఁగునట్లను, దారత వర్షాశనములు తగ నొనరింతున్. 18

తే. పెండ్లికట్నంబులును గడుఁ బేర్మితోడ, రాగికప్పెరలును మీకుఁ బ్రాకటముగ
నియ్యఁ జేసెదఁ బ్రజలచే నెల్లతఱిని, నూనశరరూప! యట్లు గాదేని వినుము. 19

శా. గ్రామంబు ల్కరు లందలంబులు శతాంగంబు ల్తురంగంబులు
న్భూమిం బేరగువస్తుసంఘములు సంపూర్ణంబుగా నిప్పుడే
ప్రేమల్మీఱఁగ నిత్తుఁ జేకొను మిటు ల్పైకేల యీరాజ్యమం
దోమార్తాండనిభప్రకాశ! కొనుమీ యర్థార్ధభాగం బొగిన్. 20

క. ఈరీతి సౌఖ్యలీలల, చే రూఢిగ నుండు టొప్పు చిరతరమహిమం
గోరిక మీఱఁగఁ గైకొను, మారాధ్యజనావతంస! యని పల్కుటయున్. 21

క. ఆపలుకులు విని గురుఁ డతి, కోపోద్రేకమున నృపతికుంజరుఁ గని యో
భూపాలక! నీతెగం, బీపట్టునఁ దెలిసెఁ దఱుచు లిం కేమిటికిన్. 22

తే. ధరణి భల్లాణుఁ డెంతయు దాత యనుచుఁ, జెప్పఁగావిని యేతెంచునప్పుడొక్క
కాసొసంగిన వెలయాలు గలుగు నిటుల, లోభ మేటికిఁ గుసుమశరాభ! నీకు. 23

సీ. భేకంబుఁ గనిచాల భీతిఁ బర్వెడుబంటు దురమున రిపులఁ బోఁ దఱుమఁగలఁడె?
మడిగట్టు వడి దాఁటఁ దడఁబడుతెట్టువ మించి వారాశిలంఘించఁగలఁడె?
యిసుమంతపసపుకొమ్మొసఁగఁజాలనివైశ్యుఁ డెనసి యంగడిఁజూఱలిడఁగగలఁడె?
యిలుబాసి వెడలంగ నలయుసోమరి వేగమున వారణాసికిఁ జనఁగఁ గలఁడె?

తే. సరవి మానంతుఁ డెక్కినఁ దరల లేని, వారణంబు భారంబు మోవంగఁ గలదె?
కావున నొకింత నూత్నమా కామితంబె, యీయఁగా నోపవిఁకనిచ్చు టేది చెపుమ,

గీ. ఎండకన్నును నీడకన్నెఱుఁగకుండి, తనర నఱచేతియర్థంబుఁ గనఁగ లేని
యలఘుతరరాజ్యగర్వాంధు లైనయట్టి, నరవరుల కేల వ్రతములు ధరణియందు. 25

చ. గడియకుఁ బెక్కుమార్గములు కల్లలు పల్కుచు సాధుకోటి త
న్నొడయఁడటంచు మ్రొక్కినపు డూరక యుండుచు వింతచేష్టలన్
గడువడిఁ దా నొకొక్కరుడఁ గండ్లెఱఁజేయుచు రాజ్యసౌఖ్యముల్
గడుకొమలాహిరీమసక గ్రమ్మిన మత్తులు గారె భూపతుల్? 26

ఉ. బొంకులకెల్లఁ దానకము పుట్టినయిల్లగుఁ గల్మషాళికిం
గొంకొక సర్వదుర్గతులకుం దగుమూలము రాజసంబు నీ
వింక నతిప్రయాసమున నిట్లగు రాజసవృత్తి నుండియు
న్బింకముతో వ్రతంబున కపేక్ష యొనర్తురె పార్థివోత్తమా? 27

గీ. నీకు నీవేళ నొకకాసు లేకయున్న, నిదిగొ మాచేతికాసైన నిచ్చి వేగ
వెలపొలంతినిఁ దెప్పింపు మఱల నిదియు, వినఁగఁ గాదేని శపథంబు విడువుమిపుడు. 28

ఉ. వాహనము ల్రథంబులును వారణము ల్గొదవు ల్ధనంబులున్
గేహములు న్బురంబులును గేవలరత్నవిభూషణంబులున్
సాహసవృత్తితో నొసఁగి చాలఁ బ్రియంబునఁ గూర్చి యిప్పు డు
ద్వాహము సేయుకంటె నొకవారవధూటి నొసంగరాదొకో? 29

చ. అనుడు దినేశవంశకలశాంబుధిచంద్రుఁడు యోగిచంద్రునిం
గనుఁగొని యోమహాత్మ! తగుకార్య మెఱింగినరీతి విన్నవిం
చినపనిగాని లోభమునుఁ జెంది వచించుట గాదు మీరలిం
దున కలుగంగఁ బాడియె? బుధుల్ క్షమసేయరె తప్పు గల్గినన్? 30

క. కావున మీమది కింపుగ, వేవేగ వలంతి యైనవేడుకకత్తెన్
రావించెదఁ గైకొను మో, భావజనిభ! యనిన నతఁడు ప్రమదముతోడన్. 31

క. ఆటులేని దెలియవినుమొక్కటి భూతలనాథ! వారకాంతవిధము ప్ర
స్ఫుటగతిఁ జెప్పెద జంగమ, విటుఁడని యెన్నక కడు నవివేకము మెఱయన్. 32

సీ. సంపూర్ణపూర్ణిమాచంద్రబింబద్యుతిఁ బెద్దయు నిరసించుముద్దుమోము
విరిదమ్మురేకుల నెఱిఁ బరిహాసంబుఁ గావించునిడువాలుఁగన్నుదోయి
బింబికాఫలకాంతిఁ బేర్మిమీఱ జయింపఁ దివిరెడు సొబగైనతియ్యమోవి
మేలిబంగరుబొంగరాలలీలల నేలఁ జాలినకఠినంపుఁజన్నుఁగవయుఁ

తే. గొదమతుమ్మెదకమ్ముల గదుముకురులు, కరికరంబుల కెన యనఁ బరఁగుతొడలు
గొప్పపిఱుఁదులు నల్పమై యొప్పుకౌను, పృథ్వినాథ! గభీరనాభియును గల్గి. 33

తరల. మొలకనవ్వులు వాలుఁజూపులు ముద్దుగుల్కెడుపల్కులుం
దళుకుఁజెక్కులు హంసయానము తమ్మితూండ్లజయింపఁగాఁ
గలభుజంబులు కంబుసన్నిభకంధరంబును గల్గి తా
వలచియున్వలపింపనేర్చినవామలోచన కావలెన్. 34

క. పురుషుం డలసినమీఁదటఁ, బురుషాయితబంధగతులఁ బొదువుచు వురుసన్
సురతంబు సేయనేర్చిన, గురుకుచ గావలయు నలరఁ గువలయనాథా! 35

క. నఖదంతక్షతచుంబన, ముఖనిఖిలరతిప్రకారములఁ దానె కడున్
సుఖలీలఁ గలయునీరజ, ముఖియే కావలయుఁజుమ్ము భూపతితిలకా! 36

చ. కలకల నవ్వుకొంచుఁ దమకంబునఁ గంచెల పిక్కటిల్లఁగాఁ
గులుకుమిటారిగబ్బిచనుగుబ్బలు పైపయి నుబ్బఁ దేనియ
ల్చిలికెడుముద్దుపల్కులను జెన్నుగ మోహముమీఱఁ గేరున
ల్చిలుకలకొల్కి గావలయుఁ జిత్తజకేళికి భూభుజోత్తమా. 37

సీ. నిక్కుజక్కవదోయి నెక్కసక్కెములాడు చనుగుబ్బ లురమున నొనర వాని
భుజయుగం బలర మూఁపున లీలఁ గీలించి చెలువొప్పఁ జెక్కునఁ జెక్కుఁ జేర్చి
పలుమాఱు గళరవంబులు మీఱి చెలగంగ నిమ్ముగా మరునిల్లు చెమ్మగిలఁగ
కొనగోటిపోటు లొయ్యన మర్మము ల్నాట వగలచే బెదరుమై వడఁకు దోఁపఁ
తే. జొక్కి బిగికౌఁగిలింతలఁ బెక్కుక్రియలఁ, బ్రేమ దళుకొత్త బసియించి పిదపనుపరి
సురతమును బ్రౌఢయై సేయుసుందరాంగి, కావలయుఁ జుమ్ము ధారణీకాంత! యిపుడు.

వ. మఱియును. 39

సీ. ధనగర్వమునఁ బల్లవునిఁ దృణీకృతలీల గణనసేయనిపెల్లుకత్తె గాక
కలహించి వేడుకకాని నెంతయు నెగ్గులాడుచు నుండుగయ్యాళి గాక
నెమ్మది మొరునిపై నిలిపి మారునికేళి నలరఁ దేలింపనితులువ గాక
ప్రేమచేఁ బిలిచిన బేలయట్లుండఁ బల్క నొల్లనిమాయలబెల్లి గాక
తే. యొకనిచే విత్త మంది వేఱొకనితోడఁ, గలిసి వర్తించుబల్దోసకారి గాక
పూని యేప్రొద్దునిద్దురపోతు గాక, మదటయును గాక పరికింప మలిన గాక. 40

తే. విటునితోఁ గూడియున్నట్టివెలఁది గాక, బానిసెయు రోగియును గాక పాపి గాక
బేలయును గాక తగ మగనాలు గాక, యున్నవాల్గంటిఁ దెప్పింపు ముర్వీనాథ! 41

క. విను చిత్తిని శంఖిని హ, స్తిని పద్మిని యనెడు నాల్గుతెఱఁగులసతులం
దున నే పేరెన్నిక యగుప, ద్మిని గావలెఁ జుమ్ము మాకు మిహిరకులేశా! 42

క. శివపాదభక్తినిరతయు, నవిరళసౌందర్యవతియు నతిపుణ్యగుణ
ప్రవిమలతరహృత్కమలయు, నవనీశ్వర! మాకు నిచ్చునది యిపు డెలమిన్. 43

సీ. ఘనసారమృగమదగంధసారానేకసంతతనవ్యవాసనలచేత
మౌక్తికాంబుజరాగమరకతనీలాదిదివ్యమాణిక్యదీధితులచేతఁ
దరుణేందుబింబసుందరదర్పణావళీతరళితఘనధగద్ధగలచేత
సౌవర్ణపర్యంకసంవ్యాప్తమల్లికాద్యతులితకుసుమసంహతులచేత
తే. సరవిఁ దెల్లయిడ్డచందువాసిరులచేతఁ, బ్రకటితము లగు జాలవల్లికలచేత
సొరిదిఁ జేరైననిఖిలవస్తువ్రజచేత, నలరు కేళిగృహంబు గావలయుఁ జుమ్ము. 44

వ. అనిన నృపాలుం డిట్లనియె. 45

తే. అట్లె కానిమ్ము దేవ మీ రానతిచ్చు, క్రమము మీఱంగ నిప్పుడే గడనసతిని
నలరఁ దెప్పింతు ననిపల్కి యాక్షణంబ, కౌతుకంబాత్మ యెంతయుఁ గడలుకొనఁగ.

క. తలవరులఁ బిలిచి ధరణీ, తలనరుఁ డవ్విధముఁ జెప్పి తగినధనంబుల్
వలనొప్పఁగ నిచ్చి ముదం, బలరఁగ వెలపొలఁతిఁ దెం డటంచుం బలికెన్. 47

వ. అంత. 48

ఉ. పద్మము లెంతయు న్సొబగుఁ బాసి వెస న్ముకుళింప విస్ఫుర
త్సద్మములందు భూసురులు తత్సమయక్రియ లాచరింపఁగా
సద్మము మీఱువార లగుసామజయానలకెల్లఁ జాలహృ
త్పద్మము లుల్లసిల్ల రవి పశ్చిమవారిధిఁ గ్రుంకె నత్తఱిన్. 49

సీ. కరమొప్పు సాంధ్యరాగము మీఱి చెల్వారు నంధకారము పర్వె నఖిలదిశలఁ
జుక్కలాకసమునఁ జక్కనొక్కటకుండె ముదముతోఁ దొగలఱేఁ డుదయమయ్యె
జనులకెల్లను బ్రీతి యొనర వెన్నెల యొప్పె లలిఁ జకోరములు కోర్కులఁ జెలంగె
నలిని తాఁ దలవంచె నగియెను గుముదిని కోకంబు లెడబాసి కుందె మదిని
తే. మరుఁడు వెడవింటవిరితూఁపు లరయఁ బూని, యేపు దనరార విరహుల నేయఁ దొడఁగె
సతులకుఁ బురుషులకుఁ బరస్పరవిలాస, రసము చిలికెడు పలుకు లింపెసఁగ నపుడు.

సీ. ముత్యాలతాటంకములు గొమ్ము పూఁబోఁడి! బన్నసరం బిదే సన్నుతాంగి!
భుజకీర్తు లివె చూడు గజరాజగామిని! యొడ్డాణ మిదిగొ మహోత్పలాక్షి!
కరకంకణంబులు గైకొమ్ము హరిమధ్య! చేర్చుక్క బొట్టిదె చిన్నెలాఁడి!
మొగపులతీఁగ చెల్వుగఁ బూను శుకవాణి! సేవళం బిదె రమ్ము నీలవేణి!
తే. రత్నహారంబు లివె యందుము రాజవదన!, వన్నెచీరలు గొనుము సౌవర్ణవర్ణ!
గంధసారంబుఁ బూయుమో కంబుకంఠి, యనుచుఁ దుద లేనికోరిక లాత్మ నలర.

ఉ. పల్లవులెల్ల మొల్లముగ బల్లిదులై కడు మంచివస్తువు
ల్కొల్లలుమీఱఁ బట్టుకొని కూరిమితోఁ బఱతెంచి వారసం
ఫుల్లసరోజనేత్రలకుఁ బొందలరార నొసంగి వేడ్క రం
జిల్లఁగఁ బెక్కుమక్కువలఁ జెంది సుఖింతు రనేకలీలలన్. 52

క. తలవరు లయ్యెడ నర్థము, లలఘుగతిం గొనుచు సరగ నంచితకౌతూ
హలమానసు లగుచు న్వే, శ్యలగృహముల కరిగి పిలువసాగిరి పరుసన్. 53

సీ. రమ్ము పద్మావతీ! రావె చింతామణీ! రా జగన్మోహినీ! రాజరేఖ!
రమ్ము చకోరాక్షి! రా పుష్పమంజరీ! రావె లీలావతీ! రత్నపుత్రి!
రా సుందరాకార! రమ్ము కైరవగంధి! రావె బింబాధరి! రమ్యభూష!
రావె కోకిలవాణి! రా సరోరుహపాణి! రా మధువ్రతవేణి! రమ్ము తరుణి!
తే. రావె నారీశిరోమణి! రమ్ము రమణి!, రమ్ము నవచంద్రికాహాస! రాజహంస!
యనుచు వేవేగ నింటింటి కరిగి యిట్టులఁ, దలవరులు వారకాంతల నపుడఁ బిలిచి. 54

క. ధనములు మణిభూషణములు, ఘనతరచిత్రాంబరములు గలపంబులు నుం
గొనుఁడివె విటజంగమునకుఁ, బనిపడి నిద్దురకు నిపుడు ప్రమదముమీఱన్. 55

తే. వనజముఖులార! ధారణీవరునియాజ్ఞ, యిట్లు కావున మసలక యీక్షణంబ
వలసినంతధనంబును వరుసఁ గొనుచు, వేగముగ రండు జంగమవిటునికడకు. 56

వ. అని పలుకుటయును. 57

సీ. నెఱజాణఁ డొకఁ డింట నిద్దుర కున్నాఁడు రాఁ గూడ దనె నొక్క రాజవదన
కోడెకాఁ డొకఁడు దాఁ గోరినధన మిచ్చి వదలనీఁ డనె నొక్క వాలుఁగంటి
మిగులఁ గూరిమి చేయువగకాని నెవబాయఁ దగదు రా ననె నొక్క చిగురుఁబోఁడి
పల్లవుఁ డొకఁడు దర్పకకేళి కీవేళఁ గాచినాఁ డనె నొక్క కంబుకంఠి
తే. ననుపుకాఁ డొకఁ డాసించి వినయలీలఁ, దవిలి యున్నాఁ డనియె నొక్క ధవళనేత్ర
విటశిరోమణి యొకఁ డిలు వెడలనీక, దంటయై యున్నవాఁ డనె దంట యొకతె.

ఉ. మిండనిఁ బాసి రాఁ దగదు మిన్నక పొం డనె నొక్క లేమ చె
ల్వుం డిదె చూడుఁ డట్ల గదిలో నియతుం డనె నొక్క రామ భూ
మండలిఁ బేరు గల్గు సుమహం బగు మేలిపసిండిసొమ్ము లీ
తం డొసఁగన్ గడించి చన ధర్మము గా దనె నొక్క భామయున్. 59

తే. ఇట్లు చెలులెల్లఁ దమవిధం బెఱుఁగఁ జెప్పి, రందుఁ గొందఱు ప్రౌఢలౌ నిందుముఖులు
మందమధురోక్తు లలరార మానవేశ, కింకరుల కిట్లు పలికిరి శంక లేక. 60

క. వినుఁ డెఱిఁగించెద నెంతయుఁ; బనివడి గణికాజనంబుపద్ధతులెల్లన్
వినయం బలరారఁగ నో, ఘనులార! సవిస్తరంబుగా నిఁక మీకున్. 61

గీ. విటుఁడు లేనిరేయి వేదనఁ జెందుచు, నిదుర కంటి కెఱుఁగ నేర కుండి
కా సొసంగునట్టికడజాతివాఁడైనఁ, గల్గ గోరు వారకాంత మదిని. 62

సీ. కడుఁ గురూపిని నైనఁ గందర్పనిభుఁ డంచు నభినుతి యొనరింతు రలఘులీల
నంత్యజన్మునినైన నమలవంశజుఁ డంచుఁ బల్కుదు రెంతయుఁ బ్రౌఢి దనర
నతిమూఢమానసుం డగుమానవునినైన సరసుఁ డటందురు సరభసమున
బ్రహ్మహంతకు నైనఁ బరమధార్మికుఁ డంచు గణుతింతు రెపుడును గ్రమముతోడ
తే. నెన్నఁ గల్గినసీతివిహీనునైనఁ, దవిలి సద్వృత్తుం డండ్రు తమకు నొక్క
వీసమైనను గాసైన వీడెమైనఁ, జేతి కొసఁగినచో నెలచిగురుఁబోండ్లు. 63

ఉ. చిన్నెల వన్నెల న్వగలఁ జిత్రవిధంబుల ముద్దుమాటలన్
వెన్నెల నెన్నునవ్వులను వేమఱు బిత్తరివాలుఁజూపులన్
సన్నల సైగల న్మిగుల జాణతనంబున వారకామినుల్
చెన్నుగఁ బల్లవప్రతతిచేత ధనంబులు దోఁతు రెప్పుడున్. 64

సీ. ఒకమాఱు పయ్యెద నోరగాఁ దొలఁగించి సవరించు జిగిగుబ్బచన్నులలర
నొకమాఱు సోగవెండ్రుకల బల్మునుకొప్పు సడల జల్లున విప్పి ముడుచు మరల
నొకమాఱు మణిమయప్రకటభూషణములు వదిలించి తిరుగంగఁ గుదురుపఱుచు
నొకమాఱు నవ్యమౌక్తికమణీహారము ల్లోనగోటఁ జెక్కుల గ్రుచ్చి తివియుఁ
తే. జెలఁగి మఱియును శృంగారచేష్టలలరఁ, గేరుచుండును బెక్కువిహారములను
సొబగుమీఱుడువగ కానిఁ జూచినపుడు, మరులు కొల్పును వెలయింతిమహితగతిని.

చ. పొలుపుగ నిన్నుఁ బాసి యొకపూఁట మహాయుగ మంచు నెంచుచో
వలనుగ నీవు నన్నిటుల వంచన సేయఁగఁ బాడియే? యిటుల్
దలఁపఁగ నీతియే? యనుచుఁ దక్కుచుఁ జొక్కుచు నిక్కునంబుగా
వలచినయట్లు మాయలను వారవధూటి భ్రమించుఁ బల్లవున్. 66

చ. ధనము లవేల పో యిపుడు దాసియు నైన గడించు నీక్రియన్
ఘనముగ మాకు నీచెలిమి గల్గుటయే పదివేలటంచుఁ బె
న్వినయపుమాట లాడుచును వేడుక గానిఁ గరంగఁజేసి యొ
య్యన విభవంబుఁ గొండ్రు గణికాంగన లెంతయు నేర్పు మీఱఁగన్. 67

క. వలచినవానికిఁ బడఁతియు, వలచినచందమునఁ దోఁచి వదలదు గా కెం
పులనైన వెలపొలంతికి, వలపును గనకంబునకును వాసన గలదే? 68

వ. అదియునుం గాక. 69

సీ. పల్లవవ్రాతంబు పాలిబ్రహ్మరాక్షసి ప్రకటితోద్యన్మద్యపానవిరత
గురుతరానేకదుర్గుణగణాలంకార సకలమాయావాదజనవసీమ
భూరికోపవికారపూరితనిజచిత్త కఠినవాక్యక్రియాగ్రథితరసన
ధర వనీతులకెల్ల గుఱుతుమీఱినతావు దానధర్మదయావిధానహీన
తే. శాకినీభూతభేతాళసమదదైత్య, భీకరాకార విలయగంభీరనినద
సుమశరారామమార్గభాసురసమగ్ర, లగ్నకంటకయుతవల్లి లంజెతల్లి 70

సీ. కుఱుచలై తఱుచుగా నెఱసీనవెండ్రుక లొప్పు మీఱఁగ దువ్వి కొప్పు ముడిచి
యిలఁ బ్రాఁతచెప్పుటట్టులఁ బోలి వ్రేలాడు కుచముల ఱవికచేఁ గుదియఁ బట్టి
తొడిగినకుబుసంబువడువున ముడతలేర్పడియెడునొడలిపైఁ బసపు రాచి
యొలుఁగుతోలును మీఱి యెంతయు మాసిన పెద్దపుట్టము చాలఁ బ్రీతిఁ గట్టి
తే. బొరుసునొసటను జంద్రంపుబొట్టు బెట్టి, యడునుకన్నులఁ గజ్జలం బడర దిద్ది
బోసినోటను దమలంబు పూని యిటుల, విటులఁ బలుమాఱు నగఁజేయువృద్ధవేశ్య.

తే. పద్మ మయినను దగుమహాపద్మమయిన, శంఖమయిన నొసంగినఁ జాలకుండి
ధనదు మెచ్చ దొకింతైనఁ దనకుఁ గల్గు, విత్త మంతయు నీకున్న వేశ్యజనని. 72

క. పసఁ ద్రాగినపులుఁగుక్రియ, న్విసువక తగఁ బ్రేలుకొంచు వేశ్యాంబ కడుం
బిసరేఁగి బూతులాడు, న్బసఁ గల్గనియోగి యడఁగఁ బల్లవతతులన్. 73

ఉ. ఆకులు పోఁకలు న్మణులు హారములు న్బహుగంధసారము
లొక్కకలు రూకలు న్మదిని గోరినయట్టిసమస్తవస్తువు
ల్వాకిట మొప్పు మాయ లొగిఁ బన్ని భ్రమించును నేర్పుమీఱఁగాఁ
జేకొనుఁ బో విటావళులచే గణికాంబ విచిత్రవైఖరిన్. 74

గీ. మిండఁ డొకనాఁటిరేయి రాకుండెనేనిఁ, గాసువీసంబు చేతికిఁ గల్గనందు
కించుకేనియు నిదురఁ బోనీదు కూఁతు, గడనపూఁబోఁడి యవ్వ పెన్కుంచమువ్వ.

వ. ఇట్లగుటం జేసి పల్లవవిరహిత యైనవేశ్య మీ రిచ్చుధనంబుఁ గొని జంగమవిటుని
కడకు రాకుండునే యని యథార్థంబుగఁ బల్కిన విని. 76

క. నమ్మక నృపభటు లతిశీ, ఘ్రమ్మునఁ గ్రమ్ముకొని సకలగణికాజనగే
హమ్ములు నిమ్ముగ దూఱి ము,దమ్మునఁ బరికించుకొనుచుఁ దగ నచ్చోట్లన్. 77

క. ద్యూతమధుపానమృగయుసం, గీతసుసాహిత్యనృత్యకేళులచేతం
బ్రీతిఁ జెలంగుభుజంగ, వ్రాతంబులఁ గనిరి చిత్రవైఖరి మెఱయన్. 78

ఉ. ఈగతి నుండఁ జూచి ధరణీశ్వరుపాలికిఁ జారు లెంతయు
న్వేగమ చేరి తద్విధము విస్మయలీల నెఱుంగఁ జెప్పిన
న్బోగముచానఁ దేకిటుల బొంకులు బల్కుట మీ కొకింతయు
న్బాగగునే యటంచు నరపాలుఁడు కోపముమీఱఁ జూచుచున్. 79

క. ఉన్నంత పొరుగుపల్లెల, కు న్నేగినదూతలెల్ల గొబ్బున నపుడే
ఖిన్నత మీఱఁగ నటువలె, విన్నప మొనరింప ధరణివిభుఁ డవ్వేళన్. 80

ఉ. ఎక్కడఁ జూచినం బురి నొకించుకయు న్నెడ లేక యెప్పుడున్
లెక్కకు నెక్కుడై గడనలేమలు కాచుకయుందు రిప్పుడే
దిక్కున నొక్క వారసుదతీమణి కల్గకయుండు టెంతయున్
మిక్కిలిచోద్య మంచు మది నివ్వక దిగ్గున లేచి యత్తఱిన్. 81

క. నల్లనిశాలు ముసుంగిడి, యొల్లజనంబులను డించి యింపొంద మహీ
వల్లభుఁడు తా నె చనియె మ,హోల్లాసపువేశ్యవాటి కున్నతలీలన్. 82

ఉ. ధీరుఁడు భూవరుం డిటులఁ దీవ్రగతిం జని తద్గృహంబులన్
సోరణగండ్లపద్ధతులఁ జూడఁ దొడంగె విచిత్రలీలల
న్గేరుచుఁ గోరికన్ మదనకేళులఁ దేలుచు నుండువారలన్
భూరిసుగంధపుష్పమణిభూషణధారుల నిర్విచారులన్. 83

వ. ఇట్లు చతురశీతిబంధనఖదంతక్షతపరిరంభణాద్యనేక కామశాస్త్రప్రకారంబులం దవిలి క్రీడించుచున్నం గనుంగొని శివశివేతి మంత్రంబును బఠించుచు విఫలప్రయత్నుం డై ధాత్రీవల్లభుండు తనమనంబున వితర్కించె. 84

క. చారులు చెప్పినవిధ మిపు, డారయఁ దథ్యంబ యయ్యె నవ్విటునకు నిం
కేరీతి నొసఁగఁ గల్గుదు, వారవధూమణిని వ్రతము వడి నిల్పుటకున్. 85

క. వెలపొలఁతి గల్గనందున, నిల యేలెడురాజు నంచు నెవ్వతె నైనం
బలిమిం జెప్పించిన నిది, కలుషంబులకెల్ల మొదలు గాదె తలంపన్? 86

చ. కడునడురేయి యయ్యె నని కల్లరిజంగము క్రోధచిత్తుఁ డై
పడి నదలించి పల్కునొకొ? వంచనమీఱ వ్రతంబు మీఁదట
న్విడువఁగఁ బోలునో? భువిని విశ్రుతమౌ నపకీర్తి నొందఁగాఁ
బడునొకొ? నీలకంధరునిభాస్వదనుగ్రహ మెట్టు లున్నదో? 87

తే. వేశ్య నొసఁగెద నని మున్ను విశ్వసింపఁ, బలికి యిపు డెట్లుబొంకుదుఁబాడిదప్పి
మహి నసత్యముకన్నఁ గల్మషము కలదె, నేటు సేయంగ మానవకోటులకును?. 88

తే. మును హరిశ్చంద్రముఖ్య లౌమనుజపతులు, నిత్యసత్యవ్రతాచారనిపుణు లగుటఁ
గాదె చిరకీర్తి సకలజగంబులందుఁ, జెంది నిర్వాణరాజ్యాభిషిక్తు లైరి. 89

క. కరి హయ భట రథ శిబి కాంబర ధన మణిభూషణాదిబహువస్తువు లి
ద్ధర నెన్నఁగ సతతంబులె, తిరముగ సత్కీర్తిదక్క ధీరాత్ములకున్?. 90

క. మును దీక్షయొసఁగు వేళను, ఘనుఁ డగు గురునాథుఁ డెంత కాదని యనినన్
విన నొల్లక వ్రతభంగం, బొనరింపఁ దలంచు టిప్పు డుచితం బగునే?. 91

క. అదిగావున నవ్విటునకుఁ, గొదుకక పట్టంపుదేవి నొసఁగి ధరిత్రిన్
విదితం బగుశపథము కో,విదు లెన్నఁగ నిల్పికొనుట విహితం బనుచున్. 92

చ. అవనితలేంద్రుఁ డెంతయు రయంబ గృహంబున కేగి సంతత
ప్రవిమలశీలయైన తనభామిని నొయ్యనఁ జేరఁ బిల్చి యో
ధవళసరోజనేత్ర! విను ధర్మయుతం బగునొక్కవాక్యమున్
దవిలినభక్తితోడ విదితంబుగ నీ కెఱుఁగంగఁ జెప్పెదన్. 93

చ. సరసముమీఱ నొక్కవిటజంగము ధూర్జటిఁ బోలి నేఁడు దా
నురుతరలీల నెయ్యెడల నుండియొ వేగమె చేరి నన్సభాం
తరమునఁ జూచి యెంతయు ముదంబున దీవెన లిచ్చి కేరుచున్
గుఱుతుగ నొక్కవారసతిఁ గోర్కె నొసంగు మటంచుఁ బల్కెనన్. 94

క. ఇయ్యకొని భటులచేతికి, నెయ్యంబున ఘన మొసంగి నెఱి నొకపడుపుం
దొయ్యలిఁ దెమ్మని పనిచియు, నయ్యెడ వారలను నమ్మ కతిశీఘ్రమునన్. 95

సీ. చని వేశ్యవాటి యెల్లను గ్రమక్రమమున వెదుకంగ నంగు నవ్వెలఁదులెల్లఁ
బల్లవసహిత లై పరిపరివిధముల గుఱుతుగా మరుకేళిఁ గూడుచున్న
గనుఁగొని వ్రతభంగమునకు నెమ్మదిఁ జాల వెఱచి యెంతయును వివేకిని వని
నీకు నివ్విధమెల్లఁ బ్రాకటంబలరారఁ దెలుప వచ్చితి నతితీవ్రఘణితి
తే. నిందుముఖి యెన్నఁడు నెఱుంగ నిట్టిచోద్య,మభవుబలుమాయ కాఁబోలు! నైననీదు
బుద్ధితోడుత నూహించి పొసఁగ నొక్క, వాక్య మిట్లని పల్కుమా వసుమీఱ.

క. అనుమనుజాధీశ్వరునిం, గని మృగమధురోక్తు లలరఁ గాంతామణి యి
ట్లను హృదయాధీశ్వర మును, వినవే శితిగళునికథలు విబుధులవలనన్. 97

చ. చిరతరలీల భక్తతతిచిత్తము లారయఁ గోరి యీశ్వరుం
డరుదుగఁ బెక్కురూపుల నహర్నిశముం జరియించుఁ దొల్లియుం
దురితవిదూరుఁ డైనచిరితొండనినిశ్చలభక్తిఁ జూడఁ ద
ద్వరసుతుఁ గూరఁగా నడిగి వానికి నీఁడె మనోరథార్థముల్. 98

తే. అవ్విభుఁడె మున్న పాదిలె నిమ్మవ్వసుతునిఁ, బూని చంపించుకొఅకునై పోయిదాని
నధికతరహర్ష మొప్పార నన్న మొనర, వేఁడుకొన్నట్టిబల్మాయలాఁడు గాఁడె! 99

క. అట్టిశివదేవునకు నీ, పట్టున నిన్నడుగు టెంతపని సుగుణుఁడవై
యొట్టైన నొసఁగి శపథము, గట్టిగ నిల్పుకొనవలయు ఘనతరలీలన్. 100

మ. తను నెంతేనియుఁ బెద్దఁ జేసి నలినీనాథాన్వయోత్తంస! యి
ట్లనఁగా ధర్మమె? నీవు నాపతివి తథ్యం బేను నీదాసి నిం
దనుమానింపక మీమదిం గలుగున ట్లత్యంతమోదంబుతో
నొనరింపందగుగాక పల్మఱును మీ రూహింప నింకేటికిన్. 101

క. పురుషుఁడు దైవం బతఁడే, కరణి నియోగించు నదియె కావించుట కా
కరయఁగ మతి యొండైనం, దరుణుల కొక్కింతయును స్వతంత్రము గలదే! 102

క. సలలితముగ నిహపరసుఖ, ములు రూఢి నొసంగి సకలపుణ్యఫలంబు
ల్గలిగించువిభునికంటెను, తలిరుంబోఁడులకు వేఱ దైవము గలదే! 103

సీ. కాంతామణులకుఁ జొక్కఁపుఁబెన్నిధానంబు ప్రాకటం బలరారఁ బ్రాణవిభుఁడు
కుసుమగంధులకును గొంగుబంగారంబు ప్రాకటం బలరారఁ బ్రాణవిభుఁడు
కమలాక్షులకు నభీష్టము లిచ్చుదైవంబు ప్రాకటం బలరారఁ బ్రాణవిభుఁడు
చిగురుబోఁడులకుఁ జెల్వగుకల్పభూజంబు ప్రాకటం బలరారఁ బ్రాణవిభుఁడు
తే. చంద్రముఖులకు బహుజన్మజనితదురిత, పటలతిమిరార్కబింబంబు ప్రాణవిభుఁడు
పొలఁతులకుఁ జాల వెల లేనిభూషణంబు, రాజశేఖర! పరికింపఁ బ్రాణవిభుఁడు.

క. వ్రతములును దానధర్మము, లతులితగురుదేవతార్చనాదులు విను మో
క్షితినాథ! యించుకేనియుఁ, బతిభక్తికి సాటియగునె భామామణికిన్. 105

ఉ. కావున నెల్లరీతులను గర్తవు నీ వెటులానతిచ్చినం
బావనలీలఁ జేకొనక పల్కుట యొట్లది కాదటంచు ధా
త్రీవరముఖ్య! నిక్కముగఁ దెల్పుము చింతిల నేటి కీక్రియన్
భావభవారి భక్తతతిపాలిట నెప్పుడుఁ గల్గి యుండఁగన్. 106

క. అన విని జననాథుఁడు వేదన నొందుచు నవ్విశాలధవళేక్షణ న
కన్నఁ జేర్చి యదలి క్రమ్మఱ, ననియె న్మది తొట్రుపడఁగ నభినవలీలన్. 107

ఉ. ఓసరసీరుహాక్షి! విను మోకులపావని! యోవధూమణీ!
నీసరి యేరి మానినులు నేటొనరింపఁగ ముజ్జగంబుల
న్వాసిగ నేఁడు నాపలుకువాక్యము మీఱఁగ వేశ్యకాంతవై
భాసిలి జంగమేశ్వరునిభావజకేళిఁ గఱంగఁజేయుమా. 108

ఉ. వారక యీపురి న్నిచట వారవధూమణి గల్గ నందున న్
వారిజనేత్ర! నిన్నిటుల వంచనసేయక వేడ్కఁ గత్తెగాఁ
గోరినవారజంగమునకుం దగ నీవలసెంగదా మదిన్
నేరము లెన్న కియ్యెడల నిల్పుము మద్వచనప్రకారముల్. 109

ఉ. నీవు పతివ్రతామణివి నీవలనం దగ మెచ్చి మేచక
గ్రీవుఁ డభీప్సితార్థములు ప్రేమ నొసంగెడు సంశయం బిఁకన్
భావమునందు నిల్పక కృపామతిఁ జూడుము నన్ను నియ్యెడన్
నావుడుఁ బువ్వుఁబోఁడి తననాథున కిమ్ముగ మ్రొక్కి యిట్లనున్. 110

క. వలనొప్ప నింతపనికై, పలుమఱుఁ బ్రార్థింప నేల పావనమతితో
నలబోఁడుఁగుజంగమునకుం, జెలువుగ నన్నొసఁగవలయు శీఘ్రమున నృపా! 111

క. ఘనయెల్ల గుత్తఁగొని యొక,దరి నిందుకతో దీవత న్వేడుక్రియన్
బరికింపఁగ నిటుల హృదీశ్వర! కొంచెపుఁబల్కు పల్కవచ్చునె నీకున్. 112

ఉ. భూనుతలీల మున్ వ్రతముఁ బూనితి రెడ్డియు నిత్తుమంచు జం
గానకు వారకాంత నిడఁగా నొనగూడనియంతమాత్రనే
దీనతఁ బల్కఁ బాడియె సుధీజనులెల్ల హసింప? నెందు నే
నేనుఁగు నెక్కి చక్కి నవనీశ్వర! శక్యమె దిడ్డి దూఱఁగన్. 113

చ. అను వినుతాంగిపల్కులు దినాధిపవంశపయోధిపూర్ణిమా
ఘనజవిరోధి యెంతయు నవారితమోహనిబద్ధచిత్తుఁడై
విని యొకయింత సొమ్మసిలి వేగమె తెప్పిరి యోనెలంత! యి
ట్లన గతి గంటిఁగాక తగదా మది నీక్రియ నూహసేయుటల్? 114

క. ఆడినమాట తగ న్విడ, నాడక కైకొన్నమాత్ర నకటా మదిలో
నోడక విటునిరువకు నీఁ, బాడియె సువివేక ముడిగి పంకజగంధీ! 115

తే. పద్మదళనేత్ర! నిన్నెడబాసి యొక్క, నిమిషమేనియు నోర్వఁగ నేర్చు బెట్లు?
పరమసాధ్వివి నిన్నిట్లు పల్కినట్టి, తప్పు క్షమసేయుమా మది దయదలిర్ప. 116

క. ఈయెడ నింతయు నానతిఁ, బ్రోయక గైకొంటి వెమ్మెతో మతి యెందున్
నీయట్టిసతులు గలరే, వేయాఱులలోననైన విమలేందుముఖీ! 117

ఉ. చంచలనేత్రి! నామదికి సమ్మతిగా నిపు డొక్కమాట యూ
హించి దయ న్వచింపుము మహిం జిరకీర్తు లనేకభంగులన్
నించు మటంచుఁ బల్కుటయు నీలమధువ్రతవేణి నేరుపు
మ్మించఁగ నన్నరేశుని లలిం గని యిట్లనెఁ బ్రోడజాడలన్. 118

తే. క్షితిప! యిటుల విచారంబు సేయుచుండి, చిన్నమాటలు పలుకంగఁ జెల్లదిదియుఁ
గాక మత్స్వాంతవృత్తియుఁ గనుఁగొనంగఁ, దలఁచితేనియువినుము డెందమునవలర.

సీ. జననాథ! విను హరిశ్చంద్రావనీంద్రుండు గాధేయుకౌ నను లోకంబు లెఱుఁగ
ధారుణీభారమంతయు వేగఁ బోనాడి తనపొలంతిని బుత్త్రి నొనర నమ్మి
మునుకొని యంత్యజన్మునివెంట మధుమాంసములు మోచుచునువానిఁ గొలుచుచున్న
నంత నవ్విభునిసత్యవ్రతంబున కాత్మఁ గరుణించి నిజభక్తవరదుఁ డైన
తే. కాశికావల్లభుఁడు జగత్కారణుండు, విశ్వనాథుండు చండికాధీశ్వరుండు
ప్రేమ సాక్షాత్కరించి యభీష్ట మొసఁగి, కావఁడే వారి నత్యంతకౌతుకమున! 120

క. నీ నాడినవాక్యం బిపు, డేవిధముననైన నిర్వహించిన దానన్
భావజదమనుఁడు కరుణం, బ్రోవఁగలం డాత్మ నెఱి భూవరతిలకా! 121

ఆ. భక్తి విడకయుండు భిల్లాణి! యివ్వేళ, మది దృఢంబుమీఱ మట్టుపఱచి
సేయుకార్య మిఁకను జింతింపవలవదు, నాకునైనఁ గడువినమ్రగతిని. 122

సీ. అను ఘనజఘనఁ గన్గొని యను జనపతి విను వినుతాంగి! శోభనత దనర
నీచిత్త మరయంగ నీచందమున నొత్తి చూచితి నిజమది చోద్య మలర
నిరుపమహృదయంబు లేకమై యుండినఁ గోర్కెలన్నియు నొనఁగూడఁగలవు
మొనసి నిన్నీవేషమున నొసంగినయప్పు డప్పిటపరుఁడు క్రోధాత్ముఁ డగుచు
తే. వారకామిని దేకిటు లూరిలోన, పరుని నెడబాసి యొంటిమై సరవి నున్న
యట్టిమగనాలిఁ దెచ్చి తీసుచు నొల్ల, కాజ్ఞ యొనరింపఁగలఁ డమితాగ్రహమున.

క. కావున నిన్నీరూపము,తో విటశేఖరునికడకుఁ దోడ్కొనిచనఁగా
దీవేళ వేశ్యకామిని, వై వేగమె రమ్మటంచు ననిచినయంతన్. 124

క. అంతిపురి కరిగి యయ్యాలి, కుంతల వెలయింతి యగుటకుం జనుచున్నన్
ఆంతం గని యెంతేనియు, సంతసమున మల్లికాంబ సపతికి ననియెన్. 125

శా. కల్లల్గావు విరాళిఁ గొన్నవిటజంగం బంగనం గోరుచో
నుల్లం బెల్లను బల్లవింప నను నీ నొప్పింపఁ గోచల్లచూ
భల్లాణక్షితిపాలశేఖరునకుం బట్టంపుఁబూఁబోఁడి వై
చెల్లంబో యిటువంటిమల్కనిపను ల్సేయంగ నీ కర్హమే? 126

క. ఓయప్ప వారకామిని, గా యిప్పు డలంకరించి కర మొప్ప మనో
నాయకునికడకుఁ దోడ్కొని, వే యరుగఁగదమ్మ నన్ను వికచాబ్జముఖీ. 127

తే. అనెడుకూరిమిసవతి నెంతేనిఁ గరుణ, మీఱ నవ్వారిజాక్షి తా గారవించి
పలుకు నిట్లని యోముద్దుకలికి మేలు, చెలఁగి నీబుద్ధి వేవేలు సేయఁజాలు. 128

ఉ. నీరజగంధి నీవనుచు నే ననుమ న్మది భేద మెద్ది యొ
వ్వారికతంబునన్ వ్రతము వంచన నొందక యుండి భక్తి యొ
ప్పారినఁ జాలు నీవ చను మాత్మ గ్రహించి చిపుడట్టు లుండఁగా
నేరవు కామశాస్త్రగతి నిక్క మెఱుంగవు ప్రోల వారయున్ 129

క. ఇభరాజయాన వినుమ ని, విభుకౌఁగిట మెలఁగుచుండు వివిధమంతయుఁ గా
దభినవవిలాసమశర, నిభుఁ డయ్యతి రతిరహస్యనిపుణుఁడు సుమ్మీ! 130

ఉ. చొక్కులఁ దక్కుల న్నిగుల సొంపగు తేటమిటారిచూపులన్
జక్కనిమందహాసములఁ జారువిలాసముల న్సలీలఁ బెం
పెక్కుడుదివ్యవాసనల నింపగుతియ్యనిముద్దుపల్కుల
న్నిక్కపువారకాంతకరణిన్ వలపింపవలె న్భుజంగునిన్. 131

తే. మఱియు వసమాస్త్రశాస్త్రప్రమాణసరణిఁ, దవిలిపురుషాయితాదిబంధములయందుఁ
బ్రోడ వై కూడవలయు నేర్పునఁ జెలంగి, పల్లవునియుల్ల ముల్లనఁ బల్లవింప. 132

క. అటుగాక హృదీశ్వరుచెంగట నే నియ్యకొని వచ్చి క్రమ్మఱ నిపు డో
కుటిలాలక! నిన్నంపినఁ, బటుపైఖరి వలుకఁడే నృపాలుఁడు చెప్పుమా? 133

తే. అని సవతి నూరడిలఁ బల్కి యాక్షణంబ, చల్లమాదేవి తుది లేనిసంతసంబు
దనరఁ బతిహితమునకు నై తా నె వేగ, మున నలంకృతి యొనరించుకొనఁదొడంగె.

తే. సుందరులు గొంద ఱప్పు డయ్యిందుముఖికిఁ, గుందనపుబిందియలయందు బొందుమిగుల
నెంచఁగలిగినపన్నీరు నించి చాల, నంద మొప్పార జలకంబు లార్చి రొగిని. 135

క. ఉడురాజవదన యొక్కతె, తడియొత్తె న్రాజసతికి ధౌతాంబరముల్
వడిఁ దాల్చె నొసఁగె సొగసుగఁ, గడువేడుకతో నొకర్తు కాంతామణికిన్. 136

ఉ. సొంపుగ నింద్రనీలమణిశోభల నేలఁగఁ జాలి సోగలై
పెంపెసలారుముంగురులఁ బెద్దయుఁ గ్రొమ్ముడి దిద్ది దిక్కులన్
ముంపుచుఁ బెంపుమీఱెడుసమున్నతదివ్యసుగంధయుక్తమౌ
సంపెఁగదండఁ జుట్టె నొకసారసనేత్ర నృపాలపత్నికిన్, 137

ఉ. ముద్దులగుమ్మ యొర్తు చెలిముందర గొప్పమెఱుంగుటద్దము
న్దద్దయు నిల్పె నొక్కవనితామణి కస్తురిబొట్టు మోమునం
దిద్దెఁ బడంతి యొర్తు సొరిది న్మకరీసుమరేఖ లెంతయున్
ముద్దియచెక్కుఁ జెక్కులను మోహనలీల లిఖించె నేర్పునన్. 138

చ. కలువలఁ గేరుచంద్రముఖి కన్గవ నొక్కవధూలలామ చె
ల్వలరఁగఁ గజ్జలం బిడియె నజ్జనిభానన యొర్తు వేడ్క రం
జిలఁగను నీలవేణి జిగిసిబ్బెపుగుబ్బలపైని జొబ్బిలం
గలప మలందె నంచితసుగంధయుతంబుగఁ జిత్రవైఖరిన్. 139

సీ. చారుముక్తాహారవారము గ్రీవమున నించె వేడుక నొక్కమించుబోఁడి
సౌవర్ణకర్ణభూషణము లందముమీఱఁ దగిలించె నొకశీతధామవదన
ఘన మైనపచ్చలకడియంబు లిరవుగాఁ బెట్టెఁ జేతుల నొక్కబిసరుహాక్షి
కమనీయరత్నసంఘటిత మై చెలువొందుమొలనూలిడియె నొక్కమోహనాంగి
తే. పాదములనందియలుబెట్టెభామయొకతె, నుదుటఁజేర్చుక్కనిడెనొక్కసుదతిమఱియుఁ
జేరుగలభూషణములెల్లఁ బ్రేమ నిడిరి, రమణు లింపార నప్పుడారాజసతికి. 140

వ. ఇట్లుగన్యాశృంగారధారిణి యై యనంతరంబ. 141

సీ. ఘనసారచందనకస్తూరికాముఖ్యదివ్యగంధంబులు దిశలఁ బర్వఁ
గింకిణీనూపురక్రేంకారనాదము ల్కడునింపుమీఱ నొక్కటఁ జెలంగ
ఘనరత్ననికరసంఘటిత మై తనరారు నవ్యకాంచనభూషణములు మెఱయ
భూరికుంతలబంధభారంబుచే మించి మంద మై నడకలు సందడింపఁ
తే. పీనకుచకుంభయుగళంబు పేర్మిఁ బొదల, లలితశృంగారలీలావిలాసములను
వాసి మీఱంగ నమ్మహీవరునికడకు, నింతి యరుదెంచె మదనునిదంతి యనఁగ. 142

క. ఈరీతి నతులతరశృం, గారము దనరారవారకాంతయుఁ బోలెం
జేరి తనయెదుట నిలిచిన, నారీమణిఁ జూచి ధరణినాథుఁడు వేడ్కన్. 143

క. ఈలలనారత్నం బీ, నీలాలక యీవినిద్రనీరజముఖి యీ
లీలావతి తగు నాఁ దన, పాలిటిజంగమున కంచుఁ బ్రణుతించి వెసన్. 144

తే. భూమివిభుఁ డంతఁ దన కుంతిపురము వెడలి, నెలఁతఁ దోడ్కొని యరుగుచో నింగినుండి
చూచి సురకాంత లెంతయుఁ జోద్యమంది, యెల్లవారును దమలోన నిట్టులనిరి.

సీ. ధారుణీశ్వరుబుద్ధి పూరి మేసంగెఁబో సరగ నెం దుండియో జంగ మొకఁడు
చేరి వారాంగనఁ గోరినతఱి నియ్య గొనకొని యిచ్చుటఁ గొదువ కాని
తనభక్తి చెడకుండఁ బనివడి వేశ్యగా నిల్లాలిని నొసంగె నిట్టిచిత్ర
మెప్పుడు ననువార లొకకొందఱును భళా చాన యొక్కతె యైన మానవేంద్రుఁ
తే. డేటికి నొసంగు ముద్దియ లిద్ద ఱగుటఁ, జేసి వారలు తమలోనఁ జెలఁగి పోరు
చున్నఁ గన్గొని యిపు డిచ్చుచున్నవాఁడు, గాని నిక్కంపుభక్తి కాఁ గలదె యిటుల?

క. ఇచ్చిన నిరుపుర నొక్కట, నచ్చం బగుభక్తితోడ నర్పింపక యీ
కుచ్చితములు తగ వనుచున్, మెచ్చక యొకకొంద ఱేమిమే లనువారున్. 147

చ. పురములు వాహనంబులును భూషణముల్ ధనధాన్యముల్ సువాం
బరములుఁ బాఁడిధేనువులుఁ బ్రార్థన సేయక జంగమయ్య యే
తెఱఁగున వేశ్యఁ గోరె! నతిధీరత నట్లతఁ డింతిఁ గోరినన్
ధరణిపుఁ డెట్టు లియ్యకొనెఁ! దా నని పల్కెడువారు కొందఱున్. 148

క. ఇయ్యకొని వారసుందరి, యొయ్యెడలం గ్గకున్న నిల్లాలి నిటుల్
చయ్యన నొసఁగుట ఘనతయొ, యియ్యిలపతి కనుచుఁ గొంద ఱెన్నెడువారున్.

సీ. ఆసరోరుహనేత్ర యైనఁ గా దన కిట్లు పతివెంట వేశ్యయై భవ్యగతిని
జనినంత భక్తియే యనువారు కొందఱు గట్టిగా భక్తిమార్గంబు పూని
నప్పుడే భక్తుండు చెప్పినవిధ మెల్లఁ జేసిన నిల్లాలు సేయకున్న
నది యపో చిత్రం బనువారు గొందఱు సతికి భర్తకు నొక్కమతియ యైనఁ
తే. గల్గు నభిమత మిది కల్ల గాదు నృపుఁడు, లీల నీజంగమునకు నిల్లాలి నొసఁగి
హరుని మెప్పించి బొందితో నరుగఁ గలఁడు, సరగఁ గైలాసమునకెల్ల జనులు నెఱుఁగ.

క. అనువా రొకకొందఱు నై, కనుఁగొన నవ్వేళ నృపతి కాంతామణిఁ దో
డ్కొని చని యలజంగమునా, యనిసన్నిధి నునిచి యిట్టు లనియెం బ్రీతిన్. 151

క. తగుచిగురుబోఁడిఁ దెచ్చితి, నొగి మీరుఁ బరిగ్రహింపుఁ డో సామి! యనన్
నగుమొగ మలరఁగ నపు డ, జ్జగతీపతితోడ యోగిచంద్రుఁడు పల్కెన్. 152

తే. రమ్ము భల్లాణ నిక్కంపురాజ వనుచు, నెమ్మదిని జాల నీమాట నమ్మియుంటి
నెంతదడవయ్యెఁ బడఁతిఁ దే నేగి యిపుడు, పూని నీమోజ యెంతైన మానఁ గలదె?

క. రంగుగ జంగమవిటుఁ డను,చుం గడు నిబ్బరంగఁ జూడకఁ జూచితొ తలఁపన్
వెంగలివి భూప! నీ కే, సంగతి వలరాదు మానసము నామీఁదన్. 154

సీ. కామాంధకారి నై కడఁకతో నీరాకఁ గాచుచుండఁగ మూఁడుకన్ను లయ్యెఁ
దలమేలు బరువయ్యెఁ దగ మేను సగమయ్యె గళమూలమునఁ జందునిలుకడయ్యె
వలనొప్ప ముసుకటివగ దప్పె వలపును విరిగెను నడురేయి సరవి నయ్యె
నా కేటి కీవేశ్య నీ కేటి నిజభక్తి బూటకంబులచేతఁ బ్రొద్దుగడపి

తే. నాఁడవింతియు కాక భూనాథులెచట?, వ్రతము లెచ్చట? ఘనశైవమతము లెచట!
నెందుఁ గొఱగానిపొలఁతుక నిటులఁ దెచ్చి, యందుకొమ్మనువా రెందునైనఁ గలరె.

వ. అని వెండియు నిట్లనియె. 156

తే. అనవలసి నిన్ను నిటువలె నంటిఁ గాక, తగునె వేశ్యలతోఁ బొందు తాపసులకు?
వలసితివి భూప! మాకునై యధికముగను, దీనిఁ గైకొమ్ము నీవైనఁ బూని యిఁకను.

సీ. అనువిటవరునిఁ గన్గొని వినయోక్తి నిట్లను మనుజాధీశుఁ డనువుమీఱ
నయ్యలు మీ రెట్టు లాడినఁ దగుఁ గాక క్షితి నయ్యలకుఁ దెచ్చుచిగురుఁబోండ్ల
నవ్వలుగాఁ జూడ నర్హంబు మాకును దవిలి మీ కిట్లాడఁ దగునె మమ్ము?
నాఁకలి గొన్నచో నన్న మెవ్వరికైనఁ గలిగిన నిడి నాడఁ గాదు సుమ్ము

తే. మీ మదికి సంతసం బైన మీననేత్ర, నరయుచుండంగఁ దడవయ్యె నయ్య యింకఁ
దప్పు లెన్నక కైకొమ్ము తరుణి నిపుడు, కరుణ నని భక్తి నడుగుల కెరఁగుటయును,

క. నృపతిఁ గృపఁ జూచి యపుడా, కపటపువిటజంగమయ్య కడునవ్వుచు నో
తపనకులవర్య! యోర్మిఁగ, నిపు డాడితిఁ గాక సాటి యేరీ నీకున్. 159

ఉ. కావలె నన్నమాత్రమునఁ గౌతుకముం జెలువాఱఁగాను రా
జీవదళాక్షిఁ దెచ్చితివి చెన్నలరన్ బదివేలు సేయు నీ
భావజుచేతి మేలినుపబంగరుబొమ్మను ముద్దుగుమ్మ న
జ్జీవునకు న్విధాతకును శేషునకుం దరమే నుతింపఁగన్? 160

క. ముద మొదవఁగ నళిచందురుఁ, గనుమఁ దివురునువిదనుగురు కడుఁ బొదలెడుతు
మ్మెదకొదమకదుపుఁ జెదరఁగ, నదలించు న్సుదతి మృదువు లౌ పెన్నెరులన్.

క. వాసిగ నీసుదతీమణి, నాసము నాసమె యంచు నవగంధఫలి
న్భాసురగతిఁ గన్గొని సరి, హాసం బొనరించు సంతతాంచితలీలన్. 162

తే. చెలఁగి జగములు గెలువంగఁ దలఁచియిడిన, మరునిబలుసింగిణీవిండ్లు తరుణిబొమలు
కడఁక నవ్వింండ్లఁ బూన్చినకలువతూఁపు, లీపయోజాననమిటారిచూపు లరయ.

క. చిగురాకు కెంపుబింబము, పగడంబును జెందిరమును బంధూకము ని
మ్మగువయధరమ్ముతోడుతఁ, దగునే తుల యనఁగ నెట్టితావుల నైనన్? 164

క. పలువరుస మొల్లమొగ్గల, పలువరుసలఁ గెల్వఁ జాలు భామినినునుజె
క్కులు తళుకుటద్దములతోఁ, గలహించుం దొమ్మిదులను గణ్ణము తెంచున్. 165

తే. చెలువపలుకులు గండుఁగోయిలల నేలు, నెలఁతచిరునవ్వు తేఁతవెన్నెలల నవ్వుఁ
గలికికంఠంబు క్రముకంబు నలరు భిన్న,ములుగఁగావించు నెంతయుఁజలముమీఱి.

చ. పరువడి నంచితంబు లగుబాహుమృణాళములొప్ప గొప్పలై
యఱుతను వ్రేలుమౌక్తికపుహారములంచులఁ జీరులాడఁగా
గుఱుతుగ నవ్వెలందికుచకుంభయుగం బలరు న్మనస్సరో
వరమున సంభవించి చెలువం బగుతామరమొగ్గలో యనన్. 167

సీ. నునునల్లచీమబారును గేరు నూఁగారు వళు లబ్ధివీచికావళుల నేలు
నిసుకతిన్నియలతో వెసఁ బోరుఁ బిఱుఁదులు కరితుండములనెగ్గులరయుఁ దొడలు
మెఱయుకాహళులతో మొనయును జంఘలు పాదయుగ్మము కచ్ఛపములఁ దోలు
నఖపంక్తి పలుమాఱు నగుఁ దారకంబుల నడలు రాయంచలఁ దొడరి యొంచు

తే. మేలిమిపసిండిచాయల గేలిసేయుఁ, బూని నిక్కంబుగా దీనిమేనికాంతి
యెందు నిటువంటిచెలు లైనయిందువదన, కలదె పరికింప మార్తాండకులవరేణ్య.

క. అని వనిత నెంచి యాగురు, వను నోజననాథ! నీగృహమునకు మముఁ దో
డ్కొని చను వేగము యిఁకఁ ద, క్కినతావులు వలదను మ్మొగిన్ మాకనుడున్.

క. నరపతి వల్లె యని య, గ్గురునకుఁ గైదండ యిచుచుఁ గొమరొప్పఁగ నా
యిరువురఁ దోడ్కొని తనమం, దిరమునకుం దెచ్చి యునిచి తిర మగుభక్తిన్.

గీ. అర్ఘ్యపాద్యాదు లొసఁగి ప్రహర్షఁ జేసి, యిలు వెడలివచ్చితగఁదనవెలఁదికనియెఁ
గలికి! యిన్నాళ్ళు నాయక్కఁ గౌఁగిలించు,వరుసనీజంగమయ్యకీవలయుఁ జామ్ము.

క. కాదేని దునియలుగ వడి, మోఁదెద నని చేత ఖడ్గముం బూని మహా
హాదమున నుండె నొకదరి, నాదిత్యకులాంబునిధిశశాంకుఁడు పేర్మిన్. 172

ఉ. ఆయ్యెడఁ జల్లమాంబ విభునానతిఁ గైకొని వాఁడిచూపు లొ
య్యొయ్యన మీఱ లేనగవు లొప్పఁగఁ జెక్కులఁ బాఱఁదీవిమైఁ
బయ్యెదజాఱ ముద్దునునుఁబల్కులు చెల్వలరార నవ్విటుం
జయ్యనఁ జేరి మ్రొక్కి నెఱజాణగు టెల్ల నెఱింగి రంగుగన్. 173

క. చెఱకులు గొబ్బరియును శ,ర్కరయుం బాలును ఘృతంబు కలపంబులునున్
నెఱి ఫలరసాన్నములు గ్రొ,వ్విరులు న్గడునొసఁగి యంత వేడ్కలుమీఱన్. 174

గీ. పండుటాకులుకపురంబుభాగములును, ముత్తియఁపుఁజూర్ణమునుగూర్చిముగ్ధవిడెము
చుట్టియొసఁగుచుఁ బవళించి సుభగలీల, నున్న యద్దేవుచరణంబు లొత్తుచుండె.

క. పరిభాషింపఁగఁ జూచిన, మఱి యావిటుఁ డించుకైన మాఱాడక ను
స్థిరముగ నుండిన వమ్మద, కరిగామిని యతనితోడఁ గడువడి ననియెన్. 176

సీ. ఏవిచారములేక యిటు లున్నఁ జెంతను జేరిన మే లేమి వారసతికిఁ
బల్కరించిన మాఱుపల్కవు మూఁగలాగున రతిసేయంగఁ గోర విపుడు
సిగ్గుచేఁ బోరియంగ శిశువ వింతయుఁ గావు కడురూఢి నున్నావు గండుమీఱి
యిత్తఱి నీకింత మెత్తతనం బేల జాగు మానుము ప్రొద్దు చాల నరిగెఁ

తే. బురుషుఁ డొగిఁ జేయి సేయకే పొలఁతిచేయి, చేయరాదనిచూచినఁ జెలఁగియున్న
కొదువ లెన్నఁదలంచియో గుట్టుతోడ, నున్నవాఁడవు? నీ కిది యొప్ప దనఘ! 177

చ. సరసము మీఱఁ గేరుచును శయ్యకుఁ దారిచి కౌఁగిలించి సు
స్థిరముగ మోవి యాని నునుఁజెక్కులు గోళుల నొత్తి లీలఁ బ
ల్మఱు మరుకేళిఁ గూడి చెలిమానసముం గఱఁగింపకున్న నె
న్నరు నరు లింతయు న్మగతనం బని పూని భుజంగపుంగవా! 178

క. అగుఁ గాని లెమ్మటంచుం, జిగురాకుంబోఁడి యతనిఁ జెనకినఁ దా ని
మ్ముగ లేవక స్థాణు వనం, దగియున్న మహాత్ముఁ జూచి తనలో ననియెన్. 179

చ. శివశివ! సేవయెంతయును జేసినఁ గైకొనుఁగాని యీవిట
ప్రవరున కించుకేనియును బొడము మోహము నెమ్మనంబునం
దవి లిపు డెంత లెమ్మనుచుఁ దా బతిమాలినసుం గఱంగఁ డీ
భువిఁ జలికూటిపై నిడినఁ బొం దలరారెడువెన్నకైవడిన్. 180

సీ. నిక్కువంబుగఁ దూర్పుదిక్కు వెల్వెలఁ బాఱెఁ జక్కనొక్కటవేఁగుఁజుక్క పొడిచె
దామ్రచూడంబులు తవిలి కూయఁదొడంగెఁ జదలున నుడులు తేజంబు తప్పె
జారచోరాదులసంచారములు వాసెఁ గమలాప్తుఁ డుదయించుసమయ మయ్యె
నిపు డైన మరుకేళి నిచ్చ సేయఁడు మంకుజంగ మివ్విటచిహ్న చనునె యొందు?

తే. ఈశ్వరా యెట్టిచిత్రంబొ యిది! యటంచుఁ, దత్తరింపక విభునిచిత్తంబు గాను
బలిమినైనను గామింతు నలర నితని, ననుచు విరిపాన్పుపై నెక్కె యవ్వధూటి.

సీ. ఘనతరంబుగ దీపకళికలు నల్గడ వెలుఁగఁ గప్రపుధూపములు చెలంగఁ
గాంచి సమంచితఘంటానినాదము ల్మొఱయఁ బుష్పాదిభూతికరణిఁ దనరఁ
బరిమళాదులవింతబాగులు చెలువార సొగసుపల్కులు శివస్తోత్రములుగ
నలర సన్మణిగణంబులు హారతులలీల నమరంగ ఫలరసాన్నములు చాల

తే. లింగనైవేద్యములభంగి రంగుమీఱ, నతివ శివరాత్రి చేసెడుగతిని దనర
దేహ మభవున కర్పింపఁ దివిరి యపుడు, కరయుగము చాఁచి తుదిలేని కౌతుకమున.

క. ఆలింగని నొనరఁగఁ దా, నాలింగనమునకుఁ దివియ నమ్ముద్దులప్రో
యాలిం గని మెచ్చి హరుం, డాలో నెంనాళ్లబాలుఁ డై తగ నిల్చెన్. 183

తే. శంభుఁ డాచల్లమాంబహస్తములలోన, నివ్విధంబున బాలుఁడై నివ్వటిల్లి
యవ్వేలందుక మదిగట్టిదనుచు నోలిఁ, జనులఁ జేఁపూర వాపోయెఁ జన్నుఁగుడువ.

సీ. అది విని చాటున నొదిగియున్న నృపాలుఁ డనె సతి కద్భుతస్వాంతుఁ డగుచుఁ
బొలఁతిరో! యిది యేమి పుట్టుగో ద్రావై యున్న దానికిఁ జోద్య మొప్ప నిట్లు
శిశువు వాపోయెడిఁ జెప్పు మటంచుఁ దా లోపలి కేగక లోఁతు దెలియ
నడిగిన నిట్లను నవనీశ! కంటివా మెచ్చుగా మిండఁడై వచ్చినట్టి

తే. యొడయఁ డిప్పుడు బాలుఁడైయుండి పొగులు, చున్న వాఁడనఁ గ్రమ్మర నువిదతోడఁ
దరణివంశాంబునిధిశీతకిరణుఁ డైన, ఘనుఁడు భల్లాణధారుణీకాంతుఁ డనియె. 185

క. బాలుని కివ్విటపద్ధతు, లేలా వల దనుచుఁ జెక్కు లిరుగడ నొనరన్
వ్రేలుమును వేసిఘృతమును, బాలును బోయుము చెలంగి బాలేందుముఖీ! 186

తే. నావుడు లతాంగి యిట్లను భూవరేణ్య, పాలు ద్రావఁడు కొట్టంగఁ గేలు రాదు
మూఁడుకన్నుల నలరి యున్నాఁడు చూడ, నితరులకుఁ జెల్ల దివ్వింత యింతయైన.

తే. అనుడు నృపుఁడింతిఁ దోడితెమ్మనియొడయని, నివ్వలికి మూఁడుకన్నుల యీశ్వరుండు
నెట్టిగోట్లను జేసి నన్ వేశ్య నడిగి, కొసరి మనభక్తి దెలియంగఁ గోరెనిట్లు. 188

క. అనుటయు బాలునిఁ దోడ్కొని, యనితొరత్నంబు వేగ ద్వారము వెడలన్
ఘనుఁ డాశంకరుఁ డంతట, మునుపటితనచిఱుతచందములు మానె వెసన్. 189

సీ. జడలలో మిన్నేఱు జాబిల్లిసికపువ్వు పులితోలు నునుశూలు పునుకసరులు
చేత ముమ్మొనవాలు చిలువసూడిగములు నొసటమిక్కిలికన్ను విసపుఁగుతుక
వెలిమిడి మెయిపూఁత తెలిగిబ్బ తత్తడి సగమేన గట్టులసామిపట్టి
మొగమునఁ జిఱునవ్వు మిగులఁ గూరిమిచూపు వన్నెమీఱెడుపాఁపజన్నిదములు

తే. నలర నలువయు వెన్నుండు నఖిలసురులు, మునులు ప్రమథులు గొల్వసమ్మోదమునను
భవుఁడె సాక్షాత్కరించెఁ గృపాసముగ్రుఁడగుమభల్లాణు నెదుట నత్యద్భుతముగ.

తే. అవ్విధంబునఁ బ్రత్యక్షమైనయట్టి, యవ్విరూపాక్షుఁ గాంచి సాష్టాంగ మెఱఁగి
ముదముతోడుతఁ గేల్దోయి మొగిచి యునని, నాయకుండిట్టులనినుతి సేయఁదొడఁగె.

చ. జయ జయ నీలకంఠ! పురశాసన! శంకర! ద్విడ్భయంకరా!
జయ జయ శాంభవీరమణ! చంద్రవిభూషణ! భక్తపోషణా!

జయ జయ దేవదేవ! మదసామజభంజన ! యోగిరంజనా!
జయ జయ ఫాలనేత్ర! విలసద్గుణమండన! దైత్యఖండనా. 192

లయగ్రాహి. నారదతుషారకలపారదపటీరశరశారదవిశాలతరనీరదనిభాంగా!
వారణాసురాహితవిదారణ ! జగద్భరణకారణ ! మహాభయనివారణ ! భృతైణా!
సూర! గణనాథ! శ్రుతిపారగ! జగన్నుత! ఘనోరగవిభూష! రిపుహార! గరళాంకా!
సారసభవార్చిత ! సుధీర! సముదంచితకృపారససమగ్ర ! ఘనసారసమహాసా. 193

దండకము. జయ గిరిశ! సురేశ ముఖ్యామరస్తోమమాళిస్థిత స్నిగ్ధచామీకరోదగ్రరత్నప్రయుక్తావతంసప్రభాసంచయాంచత్పదాంభోరుహా! భక్తలోకామరోర్వీరుహా! హారనీహార కర్పూర డిండీరమందార గోక్షీర హారావళీ చారుకీర్తిప్రకాశా! మహేశా! కపర్దాంచితేందుప్రభామండలప్రస్ఫుటద్దివ్యకల్లోలినీకైరవేందీవరా! ధీవరా! గ్రావరాట్కన్యకాచారువక్షోరుహద్వంద్వలిప్తాంగరాగప్రదీప్తోరువక్షోంతరా! సంతతోద్యత్సరోజాతజాతాండభాండోదరా! భూరివేదండ చర్మాంబరా! తాండవాడంబరా జంభజిద్రత్నశోభావిడంబోజ్జ్వలత్కంఠ హాలాహలా! వాలఖిల్యాదియోగీంద్రహృత్పంకజేందిందిరా! సుందరాకార! లోకైకవీరా! సువర్ణాద్రిధీరా! భుజంగేంద్రహారా! మహోదార! వారాశిగంభీర! నారాయణస్తోత్రపాత్రాంచితానందచారిత్ర నీదివ్యచారిత్రముల్ శ్రీశ వాగీశ భోగీశ దేవేశులున్ వర్ణనల్ సేయఁగాఁ జాలరే నెంతవాఁడన్ మహామూఢుఁడన్ నీవు కారుణ్యభావంబుతో నన్ను రక్షింపనూహింప నీరీతిఁ బ్రత్యక్షమై నిల్చి బ్రహ్మాదులున్ సిద్ధయోగీంద్రులున్ గానలేకుండు నీపాదకంజాతయుగ్మంబు వీక్షింపఁగాఁ జేయుటంజేసి నే ధన్యతం జెందితిన్ బూని లోకంబులన్ సత్పదార్థంబుఁ గానంగలేకుండుచుండాన నత్యంతమాయాంధకారంబుచేఁ జిక్కినిం గానఁగాలేక దైవంబులంచున్ పడిన్ తానెల్లన్ సమర్పించియుం దేమియున్ మేలునొందంగ లేకుండు రెంచన్ ఘనుల్ గొంత తిమ్మైన సుజ్ఞానదీపంబు దీపింపఁగాఁ జేసి తత్త్వంబునుం గాంచి వాంఛార్థముల్ గొందు రానందలీలన్ చిదానందునిన్ గొల్చి ముక్తికాంతామణిం జెంది శశ్వద్విభూతిం బ్రకాశించుచున్నట్టి సద్భక్తసంఘంబులంబోలె నన్నుం గృపాదృష్టి నీక్షించి రక్షింపు మీశా! వియత్కేశ! పాపౌఘనాశా! నమస్తే నమస్తే నమః 194

క. ఇచ్చెద నేవరమయినను, హెచ్చుగఁ బ్రార్థింపు మిప్పు డిమ్ముగ మాతో
నెచ్చటనైనం దుల యన, నచ్చు నిజం బైనభక్తవరు లిలఁ గలరే? 195

చ. అడిగిన లేదటంచు విడనాడక నీదగు భక్తి చక్కఁగాఁ
గడుఁ గడుమట్టఁ జేసితివి కౌతుకముం జెలువార మేలు నీ

పడఁతిని వారకాంతఁగను బ్రౌఢి నొసంగితి నన్న సంశయం
బుడుగుము ధారుణీతలవరోత్తమ ! నిక్కము మానసంబునన్. 196

తే. సుతుఁడ నై యుంటి నీ కిపు డతులితముగ, జనకుఁడవు నీవు నీసతి జనని మాకుఁ
దిరముమీఱంగ నమ్మహాదేవితోడ, సాటిసుమ్ము ధరిత్రీశ ! నేటు సేయు! 197

చ. అని కృపఁ జేసి శంభుఁ డపు డంబిక కిట్లను నోవెలంది! యి
య్యినకులసాక్షుచంద మిపు డిమ్మలరం గనుఁగొంటె ! నేను వే
శ్యను వెసఁ గోర నియ్యకొని సద్గణికాంగన గల్గునన్న చోఁ
దనకులకాంత నే యొసఁగెఁ దథ్యముగా వెలయింతి బాగుగన్. 198

క. ఇతఁ డింతవిరహయోగుం, డితనికి మనలోక మిప్పు డీత్తమె యనినం
బతిపల్కులు తగ విని పా, ర్వతి దా నిట్లనియె మిగులఁ బ్రమదముతోడన్. 199

సీ. ఇందుకిరీట ! నీ కేక్షక్తిం రుఁ డైనఁ బ్రాణం బొసంగును భాగ్య మొసఁగుఁ
దలఁ దెంచి యొసఁగును లిఁ దనూజునిఁ గూరఁగా వండియొసఁగును గానియిటుల
మానంబు దిగనాడి మానిని నీరాదు మాన మిచ్చుటఁ జేసి మానవేశుఁ
డధికనిశ్చలభక్తుఁ డత్యంతసజ్జనుం డితనికి మనలోక మీయవలయు

తే. ననిన శర్వాణిపలుకుల కలరె నభవుఁ, డంతమునులును బ్రహ్మాదు లభినుతింపఁ
దొగలుముకుళింపఁ బద్మముల్ తగ హసింప, ధరణియుదయాద్రిపైఁ దోఁచెఁ దక్షణంబ.

సీ. దివి నప్సరోజనుల్ దవిలి నృత్యంబాడఁ గర మొప్ప గంధర్వపతులు పాడ
సకలదేవతలును బ్రకటించి పొగడంగ శుభలీల దివ్యదుందుభులు మ్రోయఁ
బుడమి నెల్లెడలను బుష్పవృష్టిం బొప్ప నరు లెల్లఁ దల లెత్తి యరసిచూడ
భల్లాణధరణీశుభామల నిరుపమభర్మవిమానంబుపైని వేడ్కఁ

తే. దనర నెక్కించుకొని కడు ఘనత మీఱఁ, బూని భల్లాణుతో జగంబులనుతింపఁ
దనర వృషభేంద్రు నెక్కి భూతలమునుండి, భవ్యుఁడు వేంచేసెఁ గైలాసభవనమునకు.

సీ. అనిన నయ్యీశ్వరుం డానందచిత్తుఁ డై గౌరియుం దాను ఘనతతోడ
భల్లాణభూపాలుఁ బ్రమథులలోఁ బెద్దఁ గాఁ జేసి పట్టంబుగట్టి మిగుల
మంగళగీతంబు లంగనల్ వెసఁ బాడ శంఖాదిరవములు సరవి మ్రోయ
నిరుగడ బ్రహ్మాదిసురలు సేవింపంగఁ బ్రమథగణంబులు బలిసి కొల్వ

తే. రమణతోఁ దానె తగ పరబ్రహ్మ మగుచు, జగములన్నియు నేలుచు శాశ్వతముగ
రత్నసింహాసనస్థుఁడై రాజసమున, నవిరళం బగుసుఖలీలఁ దవిలి యుండె. 202

సీ. అనుచు సూతుఁడు నైమిశారణ్యవాసు లై యలరుచుండెడు శౌనకాదులకును
రమణీయబసవపురాణోక్త మైనయీ భల్లాణరాయభూపాలచరిత

వినిపించు క్రమమున బనిమీఱ నానేర్చువిధమున రచియించి విమలభక్తి
దనర మీ కొసఁగితిఁ దగ మీర లిందులతప్పులు క్షమచేసి దయదలిర్ప
తే. నిమ్మహాకావ్య మెప్పుడు నిద్ధరిత్రి, నేర్పుతో విస్తరిల్లి బుధేంద్రులెల్లఁ
బొగడ నాచంద్రతారార్క మగుచునుండు నట్లు నొనరించి సుమ్ము ప్రోద్యమయ్యశర్వ!

క. వరవసులనుఁ గృతు లిడి యి, ద్ధరణిం గవివరులు సంపదలఁ బొందుదు రా
నెటి నిహపరసుఖముల కై, యురుబుద్ధిని నీకుఁ గావ్య మొసఁగితి నభవా! 204

క. ఈకథఁ జదివిన వ్రాసినఁ, బ్రాకటముగ వినినయట్టి భవ్యులకెల్లన్
శ్రీకరముగ నభిమతములు, చేకుఱఁగాఁ జేసి కరుణఁ జేయు మనంతా. 205

వ. అని యివ్విధంబున విన్నవించి. 206

క. కరతలధృతకురంగా!, చిరతరకరుణాంతరంగ! సింధునిషంగా!
కరిదనుజమదవిభంగా!, గురుజనహృత్పద్మభృంగ! కుక్కుటలింగా. 207

మణి. మురహరశరవర! మునిజనశరణా!, సురవరవరద! కుసుమశరహరణా!
చిరతరగుణ! విలసితకరహరిణా!, పరమపురుష! నిరుపమశశిభరణా! 208

మాలిని. సదమలతరరూపా! సర్వలోకప్రదీపా!
ముదితబుధకలాపా! ముఖ్యసత్యానులాపా!
విదళితఘనతాపా! విశ్రుతోద్యత్ప్రతాపా!
కదనతలసకోపా! కాంచనాహార్యచాపా! 209

గద్య. ఇది శ్రీమత్కుక్కుటేశ్వర వరప్రసాద లబ్ధ కవితా సామ్రాజ్య ధురంధర ఘనయశోబంధుర కౌండిన్యగోత్ర పవిత్ర కూచిమంచి గంగనామాత్యపుత్ర బుధజనవిధేయ తిమ్మయ నామధేయ ప్రణీతం బైన రాజశేఖరవిలాసం బను మహాకావ్యంబునందు సర్వంబును దృతీయాశ్వాసము.

చెన్నపురి: 'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1921.

ఆంధ్రగ్రంథములు.

		ప్రతి 1-కి రూ.	అ.
అచ్చతెనుఁగురామాయణము, శుద్ధప్రతి	...	1	4
రుక్మిణీపరిణయము, కూచిమంచి జగ్గకవిది	...	0	8
అనంతునిఛందము, ఛందోదర్పణము	...	0	14
అనిరుద్ధచరిత్రము, కనుపర్తి అబ్బయామాత్యప్రణీతము	...	0	8
అప్పకవీయము, నూతనముద్రితము	...	2	8
,, విమర్శనముమాత్రము	...	0	8
అంబరీషోపాఖ్యానము, సటీక (భాగవతము)	...	0	4
ఆముక్తమాల్యద, వావిళ్ల. రామస్వామిశాస్త్రిగారి వ్యాఖ్యానముతో మేలు కాకితములమీఁద చక్కఁగ మరల ముద్రించియున్నారము.		3	8
ఆంజనేయదండకము, హనుమద్దండకము	...	0	2
ఆంధ్రభాగవతము, పోతనామాత్యప్రణీతము, ఇదివఱకు ముద్రితమైన ప్రతుల కన్న అన్నివిధముల బాగుగనున్నది	...	6	0
డిటో అత్యుత్తమప్రతి, రెండుసంపుటములు	...	8	0
శ్రీమదాంధ్రభారతము-పద్యకావ్యము:—			
7 సంపుటముల ప్రతి	1-కి రూ.	15	12
3 సంపుటములప్రతి	...	15	0
ఆది, సభాపర్వములుగల సంపుటము	...	2	4
ఆరణ్యపర్వము ,,	...	2	4
విరాటోద్యోగపర్వములు ,,	...	2	4
భీష్మద్రోణపర్వములుగల సంపుటము	...	2	4
కర్ణశల్యసౌప్తిక స్త్రీపర్వములు,,	...	2	4
శాంతిపర్వము ,,	...	2	4
అనుశాసనిక, అశ్వమేధ, ఆశ్రమవాస, మౌసల, మహాప్రస్థానిక, స్వర్గారోహణపర్వములుగల సంపుటము	...	2	4
ఆదిపంచకము, ఒకటేసంపుటము	...	6	8
యుద్ధపంచకము ,,	...	4	4
శాంతిసప్తకము ,,	...	4	4
ఆంధ్రభారతవిమర్శనము, మల్లాది సూర్యనారాయణశాస్త్రి	...	0	8
భోజరాజీయము, నూతనముద్రితము	...	1	8

	ప్రతి 1-కి రూ.	అ.
బ్రహ్మోత్తరఖండము ...	1	0
ఆంధ్రబ్రహ్మాండపురాణము ...	5	0
ఆంధ్రలలితోపాఖ్యానము ...	1	8
ఆంధ్రభాషాభూషణము ...	0	2
ఆంధ్రభాషార్ణవము, అట్టబైండు ...	0	12
,, కాలికోబైండు ...	1	2
ఆంధ్రనామసంగ్రహము, ఆంధ్రనామశేషము, సాంబనిఘంటువు, టీకానుక్రమణికాసహితము ...	0	12
డిటో కాలికోబైండు ...	1	0
ఆంధ్రచంద్రాలోకము, సటీక ...	0	8
ఉత్తరరామాయణము, కంకంటిపాపరాజప్రణీతము, చక్కనికూర్పు ...	2	4
ఉత్తరహరివంశము, నాచనసోమనాథకృతము ...	1	8
రుక్మాంగదచరిత్ర, ఏకాదశీమాహాత్మ్యము ...	0	10
నీతిపద్యసంగ్రహము, సటిప్పణము ...	0	4
కళాపూర్ణోదయము, దళసరికాగితము ...	2	4
కాశీఖండము, చక్కని క్రొత్తకూర్పు ...	1	8
డిటో కాలికోబైండు ...	1	12
కుచేలోపాఖ్యానము, సటీక, (భాగవతము) ...	0	4
డిటో గట్టుప్రభుకృతము ...	0	6
కృష్ణరాయవిజయము, కుమారధూర్జటికృతము ...	0	8
గజేంద్రమోక్షము, సటీక, చక్కనికూర్పు ...	0	8
డిటో కాలికోబైండు ...	0	10
గోపీనాథరామాయణము, 2 సంపుటములు, శ్రీమద్రామాయణమునకు సరియైన పద్యము, కవనముమిక్కిలిసొంపు, పీఠిక అతివిపులము ...	7	8
రాజశేఖరవిలాసము ...	0	8
చాటుపద్యమణిమంజరి, క్రొత్తకూర్పు, ప్రథమభాగము ...	1	4
డిటో ద్వితీయభాగము ...	1	6
చెన్నబసవపురాణము, పాపకవికృతము ...	1	2
జైమినిభారతము, అశ్వమేధపర్వము, చక్కనికూర్పు ...	1	0
తారాశశాంకవిజయము, చక్కనికూర్పు ...	0	12
తెనుఁగుసమస్యలు ...	0	2